




www.voodayam.com

Estd :1999

# వుదయం








బుధవారం, నవంబర్ 12, 2025 | గుంటూరు | సంపుటి : 12 | సంచిక : 269 | వెల : రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM TELUGU DAILY

/VOODAYAM Simultaneously published from Guntur, Hyderabad, Adilabad, Khammam, Karimnagar & Warangal




## ఫోటోలకు ఫోజులిస్తే సరిపోదు...

**48మంది ఎమ్మెల్యే లకు.... చంద్రబాబు మాస్ వార్నింగ్..**

అమరావతి నవంబర్11(వుదయం ప్రతినిధి): పెన్షన్ల పంపిణీకి ముఖ్యమంత్రిగా నేనే హాజరవుతున్నా, ఎమ్మెల్యేలకు మాత్రం ఏమైంది? సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబాలకు అందచేయలేనంత బిజీగా కూటమి ఎమ్మెల్యేలు ఉన్నారా? ప్రభుత్వం సూచించిన కార్యక్రమాల విషయంలోనే ఇంత నిర్లక్ష్యంగా ఉంటే పార్టీ పట్ల మీ చిత్తశుద్ధిని శంకించొద్దా? పార్టీ నాయకత్వాన్ని మరీ ఇంత తేలిగ్గా తీసుకుంటారా?ఇలా పార్టీ నేతలను కఠిన ప్రశ్నలతో కడిగేశారు సీఎం చంద్రబాబుపార్టీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్యేల పనితీరుపై సమీక్ష జరిపి, అక్కడికక్కడే నిలదీశారు. పార్టీ సెంట్రలాఫీసుకు రావడం ఈవారంలో ఇది రెండోసారి.ఏ రాష్ట్రంలో ఇవ్వనంత పెన్షన్లిస్తున్నాం ఇదే పార్టీకి ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్ అందుకే దీన్ని పండుగలా నిర్వహిద్దాం అనేది చంద్రబాబు అభిప్రాయం. ప్రతీనెలా ఆరంభంలో ఆమేరకు శ్రమిస్తున్నారు కూడా. కానీ, కొందరు ఎమ్మెల్యేలు లైట్ తీస్కోవడం ఆయన దృష్టికొచ్చింది. ప్రజాసేవ అంటే తాత్కాలిక ప్రచారం కాదు, నిరంతర బాధ్యత అని ఎమ్మెల్యేలకు క్లాస్ పీకారు. సి ఎం ఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీ వ్యవహారంపై కూడా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. చెక్కులు ఇస్తూ ఫోటోలు ఇవ్వటం కాదు, బాధితులతో స్వయంగా మాట్లాడమని ఆయన ఎమ్మెల్యేలకు సూచన చేశారు

# మాదకద్రవ్యాలపై పోరు ఉధృతం చేయాలి

*డ్రగ్స్ హాట్ స్పాట్స్ పై ప్రత్యేక దృష్టిసారించాలి.*
*ప్రతి నెలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.*
*ఎన్ కార్డ్ ( ఎన్ కార్డ్ ) & నషా ముక్త్ భారత్ అభియాన్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ*

విజయవాడ నవంబర్11(వుదయం ప్రతినిధి): మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల బారిన పడకుండా యువతను చైతన్య పరచాలని, దీనికై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని ఏవీఎస్ రెడ్డి సమావేశ మందిరంలో ఎన్ కార్డ్ %డ% నషా ముక్త్ భారత్ అభియాన్ కమిటీ సమావేశానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించిన అనంతరం కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ... జిల్లాలో 217 డ్రగ్ హాట్ స్పాట్లను గుర్తించినట్లు చెప్పారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహించాలని ఆదేశించారు. గడచిన మూడు నెలల్లో ఎన్టీఆర్ జిల్లా ఈగల్ బృందం రైళ్లలో ఏడు సోదాలు (రైడ్లు) బస్సులు, బైకులు,గోడౌన్ల లో 10 సోదాలు నిర్వహించి డ్రగ్స్ ని సీజ్ చేసినట్లు చెప్పారు. దాదాపు 200 మంది డ్రగ్స్ బాధితులను గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి నగరానికి మాదకద్రవ్యాలు సరఫరా అవుతున్న పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఒడిశా నుంచి విజయవాడ మీదుగా ఉత్తరభారతానికి మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్న ముఠాను ఆటోనగర్ లో గుర్తించి ఐదు లారీలు, ఒక కారు సీజ్ చేసి, ఐదుగురిని అరెస్టు చేసిన ఈగల్ బృందానికి అభినందనలు తెలిపారు. డ్రగ్స్ సంబంధిత సమాచారాన్ని ఈగల్ నంబర్ 1972 కు తెలపాలన్నారు. డ్రగ్స్ బాధితులు ఆర్ఆర్ పేటలోని జిల్లా డి అడిక్షన్ కేంద్రం, విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉచితంగా చికిత్స, కౌన్సిలింగ్ సేవలు పొందవచ్చని చెప్పారు. ప్రతినెలా మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ఒక అవగాహన ర్యాలీని నిర్వహించాలని ఆదేశించారు. ఎన్జీవోలు విద్యా సంస్థలపై దృష్టి సారించి యువతను చైతన్య పరచి, డ్రగ్స్ వినియోగం వల్ల వచ్చే దుష్పరిణామాలను వారికి తెలియజేయాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం, నిల్వ, రవాణా, అమ్మకం ఎన్ డి పి ఎస్ చట్టం ప్రకారం నేరమని, వీరికి 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడుతుందని చెప్పారు.





సామాజిక బాధ్యతగా మాదకద్రవ్యాల నిరోధానికి తమ వంతు కృషి చేస్తామని కమిటీ సభ్యుల చేత కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో వివిధ ప్రతిభావంతులు, పిల్లలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడి కామరాజు, ఈగల్ సీఐ ఎం.రవీంద్ర, ఎస్పై ఎం.వీరాంజనేయులు, ఎస్ ఆర్ ఆర్ %డ% సివిఆర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ఎన్జీవోలు పాల్గొన్నారు.

# పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉపాధి కల్పనకు ప్రత్యేక కృషి

- విమానయాన రంగంలో నైపుణ్య అభివృద్ధికి కర్నూలు విమానాశ్రయంలో ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు
- రాష్ట్ర వ్యవసాయం, సహకారం, మార్కెటింగ్, పశు సంవర్ధక, డైరీ అభివృద్ధి, మత్స్య శాఖా మంత్రి వర్యులు కె. అచ్చెన్నాయుడు





కర్నూలు, నవంబర్11(వుదయం ప్రతినిధి): పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉపాధి కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా కృషిచేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయం, సహకారం, మార్కెటింగ్, పశు సంవర్ధక, డైరీ అభివృద్ధి, మత్స్య శాఖా మంత్రి వర్యులు కె. అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా 50 ఎంఎస్ఎంఇ పార్కులకు కనిగిరి నుంచి ముఖ్యమంత్రి వర్చువల్ గా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగా కర్నూలు ఎయిర్ పోర్ట్ లో ఏర్పాటు చేస్తున్న ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ను ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కర్నూలు ఎయిర్పోర్ట్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయం, సహకారం, మార్కెటింగ్, పశు సంవర్ధక, డైరీ అభివృద్ధి, మత్స్య శాఖా మంత్రి వర్యులు కె. అచ్చెన్నాయుడు, కర్నూలు పార్లమెంట్ సభ్యులు బస్తిపాటి నాగరాజు, ఆంధ్ర ప్రదేశ్ ఎయిర్పోర్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ ఆదిత్య, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం, పాలసీలను అమలుచేయడం వల్ల పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారని తెలిపారు.. కర్నూలు ఎయిర్పోర్ట్ లో మెల్ స్టార్ ఏవియేషన్స్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ ఎయిర్పోర్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సహకారంతో ఏర్పాటు కానున్న ఈ సంస్థ ద్వారా వాణిజ్య, ప్రైవేట్ పైలట్ లకు శిక్షణ ఇచ్చే ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ డి జి సి ఏ ఆమోదిత కోర్సులు.. కమర్షియల్ పైలట్ లైసెన్స్ ప్రైవేట్ పైలట్ లైసెన్స్ , మల్టీ ఇంజన్ రేటింగ్, ఇన్స్ట్రుమెంట్ రేటింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వనుందన్నారు. మొదటి దశలో రెండు ఎకరాల్లో రూ.100 కోట్లతో ఈ సంస్థ ఏర్పాటవుతోందని, ఈ సంస్థ ద్వారా విమానయాన రంగంలో నైపుణ్య అభివృద్ధికి దోహద పడటమే కాకుండా, రాష్ట్రం పైలట్ శిక్షణలో ప్రముఖ కేంద్రంగా తయారు కానుందని మంత్రి తెలిపారు. ఈ సంస్థ ద్వారా ప్రత్యక్షంగా మొదటి దశ లో వంద మందికి ప్రత్యక్షంగా, 250 పరోక్షంగా ఉపాధి లభించనుందని, రెండవ మరింత విస్తరించేందుకు ప్రణాళికలు ఉన్నట్లు మంత్రి తెలిపారు. వచ్చే ఏడాది జూలై నాటికి నిర్మాణాలు పూర్తి చేసి వంద మందికి శిక్షణ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు.

కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధి శర వేగంగా సాగుతోందని తెలిపారు. ఓర్వకల్లు పారిశ్రామిక హబ్ ద్వారా అనేక పరిశ్రమలు, డ్రోన్ సిటీ లాంటి ప్రాజెక్టులు రావడం వల్ల యువతకు విరివిగా ఉపాధి లభిస్తుందని తెలిపారు. కర్నూలు ఎయిర్పోర్ట్ లో ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేయడం వల్ల విదేశాలకు పైలట్ ట్రైనింగ్ వెళ్ళే అవసరం తగ్గుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తోందని ఎంపీ తెలిపారు.ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు వల్ల రాష్ట్రంలో విమానయాన రంగ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని ఆంధ్ర ప్రదేశ్ ఎయిర్పోర్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ ఆదిత్య పేర్కొన్నారు.. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, మెల్ స్టార్ ఏవియేషన్స్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ కళ్యాణ్, సెట్కూరు సీఈఓ డా.వేణు గోపాల్, కర్నూలు ఎయిర్పోర్ట్ డైరెక్టర్ విద్యా సాగర్, డిఐఇ ప్రవీణ్ రెడ్డి, డీఈఈ అమృత్ తదితరులు పాల్గొన్నారు.

# సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాలి

## ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ డిమాండ్




అమరావతి , నవంబర్11(వుదయం ప్రతినిధి): సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ డిమాండ్ చేశారు. సెక్యులరిజం రెండు మార్గాల్లో ఉంటుందని, మత విశ్వాసాల రక్షణ, గౌరవం అంశంలో రాజీ ఉండదని ఆయన అన్నారు. మన సనాతన ధర్మం అత్యంత ప్రాచీనమైనదని, నాగరికతతో ఆ ధర్మం వర్ధిల్లుతున్నదని, ఇలాంటి సమయాల్లో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. తన ఎక్స్ అకౌంట్‌లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇవాళ ఓ పోస్టు చేశారు. ఆ పోస్టులో ఆయన కొన్ని ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందూ సమాజం కోసం ఆ బోర్డు ఉండాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం కేవలం యాత్రా స్థలం మాత్రమే కాదు అని, అది పవిత్ర ఆధ్యాత్మిక యాత్రకు కేంద్రమని, తిరుపతి లడ్డూ కేవలం స్వీటు మాత్రమే కాదు అని, అదొక భావోద్వేగం అన్నారు.

మన స్నేహితులు, కుటుంబీకులు, దగ్గరవారికి ఆ లడ్డూను ఎంతో ప్రేమతో పంచిపెడతామని పవన్ కళ్యాణ్ అన్నారు. ఇది మనలో ఉన్న సామూహిక నమ్మకానికి, విశ్వాసాన్ని చాటుతుందన్నారు. ప్రతి ఏడాది సగటును 2. 5 కోట్ల మంది భక్తులు తిరుమలను దర్శించుకుంటారని, సనాతన విధానాలు అవలంబిస్తున్న వారి మనోభావాలను దెబ్బతీయాలని చూసినా, లేక హేళన చేసినా, అది కేవలం బాధను మాత్రమే కలిగించదు అని, లక్షలాది మంది భక్తుల నమ్మకాన్ని దెబ్బతీసినట్లు అవుతుందని పవన్ కళ్యాణ్ అన్నారు.డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన ఎక్స్‌లో తిరుపతి లడ్డూపై ఓ పత్రిక రాసిన కథనాన్ని రీపోస్టు చేశారు. టీటీడీ లడ్డూ తయారీ కోసం ఉత్తరాఖండ్‌కు చెందిన డెయిరీ సంస్థ నెయ్యి సరఫరాలో అక్రమాలకు పాల్పడినట్లు ఆ కథనం పేర్కొన్నది. ఒక్క పాలచుక్కను కూడా సేకరించని ఆ సంస్థ ఎలా 68 లక్షల కేజీ నెయ్యిని సరఫరా చేసిందని కథనంలో ప్రశ్నించారు.

2019 నుంచి 2024 వరకు ఆ డెయిరీ సంస్థ సుమారు 250 కోట్ల ఖరీదైన నెయ్యిని టీటీడీకి సరఫరా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

# నెల్లూరులో కంటైనర్ లారీ బీభత్సం.. ముగ్గురి మృతి

నెల్లూరు నవంబర్11(వుదయం ప్రతినిధి): నెల్లూరులో కంటైనర్ లారీ బీభత్సం సృష్టించింది. వేగంగా దూసుకెళ్తున్న లారీ అదుపు తప్పి.. మినీ వ్యాను, 3 బైక్‌లతో పాటు ఓ చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. నెల్లూరులోని ఎన్టీఆర్ నగర్ వద్ద జాతీయ రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చెన్నై నుంచి విజయవాడవైపు వెళ్తున్న కంటైనర్ లారీ నియంత్రణ కోల్పోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.మృతులను నజీమ్ మొహిద్దీన్ (67), షేక్ ముజాహిద్ అలీ (36), వి. సురేశ్ (36) గా గుర్తించారు. వీళ్లంతా నెల్లూరు రూరల్‌లోని సిరి గార్డెన్‌కు చెందినవారు. సంఘటన స్థలికి చేరుకున్న



పోలీసులు రహదారిపై వాహనాలను తొలగించి.. రాకపోకలను పునరుద్ధరించారు. జిల్లా ఎస్పీ అజిత్ సంఘటన స్థలిని పరిశీలించారు. లారీ ముందు భాగం చెట్టుకు తగలడంతో నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంపై మంత్రి నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

# రానున్న రోజుల్లో 10 కోట్లు మంది లాక్ పతి దిదిలు



గుంటూరు, నవంబరు 11 (వుదయం ప్రతినిధి) రానున్న రోజుల్లో 10 కోట్లు మందిని లాక్ పతి దిదిలుగా మార్చుటకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ప్రతి ఏడాది లక్ష రూపాయల ఆదాయం కనీసం రావాలని, ప్రస్తుతం రెండు, మూడు కోట్లుగా ఉన్న లాక్ పతి దిదిల సంఖ్య పెంచుటకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. వాటర్ షెడ్ మహోత్సవ్ పై రెండు రోజుల జాతీయ సదస్సు రెండవ రోజు గుంటూరు గ్రామీణ మండలం వెంగళాయపాలెంలోహౌహౌమంగళవారం జరిగింది. ఈ జాతీయ సదస్సులో కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య వ్యక్తిగా వచ్చానని, రైతు సేవకుడిగా వచ్చానని, వారి సేవ దైవ సేవగా భావిస్తానని అన్నారు. నారా చంద్ర బాబు నాయుడు గొప్ప ముందు చూపు గల వ్యక్తి అని, పవన్ కళ్యాణ్ దృష్టి, నరేంద్ర మోడీ ఆలోచనా విధానం వలన ఈ ముగ్గురి ఆలోచనా విధానం గొప్ప సమ్మేళనంగా ఉందన్నారు. వెంగళాయపాలెం వంటి చెరువుకు దేశంలో ఇతర ప్రాంతాల్లో చేపడతామని చెప్పారు. రానున్న రోజుల్లో 10 కోట్లు మందిని లాక్ పతి దిదిగా చేయాలని ప్రయత్నం జరుగుతుందని అన్నారు. మహిళా స్వావలంబనకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ప్రధాన మంత్రి ఆవాస యోజన క్రింద ప్రతి ఒక్కరూ పక్కా గృహం కలిగి ఉండాలని ప్రభుత్వం భావిస్తోందని, ఇందుకు జిల్లా కలెక్టర్, శాసన సభ్యులు సర్వే నిర్వహించి ఏ ఒక్కరు గుడిసెల్లో ఉ ండకుండా చూడాలని సూచించారు. వివిధ కార్యక్రమాల క్రింద ఉత్పాదన పెంచే విధానం ఉందని, అందరూ మూడు పంటలు వేసుకునే విధంగా చర్యలు చేపడుతున్నామని అన్నారు. చిన్న సన్నకారు రైతుకు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మంచి చర్యలు చేపడుతోందని, ఇతర పంటలపై దృష్టి మార్చే విధంగా అవగాహన కల్పించడం మంచి విషయం అన్నారు. అటువంటి పంటల ఉత్పాదకాలను ఎగుమతులు చేయుటకు సహకారం అందిస్తామని అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు మీ శివరాజ్ సింగ్ చౌహాన్ మామ అండగా ఉంటారని చెప్పారు. పెమ్మసాని చంద్ర శేఖర్ హిందీ, హిందీ ప్రాంత వాసులను ఆలోచింపజేసే విధంగా ఉందని ప్రశంసించారు. కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్ర శేఖర్ మాట్లాడుతూ పల్లెలు దేశ ప్రగతికి పట్టుగొమ్మలన్నారు. 25 శాతం వర్షంపై ఆధారపడి ఉన్నాయి, వీటి కోసం ప్రధాన మంత్రి వాటర్ షెడ్ కార్యక్రమాలు చేపట్టాలని ఆలోచించారు. ఇటువంటి మంచి కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మన రాష్ట్రం ఒక భాగం కావాలని ఆలోచించారని చెప్పారు. ఈ పథకాలు బాగా అమలుచేసి ఆదర్శంగా నిలవాలని రాష్ట్రానికి తీసుకువస్తున్నామని తెలిపారు. శివరాజ్ సింగ్ చౌహాన్ వ్యవసాయ శాఖ మంత్రిగా ఆంధ్రప్రదేశ్ కు 40 శాతం యూరియా సరఫరా చేశారని తెలిపారు. రాష్ట్ర సమస్యల పట్ల మంత్రి పరిష్కారం ఇచ్చారని తెలిపారు. ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు 180 కోట్ల రూపాయలు విడుదల చేశారని చెప్పారు. వెంగళాయపాలెం చెరువు మంచి నిర్వహణకు ఆలోచించి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కొబ్బరి మొక్కలు నాటామని, చేపలు, బాతులు పెంచి ఆదాయ వనరులు సమకూర్చడం జరుగుతోందని తెలిపారు. దేశంలో 5 వేలు కంటే ఎక్కువ జనాభా కలిగిన 20 నుండి 25 వేల గ్రామాలు ఉన్నాయని, అటువంటి ప్రాంతాల్లో నీటి వనరులు పెంపుదలకు చర్యలు చేపట్టడం జరుగుతోందని వివరించారు. తద్వారా ఆరోగ్యం, ఆహ్లాదం కలుగుతుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మంచి ఆలోచనా విధానంతో అనేక ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి చేపట్టడం జరిగిందన్నారు. జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి మరియు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ నీటిని ఒడిసి పట్టుకోకపోతే అనేక రకాలుగా నష్టపోతామన్నారు. ప్రధాన మంత్రి చక్కటి కార్యక్రమం అమలు చేస్తున్నారని చెప్పారు. భూగర్భ జలాలు పెంచుకోవాలి... భూసారాన్ని పరిరక్షించుకోవాలి.. పంటలను సాగు చేసుకోవాలన్నారు. నీటిని వృథా చేయరాదన్నారు. ప్రధాన మంత్రి,ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయుటకు కృషి చేస్తున్నారని, మనం భాగస్వామ్యం కావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ భూ వనరుల విభాగంకార్యదర్శి మనోజ్ జోషి మాట్లాడుతూ దేశంలో తక్కువ ఫలసాయం ఇస్తున్న 50 లక్షల హెక్టార్ల భూమిని ఒకసారి నుండి ఎక్కువ సార్లు పంటలు వేసుకునే విధంగా మార్చడం జరిగిందన్నారు. పంట ఉత్పాదక ఆరు రెట్లు పెరిగి, రూ. 20 వేల కోట్ల ఆదాయం లభించిందన్నారు. రైతు ఆదాయం 70 శాతం పెరిగిందన్నారు. భూగర్భ జలాలు మూడు మీటర్లు వరకు పెరిగిందన్నారు. చెరువులను పునరుద్ధరించడం జరుగుతోందని, నదీ ప్రాంతాలు కూడా పునరుద్ధరించుటకు చర్యలు చేపట్టడం జరుగుతోందని వివరించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో భాగమైన వివిధ సంఘాలకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులు, గల్లా మాధవి, నసీర్ అహ్మద్, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్ మాధవ్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ టి. క్రిస్టినా, కేంద్ర ప్రభుత్వ భూ వనరుల విభాగంకార్యదర్శి మనోజ్ జోషి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం శశిభూషణ్ కుమార్, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ జాయింట్ సెక్రెటరీ నితిన్ కడే, రాష్ట్ర పంచాయతీ రాజ్ సంచాలకులు మైలవరపు కృష్ణ తేజ, జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా,హౌగుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ పులిహౌహౌశ్రీనివాసులు, గ్రామీణ అభివృద్ధి శాఖ వాటర్ షెడ్ విభాగం సంచాలకులు వై.వి.కె. షణ్ముఖ కుమార్, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక విద్యకు ఆద్యుడు

## మౌలానా అబుల్ కలాం అజాద్



కర్నూలు, నవంబర్ 11 వుదయం ప్రతినిధి :కర్నూలు బి-క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో మంగళవారం నాడు మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి వేడుకలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. నాగస్వామి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు . ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం లో ప్రిన్సిపాల్ మరియు లెక్చరర్స్ మౌలానా అబుల్ కలాం అజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ నాగస్వామి నాయక్ మాట్లాడుతూ ం"ప్రతి సంవత్సరం నవంబర్ 11న దేశవ్యాప్తంగా జాతీయ విద్యా దినోత్సవం (నేషనల్ ఎడ్యుకేషన్ డే)గా జరుపుకుంటారని, దీనినే రాష్ట్రీయ శిక్షా దివస్ అని కూడా పిలుస్తారని ,దేశంలో విద్యా అభివృద్ధికి, విద్యా సంస్కరణలకు తన జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు మౌలానా అబుల్ కలాం అజాద్ ," అని అన్నారు. అలాగే "స్వాతంత్ర్యం అనంతరం ఏర్పడిన తొలి భారత ప్రభుత్వంలో 11 సంవత్సరాల పాటు విద్యాశాఖ మంత్రిగా పనిచేసి దేశ విద్యా వ్యవస్థకు బలమైన పునాదులు వేశారని, భారతీయ కళలు, సంగీతం, సాహిత్యాల అభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారని, అంతేకాకుండా ఆయన ఒక గొప్ప సాహితీవేత్తగా 'ఇండియా విన్స్ ఫ్రీడమ్' అనే ప్రసిద్ధ గ్రంథాన్ని రచించారని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు రామకృష్ణ, మల్లికార్జున రావు, ఉల్గోజీ రావు, మల్లేశ్వరుడు, శ్రీధర్ మూర్తి, భోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివి

## మాజీ ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు



కర్నూలు నవంబర్ 11 వుదయం ప్రతినిధి: మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు భారత జాతి ఎన్నటికీ మరువలేదని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు ఎం సుధాకర్ బాబు అభిప్రాయపడ్డారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారి 137 వ జయంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆజాద్ చిత్ర పటమునకు పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కార్యకర్తల సమావేశంలో సుధాకర్ బాబు మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారని 1940 సంవత్సరంలో జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులుగా పని చేశారని, ఉ ప్పు సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయ్యాడని, ఖిలాఫత్, సహాయ నిరాకరణ, క్విట్ ఇండియా ఉద్యమాలలో పాల్గొని పది సంవత్సరాలు జైలు జీవితం గడిపారని స్వాతంత్ర్యా నంతరం భారత మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేశారని, విద్యార్థుల సంక్షేమానికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి విద్యాభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ కృషి చేశాడని అందుకే ఆయన పుట్టిన రోజును జాతీయ విద్యా దినంగా జరుపు కుంటున్నామని ఆయన మరణానంతరం భారత ప్రభుత్వం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించిందని. మౌలానా స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శం కావాలని, ఆయన కీర్తి చిరకాలం నిలవాలని సుధాకర్ బాబు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ నియోజకవర్గ కోఆర్డినేటర్ బి క్రాంతి నాయుడు , రాష్ట్ర కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎస్సీ బజారన్న, మైనార్టీ సెల్ జిల్లా చైర్మన్ షేక్ ఖాజా హుస్సేన్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎ సూర్యప్రకాశ్ రెడ్డి, డిసిసి మాజీ ఉపాధ్యక్షులు కె వెంకట రెడ్డి మాజీ కార్యదర్శి బి సుబ్రహ్మణ్యం, ఎస్సీ సెల్ సిటీ అధ్యక్షులు డబ్ల్యు సత్యరాజు, మైనార్టీ సెల్ సిటీ అధ్యక్షులు అబ్దుల్ హై, కాంగ్రెస్ నాయకులు షేక్ మాలిక్ భాష, వసీ భాష, రంగస్వామి మొదలగు వారు పాల్గొన్నారు.

# విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లపై సమీక్ష

## జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్



కడప, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి) రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిన్నమండెం పర్యటన నేపథ్యంలో కడప విమానాశ్రయంలో జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ నెల 12 న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నమయ్య జిల్లా చిన్నమండెం పర్యటన నేపథ్యంలో ఎయిర్ పోర్ట్ లో చేపట్టాల్సిన భద్రతా చర్యలపై మంగళవారం జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ పోలీసు శాఖ, ఇతర శాఖల అధికారులతో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ ఏ ఎస్ ఎల్ నిర్వహించారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్.పి ఆదేశించారు. అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్.పి (ఏ.ఆర్) బి.రమణయ్య, స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి ఎన్.సుధాకర్, కడప డి.ఎస్.పి ఎ.వెంకటేశ్వర్లు, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, కమలాపురం సి.ఐ ఎస్.కె రోషన్, ఆర్.ఐ లు శివరాముడు, సోమశేఖర్ నాయక్, ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ సుజిత్ కుమార్ పొద్దార్, వైద్య, విద్యుత్, అగ్నిమాపక, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో చిక్కిన రెవెన్యూ అధికారి



ఓ రైతు నుంచి రూ. 35 వేలు లంచం తీసుకుంటున్న రెవెన్యూ అధికారి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే.. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం గుంటుపల్లి గ్రామానికి చెందిన వేణుగోపాల్ చౌదరికి నంద్యాల జిల్లా డోన్ మండలం జగదుర్తి గ్రామ పరిధిలో 10 ఎకరాల పొలం ఉంది. ఈ భూమి చుక్కల భూమిగా రికార్డ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. చుక్కల భూమిని రెగ్యులరైజ్ చేయడానికి రైతు డిప్యూటీ తహసీల్దార్ సునీల్ రాజ్‌ను కలిశారు. చుక్కల భూమిని రేగ్యులరైజ్ చేయడానికి కలెక్టర్‌కు ప్రపోజల్ పెట్టాలని తెలిపాడు. దానికి రూ. 60 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన రైతు ప్రస్తుతం తన వద్ద రూ 35 వేలు ఉన్నాయి. మిగిలినవి తర్వాత ఇస్తానని చెప్పాడు. డిప్యూటీ తహసీల్దార్ సునీల్ రాజ్ రైతు నుంచి రూ. 35 వేలు తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అధికారిపై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ సోమన్న తెలిపారు.

# అమ్మో కుక్కలు

## మోతుగూడెం గ్రామ ప్రజలను భయపెడుతున్న వీధి కుక్కలు,



మోతుగూడెం, నవంబర్ 11, వుదయం ప్రతినిధి:అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం గ్రామంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది, మార్కెట్ సెంటర్లో మరియు ప్రధాన కుడళ్ళ వద్ద కుక్కలు గుంపులుగా తిరుగుతూ చిన్నపిల్లలు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులపై దాడి చేస్తున్నాయి, ఉదయం, సాయంత్రం వేళల్లో ముఖ్యంగా స్కూల్‌కి వెళ్లే పిల్లలు, బయట పనులు చేసుకునే వారికి భయం తప్పడం లేదు, కుక్క కాటుకు గురైన సంఘటనలు అనేకం నమోదయ్యాయి, అవుతూనే ఉన్నాయి, కుక్క కాటుకి గురైన వారు స్థానికంగా ఇంజక్షన్లు లేక వ్యయ యప్రయాసకు ఓర్చి ఇబ్బంది పడుతూ 30 కి.మీ. దూరంలో ఉన్న చింతూరు ఆసుపత్రికి వెళ్లి వైద్య చేయించుకోవలసి వస్తుంది, దేశవ్యాప్తంగా ఈ సమస్యపై సుప్రీంకోర్టు కూడా ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రభుత్వాలకు అనేక సూచనలు చేసిన ప్రభుత్వం, అధికారులు విస్మరిస్తున్నారు, ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలను కుక్కకాటు ప్రమాదం నుంచి రక్షించడానికి, తక్షణమే 'యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏ బి సి)' కార్యక్రమాలు చేపట్టి, కుక్కలను జనావాసాలకు దూరంగా విడిచిపెట్టి కుక్కల బారి నుండి గ్రామ ప్రజలు రక్షించ వలసిందిగా కోరుకుంటున్నారు.

# జనసేనలో చేరిన వైసీపీ ఎంపీటీసీ బర్మా రాంబాబు

- వంద కుటుంబాలతో జనసేనలో చేరిక
- స్వాగతం పలికిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, వెంకట్రామ్



అవనిగడ్డ నవంబర్11 (వుదయం ప్రతినిధి):నాగాయలంక మండలం గణపేశ్వరం వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు బర్మా రాంబాబు జనసేన పార్టీలో చేరారు. మంగళవారం బర్రంకుల గ్రామంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ సమక్షంలో రాంబాబు తమ సన్నిహితులు, అనుచరులు వంద కుటుంబాల వారితో కలిసి జనసేన పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, వెంకట్రామ్ జనసేన కండువాలతో స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. ఎంపీటీసీ రాంబాబు మాట్లాడుతూ తమ అనుచరులు అందరి కోరిక మేరకు జనసేన పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. తమ గ్రామాల్లో జనసేన నాయకత్వం బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు ముమ్మారెడ్డి శ్రీనివాసరావు, తోట శ్రీనివాసరావు, జనసేన పార్టీ మండల నాయకులు బండ్రెడ్డి హరి, మోపిదేవి మండల జనసేన అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, ఏఎంసీ డైరెక్టర్ పిరాటి శిరీష, పార్టీ నాయకులు భోగాది శివ విష్ణు, పిరాటి బలరాం, తోట మానస తదితరులు పాల్గొన్నారు.

# అస్వస్థతకు గురైన చిన్నారులకు ఎమ్మెల్యే పరామర్శ



ఆదోని మార్కెట్ : ఆదోని మండలం నాగలాపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అస్వస్థతకు గురై ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మంగళవారం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి చిన్నారుల ఆరోగ్య క్షేమాన్ని అడిగి తెలుసుకున్నారు. పరిస్థితిని అంగన్‌వాడీ గ్రామీణ సీడీపీవో ఢిల్లీశ్వరి ఎమ్మెల్యేకు వివరించారు. చిన్నారులకు ఏ ప్రమాదం లేదని, ఎక్కడ లోపం జరిగిందో గుర్తించేందుకు.. ఆహార శాంపిల్స్‌ను పరీక్షలకు పంపినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ నాగరాజు, సహా పర్యవేక్షకుడు డాక్టర్ పద్మకుమార్, భాజపా నాయకులు పాల్గొన్నారు.

# రాచమల్లు ఆధ్వర్యంలో 6వ రోజు రిలే నిరాహార దీక్షలు



ప్రొద్దుటూరు, నవంబర్ 11, (వుదయం ప్రతినిధి) ప్రొద్దుటూరు మున్సిపల్ ఎగ్జిబిషన్ కు సంబంధించి తెలుగుదేశం పార్టీ కి చెందిన గుత్తేదారుడు సుమారు 1 కోటి రూపాయలు ఎగవేసిన నేపథ్యంలో, తిరిగి ఆ డబ్బును మున్సిపల్ ఖజానాను చెల్లించేవరకు చేస్తున్న దీక్షల్లో భాగంగా మంగళవారం వై.యస్.ఆర్.సి.పి కి చెందిన స్టేట్ కార్పొరేషన్ల మాజీ డైరెక్టర్లు ఉప్పర మురళి, తుపాకుల వెంకట రమణ, చౌడం రవిచంద్ర ఆధ్వర్యంలో మంగళవారం 6వ రోజు మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ దీక్షికు సంఘీభావంగా వై.యస్.ఆర్.సి.పి కి చెందిన పలువురు నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

# శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో 24 గంటల పాటు పూర్తయిన ఏకనామ సంకీర్తన

**-ఆలయ కమిటీ శాశ్వత చైర్మన్ గొల్లపూడి సుబ్బారావు**



ఖానాపురం, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి): మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో 24 గంటల పాటు ఏకనామ సంకీర్తనను ఆలయ అర్చక స్వామి పర్వతపు శివప్రసాద్ శాస్త్రి సమక్షంలో పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ శాశ్వత చైర్మన్ గొల్లపూడి సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చక స్వామి మాట్లాడుతూ పవిత్ర కార్తీక మాసబహుళపంచమి స్వామివారి జన్మనక్షత్రము పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఏకనామ సంకీర్తన హరే రామ హరే రామ రామ రామ హరే హరే హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే ఈ 16 పదాల దివ్య మంత్రాన్ని ఆలయంలో నిర్విరామంగా 24 గంటల పాటు నిర్వహించి మంగళవారం ఉదయం 8 గంటలకు సీతారామచంద్రస్వామికీ హారతి కార్యక్రమంతో ఏకనామ సంకీర్తన కార్యక్రమం పూర్తయినట్లు భక్తులకు గ్రామస్తులకు ప్రజలకు ఆలయ అర్చక స్వామి తెలుపుతూ, ఏకనామ సంకీర్తన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని అర్చక స్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మూసాపేట మండలం లో జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటన



మహబూబ్ నగర్ నవంబర్ 11 (వుదయం ప్రతినిధి): వరి ధాన్యం కొనుగోలు కు రైతులు ఇబ్బంది లేకుండా అన్ని వసతులు కల్పించి కొనుగోళ్లు సాఫీ గా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. మూసాపేట మండలంలోని తిమ్మాపూర్ గ్రామం, కొమ్మిరెడ్డి పల్లె గ్రామంలలో ఐ.కె.పి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల గురించి కేంద్రాల నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రంలో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్యాడి క్లీనర్, ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్ లను ఉపయోగించి చెత్త,తాలు లేని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకుని రావాలని సూచించారు. నిర్ణీత తేమ శాతం,నాణ్యతా ప్రమాణాలు ప్రకారం ధాన్యానికి క్రమ పద్ధతి లో టోకెన్ లు అంద చేసి రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు సరైన తేమ శాతం వచ్చిన ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. ఏ రైతు మిల్లుకు రాకుండా చూడాలని ప్రతి రైతు బాధ్యత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులదే అని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సరైన తేమ వచ్చిన ధాన్యాన్ని తొందరగా మిల్లుకు సరఫరా చేయాలని ఆదేశించారు. కొమ్మిరెడ్డి పల్లె గ్రామం ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్ పనిచేసే విధానాన్ని పరిశీలించారు. మూసాపేట్ మండలంలో తిమ్మాపూర్ గ్రామం లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి బోర్డుపై ఉన్న వర్ణమాలను, సరళ పదాలను, ఏ బీ సీ లను. పిల్లలతో చదివించింది అక్కడున్న ఉపాధ్యాయులతో మాట్లాడుతూ , విద్యార్థులతో నిత్యం చదివించడం, రాయించాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పేర్కొన్నారు. అక్షయపాత్ర ద్వారా వచ్చిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించింది పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని. గ్రామం లో అంగన్వాడీ ని తనిఖీ చేశారు. అంగన్వాడీ లోని మధ్యాహ్నం భోజనం చేస్తున్న పిల్లలు ఆహారాన్ని పరిశీలించింది ఆహారంలో నాణ్యత లేకపోవడం వల్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పప్పు చారు లాగా ఉండడం వలన పప్పులో ఆకుకూర ఏంటిది? పప్పు ఇంత పల్చగా ఉంది ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు మంచి పోషకమైన ఆహారం అందించాలని పిల్లలకు, పౌష్టిక ఆహారం,గుడ్లు సక్రమంగా అంద చేయాలని, వారిని క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని,సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రం లో పిల్లలు కూర్చునేందుకు మ్యాట్ లు ఉన్నా ఉపయోగించక పోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్ వాడి అపరిశుభ్రంగా ఉండటం గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ వెంట డి.ఆర్.డి. ఓ నర్సింహులు, తహశీల్దార్ రాజు, మండల, గ్రామ అధికారులు తదితరులు ఉన్నారు.

# జూరాల ఆయకట్టుకు యాసంగిలో వెంటనే నీరును విడుదల చేయాలి



గద్వాల, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి): తెలంగాణ రైతాంగ సమితి తరపున మాట్లాడుతూ ఈ యాసంగి పంటకు ముందుగానే జూరాల ప్రాజెక్టు నీరును విడుదల చేయాలని సూపర్డెంట్ ఆఫీస్ జోగులాంబ గద్వాలలో డిప్యూటీ ఇంజనీర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈనెల చివరిదాకా వరి కోతలు అయిపోతాయి వరి ధాన్యం రైతుల చేతికి వస్తుంది. వరి పంట కోసిన వెంబడే వరి తూకాలు పోసుకుంటే డిసెంబర్ చివరిదాకా నాట్లు అయిపోయి మార్చి చివరి వరకు యాసంగి పంటలు చేతికి వస్తాయి లేదంటే ప్రతి సంవత్సరం జూరాల ఆయకట్టు యాసంగిలో సాగునీరు కొరత ఏర్పడి పంటలు తీవ్రంగా నష్టపోతున్నాయి కనుక ఈసారి ముందుగా యాసంగి సాగునీరు అని పంటలకు విడుదల చేస్తే వేసవి ఎండలు తీవ్రం కాకముందే యాసంగి పంటలు చేతికి వస్తాయి కనక వెంటనే ప్రభుత్వం సాగునీరు అధికారుల సమావేశాన్ని ఏర్పాటు చేసి జూరాల యకట్టుకు నీరు విడుదల చేసే విధంగా నిర్ణయించాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కుల వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి జి గోపాల్ జోగులాంబ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్య రెడ్డి కలిసి జిల్లా అధికారులకు వినతిపత్రం అందజేశారు.

# చట్ట విరుద్ధ కార్యకలాపాలను ఉపేక్షించేది లేదు

**-ప్రజల రక్షణే పోలీసుల బాధ్యత**
**-మంచిర్యాల డి సి పి భాస్కర్**



రామకృష్ణాపూర్ ,నవంబర్ 11 (వుదయం ప్రతినిధి): పట్టణం లోని అల్లూరి సీతారామరాజు నగర్ లో డిసిపి భాస్కర్ పర్యవేక్షణలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్బంగా డిసిపి మాట్లాడుతూ తనిఖీలు నిర్వహించగా సరైన పత్రాలు లేని (31) వాహనాలు పట్టుకొని వాటి యజమానులకు జరిమానాలు విధించినామనీ,అదేవిధంగా బెల్ట్ షాప్స్, గుడుంబా అమ్మకాదరుల ఇండ్లల్లో తనిఖీలు నిర్వహించి వారిపై కేసులు నమోదు చేయడం జరిగిందనీ తెలిపారు. అదేవిధంగా కాలనీలలో ఎవరైనా కొత్త వ్యక్తులు కనపడిన,ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన, గంజాయి అమ్మకం, సేవించడం లాంటి పనులు చేసినట్టుగా తెలిస్తే వెంటనే స్థానిక పోలీస్ వారికి లేదా డయల్ 100 కు కాల్ చేసి సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ వెంట బెల్లంపల్లి ఏసీపీ. రవి కుమార్, మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్ మందమర్రి సర్కిల్ పరిధిలోని ఎస్ఐ లు, ఏ.ఎస్ఐ లు, హెడ్ కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.

# సొంత ఖర్చులతో రహదారి శుభ్రం

**-యువకుడు ఇస్లావత్ సురేష్.**
**-యువకున్ని అభినందించిన తండావాసులు.**



ఖానాపురం, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి): మండలంలోని మంగళవారిపేట, నుంచి భద్రు తండకు వెళ్లే రహదారికీ ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలతో రహదారి నిండిపోయి పిల్లలు పెద్దలు తండావాసులు ఈ రహదారి వెంట నడవలేక నానా ఇబ్బందులు పడుతుంటే చూసి చెల్లించిపోయి భద్రుతండ దుర్గమ్మ ఆలయం నుంచి మంగళవారిపేట వరకు రహదారికి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించినట్లు ఇస్లావత్ సురేష్ అనే యువకుడు తెలిపాడు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రహదారిని శుభ్రం చేయడానికి డోజర్ కు నాలుగు నుంచి ఐదు వేల రూపాయల ఖర్చు చేసి డోజర్ సహాయంతో మూడు నుంచి నాలుగు గంటలు శ్రమించి రహదారికీ రహదారిపై ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి రహదారిని శుభ్రం చేయడంతో చిన్నలు పెద్దలు తండావాసులు సురేష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# చింతరేవుల ఆంజనేయ స్వామిని దర్శించుకున్న మంత్రాలయం ఎమ్మెల్యే



గద్వాల నవంబర్ 11 (వుదయం ప్రతినిధి): ధరూర్ మండలం పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాన్ని మంగళవారం మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి దంపతులు సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ చైర్మన్ గిరి రావు అర్చకులు భీమసేన చారి ఘనంగా స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించే స్వామివారి శేష వస్త్రాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు...

# కాఫీ కంపెనీ కాలుష్యంతో రైతులకు తీవ్ర నష్టం



వెల్దండ నవంబర్ 11 (వుదయం ప్రతినిధి) మండల పరిధిలోని రాచూరు గ్రామంలో నెలకొల్పిన వింటేజ్ కాఫీ నుంచి వెలువడే వ్యర్థపు నీరుతో కంపెనీ పరిసరాలలో ఉండే పంట పొలాలలోకి చేరి రైతులకు నష్టాన్ని కలిగిస్తున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా మంగళవారం.రైతులందరూ కలిసి కంపెనీ ఉద్యోగస్తులతో మాట్లాడిన ఎలాంటి ఫలితం లేదు.కావున గ్రామ రైతులందరూ కలిసి కంపెనీకి యాజమాన్యానికి ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని కంపెనీ ముందు నిరసన చేపట్టాడం , అధికారులు ప్రజా ప్రతినిధులు తగిన చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయలని డిమాండ్ చేశారు

# జాతీయ కరాటే పోటీల్లో సత్తా చాటిన రాజేశ్వరి



చెన్నారావుపేట,నవంబర్ 11 (వుదయం ప్రతినిది): చెన్నారావుపేట మండలంలోని అవీంనాబాద్ మంగలి తండా చెందిన గిరిజన బాలిక గుగులోతు రాజేశ్వరి ఆదివారం జరిగిన పదో జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రథమ స్థానం సాధించింది అద్భుత ప్రతిభ కనబరిచిన ఆమె తండాకు మండలానికి గౌరవం తెచ్చింది రాజేశ్వరి విజయంపై ఆమె తల్లిదండ్రులు గురువులు మరియు గ్రామ పెద్దలు గ్రామస్తులు అభినంది అభినందించారు ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు

# పేటలో బిజెపి భారీ అర్ధనగ్న ర్యాలీ

**-ఆస్పత్రి ఏర్పాటుకు వారం రోజుల డెడ్ లైన్**
**- బిజెపి హెచ్చరిక**




నారాయణపేట టౌన్ నవంబర్ 11( వుదయం ప్రతినిధి): నారాయణపేట జిల్లా కేంద్రంలో ప్రజలకు కనీస వైద్యం అందించేందుకు వారం రోజుల్లో ఆస్పత్రి ఏర్పాటు చేయాలని బిజెపి నాయకులు ప్రభుత్వానికి డెడ్ లైన్ విధించారు. ఆస్పత్రి చేయక పోవడాన్ని నిరసిస్తూ మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలో అర్ధనగ్న నిరసన ప్రదర్శన భారీగా నిర్వహించారు. ఈ అర్ధనగ్న నిరసన ర్యాలీ పళ్ల హనుమాన్ దేవాలయం నుంచి శివాజీ నగర్ ,సరాఫ్ బజార్ ,సెంటర్ చౌక్ ,మీదుగా మెయిన్ రోడ్ ,విరసావర్కర్ చౌరస్తా నుండి సత్యనారాయణస్వామి చౌరస్తా వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమశిక్షణా సంఘం సభ్యుడు నాగురావు నామాజీ మాట్లాడుతూ నారాయణపేట జిల్లా ఏర్పడి 7 సంవత్సరాలు గడిచిందని జిల్లా ఏర్పడితే అభివృద్ధి చెందుతుందని ఈ జిల్లా సాక్షాతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లా కావడంతో ఎన్నో ఆశలు పెట్టుకుంటే ఈ ప్రభుత్వం అడియాశలు చేసిందని అన్నారు. అభివృద్ధి చేయకపోగా ఇక్కడ ఉన్న ఒక్కో అభివృద్ధి పథకాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ అభివృద్ధిని చోరీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రానికి మంజూరు అయిన గెస్ట్ హౌస్ ,అగ్రికల్చర్ కాలేజీని తరలించి వెనుక బడిన నారాయణపేట కు తీవ్ర అన్యాయం చేసిందని అన్నారు. చివరకు ఏరియా ఆస్పత్రిని సైతం తరలించి జిల్లా కేంద్రంలో 70 వేల మందికి కనీస వైద్యం అందకుండా ప్రాణాలను తోడేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో ఉన్న ఆస్పత్రిని 12 కిలో మీటర్ల దూరంలో ఉన్న మెడికల్ కాలేజీ కి తరలించారని అన్నారు. జిల్లా ఏర్పడ్డాక ఏరియా ఆస్పత్రిని జనరల్ ఆస్పత్రిగా అప్ గ్రేడ్ చేశారని తెలిపారు. అయితే కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీకి ఆస్పత్రిని అనుసంధానం చేయాలని చెబితే ఏకంగా ఆస్పత్రిని తరలించి ప్రజలు వైద్యం నోచుకోకుండా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సీఎం సొంత జిల్లాలో కనీసం ప్రథమ చికిత్సకు ప్రజలు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రి తరలించి 6 నెలలు గడిచిందని అప్పటి నుంచి పట్టణ ప్రజలతో పాటు చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు కనీస వైద్యానికి నోచుకోక ఇప్పటి వరకు తమ దృష్టికి వచ్చిన 20 మంది సకాలంలో వైద్యం అందక మరణించారని తెలిపారు. ఆస్పత్రిని తరలించినప్పటి నుంచి బిజెపి అనేక ఉద్యమాలు చేపట్టిందని అయినా కాంగ్రెస్ ప్రభుత్వంలో స్పందన లేదని అన్నారు. బిజెపి ఉద్యమం చేసినప్పుడు మాజీ డిసిసి అధ్యక్షుడు ప్రెస్ మీట్ పెట్టి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ లో 8 కోట్లతో ఏరియా ఆస్పత్రి నిర్మిస్తామని అంతేకాకుండా ఎమ్మెల్యే చొరవతో మరో కోటి పెంచి నిర్మిస్తామని ప్రకటించారని ఇప్పటికీ ఒక్క అడుగు ముందుకు పడలేదని అన్నారు. ఇప్పటికే 20 మంది చనిపోయారని అక్కడ చ చ్చిన వారిని మాత్రం ఇక్కడ పోస్టు మార్టం కోసం పాత ఆస్పత్రికి తీసుకు వస్తున్నారని అన్నారు. ఈ ఆస్పత్రి పోస్టు మార్టం చేసేందుకే పనికి వస్తుందా .ఇంకెంత మంది చనిపోతే ఏరియా ఆస్పత్రి ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. కాగా పాలకులు ప్రైవేట్ ఆస్పత్రుల యజమానులు కుమ్మక్కు అయి ప్రజలను దోచుకుంటున్నారని అన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులు నడిపిస్తున్నది ప్రభుత్వ డాక్టర్లే నని అందుకే ఆస్పత్రిని తరలించారని ఆరోపించారు. తక్షణమే ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ఇది వరకు పాత బస్టాండ్ లో ఉన్న చిన్న పిల్లల ఆస్పత్రిలో వెంటనే ఏరియా ఆస్పత్రిని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో ఆస్పత్రిని ప్రారంభించాక పోతే బిజెపి ప్రజల వెంబడి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆస్పత్రిని ఏర్పాటు చేసే వరకు ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు పి.శ్రీనివాసులు,జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్,జిల్లా ఉపాధ్యక్షుడు కెంచే శ్రీనివాసులు,జిల్లా కోశాధికారి సిద్ధి వెంకట్రాములు,పట్టణ బిజెపి అధ్యక్షుడు పి.వినోద్ కుమార్,మాజీ కౌన్సిలర్లు,వివిధ మోర్చాల నాయకులు పాల్గొన్నారు.

# మక్కల కొనుగోలును మరింత వేగవంతం చేయాలి

**-హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**
**-ఐనవోలు మండలం నందనంలోని మొక్కజొన్నల (మక్కల) కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి**



మక్కలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ, నవంబర్ 11 (వుదయం జిల్లా ప్రతినిధి) :కొనుగోలు కేంద్రాలకు వచ్చిన మక్కల(మొక్కజొన్నల) కొనుగోళ్ల ప్రక్రియ ను త్వరగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం నందనంలోని ఫార్మర్ సర్వీస్ కోఆపరేటివ్ సొసైటీ ( పిఎసిఎస్ )లో నిర్వహిస్తున్న మక్కల కొనుగోళ్ల ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి పరిశీలించారు. మక్కల కొనుగోలు కేంద్రానికి ఇప్పటివరకు ఎంతమంది రైతులు మక్కలను తీసుకువచ్చారని, ఇప్పటివరకు ఎంత కొనుగోలు చేశారని, ఇంకా ఎంత పంట ఉత్పత్తి రానుందని, అధికారులు, నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వరి ధాన్యం పరిశీలించి కొనుగోలు ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న మొక్కజొన్న రైతులతో కలెక్టర్ మాట్లాడారు. కేంద్రంలోనికి రైతులు తీసుకువచ్చిన మక్కలను పరిశీలించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ సొసైటీ ద్వారా వరి ధాన్యము కొనుగోలును ప్రారంభించాలన్నారు. మక్కల కొనుగోలు కేంద్రానికి మక్కలను తీసుకువచ్చే రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఇంకా మొక్కజొన్న పంటలు వేసుకున్న రైతులు ఆన్లైన్లో నమోదు చేసుకోనట్లయితే వెంటనే వారి వివరాలు నమోదు చేయాలని మండల వ్యవసాయ అధికారికి సూచించారు. మొక్కజొన్నలు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఎఫ్ ఎస్ సీ ఎస్ మార్ట్ ను సందర్శించిన కలెక్టర్ ఐనవోలులోని నందనం ఫార్మర్స్ సర్వీస్ కో ఆపరేటివ్ సొసైటీ రూరల్ మార్ట్ ను హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి సందర్శించారు. మార్ట్ ద్వారా ఏయే వస్తువుల విక్రయాల ను చేపడుతున్నారనే వివరాలను నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, తహసీల్దార్ విక్రమ్ కుమార్, మార్క్ ఫెడ్ డిఎం శ్యామ్, మండల వ్యవసాయ అధికారి సునీల్, ఇతర అధికారులు, పాల్గొన్నారు.

# రైతులకు పారదర్శకంగా, సకాలంలో చెల్లింపులు చేయాలి

**-నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



కల్వకుర్తి నవంబర్ 11 (వుదయం ప్రతినిధి) కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా సందర్శించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతులతో మాట్లాడి, వారికి అందిస్తున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. మొక్కజొన్న సేకరణ కేంద్రంలో రైతుల నుండి సేకరించిన మొక్కజొన్న నిల్వల నాణ్యతను స్వయంగా పరిశీలించి, కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరుగుతున్నదా అనే అంశాన్ని పరిశీలించారు. తేమశాతం (moisture content) యంత్రం సహాయంతో పరీక్షించి, పంట నాణ్యతను అంచనా వేశారు. కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం ప్రమాణాలు సరిగ్గా పాటించబడుతున్నాయా లేదా అనే విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాలను సమీప ప్రాంతాల్లో మరింత అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే, ప్రతి కొనుగోలు కేంద్రంలో సరిపడా అన్ని వసతులను అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. రైతులు మార్కెట్ యార్డుకు తెచ్చిన పంటను నిల్వ చేయడంలో లేదా తరలించడంలో సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రవాణా సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేయాలని, రవాణా వ్యవస్థ సజావుగా సాగేందుకు ట్రాక్టర్ల మరియు లారీలు అందుబాటును సమీక్షించాలని అధికారులు సూచించారు. పంట తేమ శాతం, నాణ్యత ప్రమాణాలపై సిబ్బంది స్పష్టమైన అవగాహనతో పని చేయాలని, రైతులకు తగిన ధర లభించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. రైతులు కేంద్రాలకు తెచ్చిన వెంటనే తూకం వేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అనవసర కాలయాపన

# సంపాదకీయం

## కాప్-30 పయనం ఎటు?

గత దశాబ్ద కాలంగా పర్యావరణ పరిరక్షణ కోసం తక్షణ చర్యలు అవసరమని మాటలు మాత్రమే చెబుతూ అడుగు ముందుకు వేయని దేశాల వైఖరిలో ఈ సారైనా మార్పు వస్తుందా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఐక్యరాజ్యసమితి 'ఆచరణ' (ఇంప్లిమెంటేషన్) సదస్సుగా తాజా సదస్సును పేర్కొంటుండటం 30వ కాప్ ప్రాధాన్యతను పెంచింది. అంతేకాదు. వాతావరణ చర్చల్లో అత్యంత కీలకంగా భావించే 1992 నాటి ఎర్త్ సమ్మిట్ ఒకప్పటి బ్రెజిల్ రాజధాని నగరమైన రియో డిజనీరోలో జరిగింది. ఆ సమావేశంలోనే ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ చేంజ్ (యుఎన్‌ఎఫ్‌సిసిసి) ఏర్పాటైంది. ఆ తరువాత బ్రెజిల్‌లో జరుగుతున్న వాతావరణ సదస్సు ఇదే కావడం గమనార్హం. అదికూడా భూగోళానికి ఊపరితిత్తులుగా భావించే అమెజాన్ అడవులకు అత్యంత సమీపంలోని బెలెం నగరంలో జరుగుతుండటం కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. పెరుగుతున్న భూతాపం కారణంగా అమెజాన్ అడవులు పెద్దఎత్తున నష్టపోతున్న సంగతి తెలిసిందే. గత ఏడాది బాకులో జరిగిన 29వ వాతావరణ సదస్సు తీవ్ర నిరాశను మిగిల్చిన నేపథ్యంలో అమెజాన్ గేట్‌వే నగరమైన బెలెంలో తాజాగా జరుగుతున్న సమావేశంలో వివిధ దేశాలు కొంత మేరకు ఉదారంగా వ్యవహరించే అవకాశం ఉందన్న ఆశాభావం ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ వేత్తలలో వ్యక్తమవుతోంది. సమావేశాలు ముగిసి, తుది నిర్ణయాలు వెలువడితే కానీ ఈ ఆశలలో వాస్తవాలు ఎంతో తేలవు! బాకులో అంగీకరించబడిన వాతావరణ ఆర్థిక లక్ష్యాన్ని (క్లైమేట్ ఫైనాన్స్) ఆచరణలోకి తీసుకరావడంతో పాటు అభివృద్ధి చెందుతున్న దేశాలు డిమాండ్ చేసిన మొత్తాన్ని సాధించడం ఈ సదస్సు ముందు ఉన్న ప్రధాన కర్తవ్యం. ప్రారంభం కాకముందు కాప్ 30కి ప్రాముఖ్యత లభించడానికి మరో కారణం కూడా ఉంది. ఈ సదస్సులో ప్రతి సభ్య దేశం తన కొత్త వాతావరణ లక్ష్యాలను (నేషనల్లీ డిటర్‌మైన్డ్ కంట్రిబ్యూషన్స్-ఎన్‌డిసి) ప్రకటించనుంది. 2026వ సంవత్సరం నుండి 2035 సంవత్సరంలోగా ఆ లక్ష్యాలను సాధించడానికి ఆ దేశాలు ఈ సదస్సులో ప్రతిన పూనుతాయి. యుఎన్‌ఎఫ్‌సిసి ఇప్పటికే విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం 65 దేశాలు ఇప్పటికే కొత్త ఎన్‌డిసిలను ప్రకటించాయి, వీటిలో 13 అభివృద్ధి చెందిన దేశాలు, 52 అభివృద్ధి చెందుతున్న దేశాలు ఉన్నట్లు ఆ నివేదికలో పేర్కొన్నారు. 2019 నాటి స్థాయిలో పోలిస్తే బేషరతు చర్యల ద్వారా 17శాతానికి, షరతులతో కూడిన లక్ష్యాలను కూడా చేరిస్తే 24 శాతానికి కాలుష్య కారక ఉద్గారాలను తగ్గిస్తామని వివిధ దేశాలు పేర్కొన్నాయి. ఇక్కడ ఒక ఆసక్తికరమైన విషయం ఏమిటంటే అభివృద్ధి చెందిన దేశాలు దేశీయ ఉద్గార తగ్గింపులు, ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, సాంకేతిక ఆవిష్కరణలు గురించి మాట్లాడుతుండగా అభివృద్ధి చెందుతున్న దేశాలు ఆర్థిక సహాయం కోసం విజ్ఞప్తి చేస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలనుండి ఆర్థిక సాయం లేకుండా తాము ఏమీ చేయలేమని ఆ దేశాలు స్పష్టం చేస్తున్నాయి. ఎన్‌డిసిలు ప్రకటించిన అభివృద్ధి చెందుతున్న దేశాలు అందజేసిన నివేదికల ప్రకారం కొత్త వాతావరణ లక్ష్యాలను సాధించడానికి 1.2 ట్రిలియన్ డాలర్లు (సుమారు 100 లక్షల కోట్ల రూపాయలు) అవసరమవుతాయని, ఆ మొత్తాన్ని అభివృద్ధి చెందిన దేశాలు అందించాలని కోరాయి. వీటిలో 20 దేశాలు వాతావరణ విపత్తుల నుండి రక్షణ చర్యల కోసం 533 బిలియన్ డాలర్లు అవసరమౌతాయని అంచనా వేశాయి. కాప్ 28 (దుబారు)లో స్వీకరించిన లక్ష్యాల ప్రకారం 2030 నాటికి పునరుత్పాదక శక్తి సామర్థ్యాన్ని మూడు రెట్లు పెంచాలి, బొగ్గు వినియోగాన్ని తగ్గించాలి, మీథేన్ ఉద్గారాలను నియంత్రించాలి అని నిర్ణయించారు. కానీ, ఆచరణ మాత్రం చాలా నెమ్మదిగా ఉంది. 2030 నాటికి 11,583 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాన్ని అందుకోవాలని లక్ష్యంగా పెట్టుకోగా ప్రస్తుతమున్న పద్ధతుల్లో సాగితే కేవలం 9,530 గిగావాట్లను మాత్రమే అందుకోగలమని అంచనా వేస్తున్నారు. కొంత మేరకు బొగ్గు వినియోగాన్ని తగ్గించినా, అది చాలదు. మీథేన్ ఉద్గారాలు 2010 -2024 మధ్య పెరుగుతూనే ఉన్నాయి. రోడ్డు రవాణా ఉద్గారాలు తగ్గినా కొంత తగ్గినా ఇంకా చాలా సాధించాల్సిఉంది. వాతావరణ లక్ష్యాలను సాధించడంలో నిధుల పాత్రే కీలకంగా మారుతోంది. గత ఏడాది బాకులో జరిగిన కాప్29లో నిధుల సమీకరణకు తీసుకున్న నిర్ణయాల కొనసాగింపుగా బ్రెజిల్ అధ్యక్షతన 'బాకు టు బెలెం' రోడ్‌మ్యాప్‌ను రూపొందించారు. బాకు సదస్సులో సంవత్సరానికి కేవలం 300 బిలియన్ డాలర్ల ఆర్థికసాయం చేయడానికి మాత్రమే అభివృద్ధి చెందిన దేశాలు అంగీకరించాయి. 2035 నాటికి ఈ మొత్తాన్ని ఏడాదికి 1.3 ట్రిలియన్ డాలర్లకు పెంచడాన్ని లక్ష్యంగా రోడ్‌మ్యాప్‌లో పేర్కొన్నారు. ప్రణాళికలో ఈ బాధ్యతను ప్రభుత్వ రంగం నుండి ప్రైవేటు రంగానికి, గ్లోబల్ సౌత్ దేశాలపైకి నెట్టివేయడానికి ప్రయత్నం చేశారన్న విమర్శలు వస్తున్నాయి. దీనిపై కాప్-30లో వివిధ దేశాలు ఎలా స్పందించనున్నాయో చూడాల్సిఉంది. ఇదే తరహాలో ఉష్ణమండల అడవులకు శాశ్వత సౌకర్యం (ట్రాఫికల ఫారెస్ట్ ఫరెవర్ పెసిలిటి -టిఎఫ్‌ఎఫ్‌ఎఫ్) పేరిట బ్రెజిల్ చేసిన ప్రతిపాదన కూడా వివాదాస్పదంగా మారింది. 125 బిలియన్ డాలర్ల నిధుల సమీకరణ లక్ష్యంగా చేసిన ఈ ప్రతిపాదన సారాంశం అడవులను, ఆదివాసీలను కార్పొరేట్లకు అప్పగించడమే కావడం ఆ వివాదానికి కారణం. ఇంధన రంగంలో 'మార్పు మాత్రమే' (జస్ట్ ట్రాన్సిషన్) అంటూ అభివృద్ధి చెందుతున్న దేశాలు చేస్తున్న ప్రచారంపై కాప్30లో విస్తృత చర్చ జరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. మార్పు అవసరమే కానీ, అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలకు. ఆ దేశాల్లోని ప్రజలకు అన్యాయం జరగకుండా చూడాలన్న వాదన గట్టిగా వినపడుతోంది. వాణిజ్య చర్యల పేరిట అమెరికాతో పాటు పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు చేపడుతున్న చర్యలను జి-77 దేశాలతో పాటు చైనా తీవ్రంగా ప్రశ్నిస్తోంది. 'మార్పు మాత్రమే కానీ, అది న్యాయంగా ఉండాలి' అని ఈ దేశాలు డిమాండ్ చేస్తున్నాయి. అందువల్ల 'మార్పు మాత్రమే' అని కాకుండా 'న్యాయమైన మార్పు'గా అజెండాలో చేర్చాలని ఆ దేశాలు కోరుతున్నాయి. రక్షణ చర్యలకు సంబంధించిన జాతీయ ప్రణాళికలను (నేషనల్ అడాప్షన్ ప్లాన్స్)ను ఇప్పటి వరకు 67 దేశాలు అందచేశాయి. మన దేశం కూడా ఈ జాబితాలో ఉంది. అయితే, రక్షణ చర్యలకు కేటాయించే నిధులను రెండింతలు పెంచాలంటూ కాప్ 26లో తీసుకున్న నిర్ణయం ఇంకా అమలులోకి రాలేదు. లాస్ అండ్ డ్యామేజి ఫండ్ ప్రస్తుతం అందుబాటులోకి వచ్చినా, అందుబాటులో ఉన్న నిధులు చాలా తక్కువ. అందువల్ల అభివృద్ధి చెందుతున్న దేశాలు 2030 నాటికి అడాప్షన్ ఫైనాన్స్‌ను 30 శాతానికి పెంచాలని కోరుతున్నాయి. అదే విధంగా, ప్యారిస్ ఒప్పందంలో ఆర్థిక సహాయానికి సంబంధించిన 2.1 ఆర్టికల్ గడువు ఈ ఏడాది సెప్టెంబర్‌తో ముగిసింది. దీంతో ఆ మేరకు నిధుల ప్రవాహం ఆగిపోయే ప్రమాదం ఉంది. దానిని పొడిగించాలని అభివృద్ధి చెందుతున్న దేశాలు కోరుతున్నాయి. అదేవిధంగా ఆర్టికల్ 9.1లో వాతావరణ మార్పుల కారణంగా సంభవించే విపత్తుల నుండి రక్షణ, సహాయ చర్యలకోసం అభివృద్ధి చెందిన దేశాలు ఇచ్చే నిధులను ప్రత్యేక సాయంగా చూడాలని, ఆ దేశాల బాధ్యతగా దీనిని గుర్తించాలని లైక్ మైండెడ్ డెవలపింగ్ కంట్రీస్ (ఎల్‌ఎండిసి) కాప్ 29లో వాదించాయి.

# స్వార్థమే పరమార్థం కుటుంబ వ్యవస్థ అస్తవ్యస్తం

కుటుంబం అనగా ఒకే గృహంలో నివసించే కొంత మంది మానవుల సమూహం. వీరు సాధారణంగా పుట్టుకతో లేదా వివాహముతో సంబంధమున్నవారు. సమాజంలో వివిధ మతపరమైన వివాహ చట్టాలు కుటుంబ వ్యవస్థను గుర్తించాయి. "రక్త సంబంధము, సహచరత్వము, ఒకే నివాసం అంశాల విషయంలో కుటుంబ నైతిక, సామాజిక సూత్రాలు కుటుంబ సమైక్యత, సంఘటితం గురించి ప్రజలందరికీ అవగాహన కలిగించడం, జాతీయ అంతర్జా తీయ స్థాయిలో సుస్థిర కుటుంబాలకు దోహదం చేయడం, నైపుణ్యాన్నీ, అనుభవాలను, సామాజిక విలువలను పరస్పరం పంచుకుంటూ కుటుంబ సమస్యల విషయంలో సరైన సమాచారాన్ని, సహకారాన్ని అందించడం, కుటుంబాలలో నెలకొన్న విభేదాలను తొలగించి ఆయా కుటుంబాలలో సుఖశాంతులు నెలకొల్పడం వంటి లక్ష్యాలతో నవంబర్ 12ను జాతీయ కుటుంబ సౌహార్ద్ర దినోత్సవంగా జరుపు కుంటారు. భారతీయ సంస్కృతికి, సంప్రదాయాలకు, నాగరికత పురోగతికి మూలమైనది ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. నాగరికత విస్తరణకు పూర్వమే మనదేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉందని వివిధ గ్రంథాలలో పొందు పరచబడి ఉంది. నాగరి ప్రపంచంలోనూ మన దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మూడుపువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లింది. ప్రాచీన కాలం నుండి ఉమ్మడి కుటుంబాలు సిరి సంపదలతో తూల తూగాయ నడంలో సందేహం లేదు. ఒక కుటుంబంలో తాత మొదలు వారి పిల్లలు వారి పిల్లలు ఇలా మూడు నుంచి నాలుగు తరాలు ఉమ్మడి అనే గొడుగు కింద ఒదిగి పోయేవి. ఇంటి లోని పెద్దకు అందరూ గౌరవం ఇవ్వాల్సిందే. ఆయన మాటే వేదవాక్కు. అందరిదీ ఉమ్మడి వ్యవసాయమే. సమష్టి సంపదనే, సమష్టి భోజనాలే ఉండే వంటే ఆత్మీయత అనురాగం, ఉట్టి పడేలా చేసేవి. తల్లిదండ్రులు, అత్త మామలు, అక్క చెల్లెళ్ళు, అన్నదమ్ములు, బావా మరదళ్లు, బంధు మిత్రులు, తాతలు, బామ్మలు, మనవలు, మనవ రాండ్రతో కళకళలాడే ఉమ్మడి కుటుంబాలు సిరి సంపదల నిలయాలు. పిల్లలు చిన్న




వయస్సులో ఉన్నపుడు తల్లిదండ్రుల చెంతనే ఉంటారు. వారు పెద్దవారై పెళ్ళిళ్ళు అయిపోతే ఎవరి కుటుంబాలు వారివే. అంటే ఒక కుటుంబం నుంచి మరిన్ని కుటుంబాలు ఉదయిస్తాయి. ఒక కుటుంబం మరెన్ని కుటుంబాలను సృష్టించినప్పటికీ వంశవృక్షపు వేళ్ల మూలాలు మాత్రం మొదటి కుటుంబంను అల్లుకునే ఉంటాయి. అందుకే సంవత్సరంలో ఒక రోజైనా అందరూ కలుసు కోవాలని సరదాగా గడపాలని కోరుకోవడం అత్యంత సహజం. ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుక రించుకునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో. విదేశీ పాలకుల పాలనలో ఉమ్మడి కుటుంబాలుగా చెలామణి అయిన ఎన్నో కుటుంబాలు నవనాగరిక ప్రపంచంలో విచ్ఛిన్న మయ్యాయి. ఆధునికత పెరగడం, నాగరికత పురోభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వెరసి ఉమ్మడి వ్యవస్థ మీదా తీవ్ర ప్రభావాన్ని చూపింది. నవ నాగరిక ప్రపంచంలో రెండు కుటుంబాలు కాదు కదా రెండు మనసులు కూడా కలసి జీవించ లేని పరిస్థితి నెలకొంది. ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుకరించుకునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో. కేవలం ఫోన్ లోనో, మొబైల్ లోనో యోగ క్షేమాలు కనుక్కునే కుటుంబాలు కూడా లేకపోలేదు. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలకు మనదేశం పుట్టి ల్లు. ఇప్పుడు ఆ సంస్కృతి భూతద్దం పెట్టి వెతికినా దొరకదంటే అతిశయోక్తి కాదు. అనేక కుటుం బాలు వ్యక్తిగత కారణాలతో విచ్ఛిన్నం కావడం మనం రోజూ చూస్తూ ఉన్నదే. అయినప్పటికీ మన దేశంలో అనేక కుటుంబాల మధ్య కనిపించే అన్యోన్యతా భావం మరే దేశంలోనూ కనిపించదు. డబ్బు సంపాదన కోసం కనీసం భార్యభర్తలు కూడా ఒక చోట కూర్చుని ఒకరినొకరు పలక రించుకునే సమయం చిక్కడం లేదంటే కుటుంబాలు ఎంతగా విచ్ఛిన్న మయ్యాయో అర్థం చేసు కోవచ్చు. ఉమ్మడి కుటుంబాలలో కలిసి మెలిసి మనగలిగే మనస్తత్వాలు లోపించి పెళ్లయిన మరు నాడే వేరు కాపురాలు పెట్టుకుని జంటలుగా ఒంటరై పోతున్నారు. దీంతో సలహాలిచ్చే పెద్ద దిక్కులు లేకపోవడం, ఆపదలో ఆదుకునే ఆత్మీయులు దూరం కావడం, కనీసం మనసు లోని బాధలను పంచుకునే బంధువులు కరువవ్వడం నేటి సమాజంలో మనకు నిత్యం కనిపించే దృశ్యం. కుటుంబ దౌర్జన్యం చట్టం 498-ఎను దుర్వినియోగం చేయడం ద్వారా కొందరు భార్యలు, భర్తలతో పాటు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై తప్పుడు కేసులు బనాయించి వారిని వేధింపులకు గురి చేస్తున్నారు. బోగస్ వరకట్న కేసులు బనాయించడం ద్వారా దేశవ్యాప్తంగా 57 వేల మంది పురుషులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే పురుషులు వివాహం చేసుకోవడానికి వెనుకంజ వేసే పరిస్థితి వస్తుంది. భార్యాభర్తల మధ్య చోటు చేసుకున్న విభేదాలు న్యాయస్థానం వెలుపలనే పరిష్కరించు కోవడం సముచితంగా ఉంటుందని నవంబరు 12 ను జాతీయ కుటుంబ సౌహార్ద్ర దినోత్సవంగా జరుపు కోవాలని నిర్ణయించారు.

# ప్రజల గుండె చప్పుడైన కవి

బడికి వెళ్లి ఆయన అక్షరాలు చదవలేదు.. కానీ సమాజాన్ని ఆయన తన అంతర్ హృదయంతో చూశారు. సమాజంలో జరుగుతున్న ప్రజల వ్యథలు, పోరాటాలను కళ్లతో చూసి.. ఆ బాధలే ఆయనను ప్రజల పక్షాన ప్రజా గొంతుకగా నిలబడేలా చేసింది. చిన్నతనం నుంచే అనాథగా బతికిన ఆయన గుండెకు తాకిన గాయాలు ఎన్ని ఉంటాయో.. గొడ్ల కాపరిగా పనిచేస్తూ ప్రకృతి.. మూగజీవాలతోనూ మమేకం అయ్యారు. ప్రకృతి ఎదుర్కొనే ముప్పును సైతం పదాల అల్లికతో జత కట్టి పాటలు, పద్యాలు పాడుకున్నాడు. సమాజంలో భిన్నమైన సమస్యలతో సతమతమవుతున్న ప్రజల బతుకులను చూశాడు. కన్న తల్లిదండ్రులను పట్టించుకోకుండా.. మానవ సంబంధాలకు కనీస విలువనివ్వని సమాజాన్ని కళ్లారా చూశారు. ఆయన కళ్లతో చూసిందే.. పదాల అల్లికతో గేయంగా మారి ఆ గాయాన్ని మాన్పింది. అణచివేతల మీద ఆయన పాట ఉక్కు పిడి కిళ్లుగా మారాయి. అన్యాయంపై గళమెత్తే జన గర్జన అయింది. అందుకే అందెశ్రీ ఉద్యమ జన జాతర. తెలంగాణ మలి విడత ఉద్యమం ఉధృతంగా మారిన సమయంలో అందెశ్రీ పాటలు ప్రజల్లో గొప్ప పోరాట పటిమను చూపాయి. జన జాతరలో మన గీతం జయకే తనమై ఎగరాలి.. జంజవారుతా జన నినాదమై సాగాలి.. అంటూ మలి విడత ఉద్యమంలో ఆయన కవిత్వాలు లక్షలాది మందిని కదిలించాయి. చిన్న తనంలోనే కష్టాలు చూసిన అందెశ్రీ ప్రజల బతుకుల్లో గుణాత్మక మార్పు, సమాజ శ్రేయస్సు కోసం ఎన్నో రచనలు చేశారు. రవి చేరని చోటు ఉంటుంది.. కానీ కవి చేరని చోటు ఉండదు అన్నట్లుగా ఆయన కవిత్వం, పాటల రూపంలో ప్రతీ గుండెను తాకారు. ఆవేదనల గుండెలకు బలయ్యారు. అణచివేతపై తిరుగుబాటు గళం అయ్యారు. పోరాట పిడికిళ్లకు పదునైన గీతంగా మారాడు అందెశ్రీ. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో అందెశ్రీ జన్మించారు. ఆయన అసలు పేరు అందె ఎల్లయ్య. అనాథగా పెరిగిన అందెశ్రీ చిన్నతనంలోనే కష్టాలు వెంటాడాయి. తన కష్టాలను ప్రజల్లో, సమాజంలో చూసిన ఆయన తన పల్లెతో, ప్రకృతితో, మనుషుల హృదయాలతో మమేకం అయ్యారు. పల్లె జీవన బతుకులు తెలిసిన వ్యక్తిగా పల్లె నీకు వందనాలమ్మో.. తల్లీ నీకు వందనాలమ్మో.. అంటూ పల్లెను తల్లితో పోల్చి బతుకు విలువను నేర్పిన పల్లెలపై మమకారాన్ని చాటారు. కొమ్మ చెక్కితే బొమ్మరా.. కొలిసి మొక్కితే అమ్మరా మాయమైపోతున్నాడమ్మా మని షన్నవాడు.. మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు అంటూ సమాజంలో మంట కలుస్తున్న మానవ సంబంధాలపై రాసిన పాటలన్నీ ఆయన గుండెల నుంచి సమాజం కోసం ఉప్పొంగిన గొప్ప అక్షరాలు.. తెలంగాణ మలి విడత ఉద్యమం ఉధృతంగా మారిన తరుణంలో ఆ గేయం ఓ పోరాట తిలకంగా నిలిచింది. జనజాతరలో మనగీతం జయకేతనమై ఎగరాలి.. ఒకటే జననం.. ఓహో ఒకటే జననం.. జీవితమంతా జనమే మననం.. కష్టనష్టాలు ఎన్ని ఎదురైనా కార్యదీక్షలో తెలంగాణ అంటూ ఉప్పొంగిన గేయం తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష సాకారానికి ఎంతో భూమిక పోషించింది. అనేక రచనలు, కవిత్వాలతో ఆయన ఎంతోమంది సాహిత్య కారులకు, ప్రజా పోరాటాలకు ఓ చైతన్య గొంతుకగా నిలిచారు. ఆయన చేసిన అనేక రచనలకు కేయూ గౌరవ డాక్టరేట్‌ను సైతం ప్రదానం చేసింది. ఆయన పాటలు నంది అవార్డుతో పాటు ఎన్నో అవార్డులు గెలుచుకుని ఎంతోమంది ప్రజల గుండెలను గెలుచుకున్నారు. తెలంగాణ మలివిడత ఉద్యమంలో ధూంధాంకు ఉన్న సాంస్కృతిక ఉద్యమ పాత్ర గొప్పది. ఆ సమయంలో నాటి ఉమ్మడి పది జిల్లాలో తెలంగాణ ధూంధాం వేదికల మీద అందెశ్రీ పాటలు తెలంగాణ పల్లె బతుకులను కళ్లకు కట్టేలా చూపాయి. చూడ చక్కని తల్లి చుక్కల్లో జాబిల్లి.. నవ్వుల్లో నాగమల్లి నా ఊరు పాలవెల్లి.. మళ్లీ జనమా ఉంటే సూరమ్మో.. మళ్లీ నీ కడుపున పుడతామమ్మో అంటూ తెలంగాణ పల్లె ఆత్మీయతను గొప్పగా ప్రదర్శించారు. సమాజం హితం కోసం అనేక రచనలు చేసి సాహితీ శిఖరంగా ఎదిగిన ఆయన నేడు తెలంగాణ గీతంగా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలవనున్నారు. అందెశ్రీ రాసిన జయ జయహే తెలంగాణ పాట నేడు రాష్ట్రగీతంగా మారింది. సాహితీ లోకానికి, అటు గుణాత్మక సమాజం కోసం పరితపించిన అందెశ్రీ అకాల మృతి తీరని లోటు. అయినప్పటికీ ఆయన తెలంగాణ రాష్ట్ర గీతంగా ఎప్పటికీ ప్రజల గుండెల్లో తెలంగాణ ఉద్యమంలో జన జాతరను కదిలించిన సాహితీ శిఖరంగా కొలువై ఉంటాడు..

# న్యుమోనియా ప్రాణాంతకం..

2021లో న్యుమోనియా అంటువ్యాధితో 2.2 మిలియన్లు మరణించగా అందులో 5.02 లక్షల మంది పిల్లలు ఉన్నారు. ఐదేళ్ల లోపు వయసున్న పిల్లల అధిక మరణాలకు కారణమైన వ్యాధి న్యుమోనియా. కోవిడ్-19 కారణంతో మరో 10 మిలియన్లు కూడా అదనంగా మరణించినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. అధిక ప్రాణాలను గైకొంటున్న వ్యాధుల్లో న్యుమోనియా ప్రధానమైనదని తేలింది. వాతావరణ ప్రతికూల మార్పులు, గాలి కాలుష్యం కోరలు చాచడంతో శ్వాస వ్యవస్థ, ఊపిరితిత్తుల సమస్యలు ఉత్పన్నం కావడం, న్యుమోనియా మహా విపత్తు వస్తుందనే భయం కూడా ఉందని, మిలియన్ల జనులు న్యుమోనియా సోకే ప్రమాదపు అంచున ఉన్నారని వైద్యులు అంచనా వేస్తున్నారు. న్యుమోనియా వ్యాధి ఐదేండ్ల లోపు పిల్లలకు, వృద్ధులకు వస్తుంది. టీకాలు వేయించుకోని వారు, పోషకాహారలోపాలు, ఇంట్లో వంట చెరుకు వాడే వారు, కలుషిత గాలి పీల్చే పెద్దలు, పొర త్రాగే దురలవాటు ఉన్న వారు అధికంగా న్యుమోనియా బారిన పడే ప్రమాదం ఉంటుంది. న్యుమోనియా వ్యాధి తీవ్రత, ప్రమాదాన్ని గుర్తించిన అంతర్జాతీయ సమాజం 2009 నుంచి ప్రతి ఏట 12 నవంబర్ రోజున "ప్రపంచ న్యుమోనియా దినం" పాటిస్తూ ఆ వ్యాప్తి పట్ల కనీస అవగాహన కల్పించడం జరుగుతోంది. బ్యాక్టీరియా, వైరస్ లేదా ఫంగీ సంక్రమణ కారణంగా తాపజనక శ్వాస రుగ్మత (ఇన్‌ఫ్లమేటరీ రెస్పిరేటరీ డిసార్డర్) లేదా న్యుమోనియా వ్యాధి అంటుకుంటుంది. ఈ సూక్ష్మజీవులు ఊపిరితిత్తుల్లో చేరి "ఎల్వియోలి" అనే భాగంపై ప్రభావాన్ని చూపి న్యుమోనియాకు దారి తీస్తుంది. దీని వల్ల ఊపిరితిత్తుల్లో నీరు చేరి శ్వాస తీసుకోవడం ఇబ్బంది అవుతుంది. బలహీన వ్యాధినిరోధకశక్తి కలిగిన పిల్లలు, వృద్ధులకు న్యుమోనియా సోకి ప్రాణాంతకంగా కూడా మారవచ్చు. ప్రపంచ న్యుమోనియా దినం -2025 ఇతివృత్తంగా "పిల్లల మనుగడ (చైల్డ్ సర్వైవల్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. న్యుమోనియా నివారించదగిన అంటువ్యాధి. వ్యాధిగ్రస్థులు తుమ్మడం, దగ్గడం, ముక్కు చీదడం లాంటి సందర్భాల్లో మరొకరికి సంక్రమిస్తుందని తెలుసుకోవాలి. పిల్లల్లో బ్యాక్టీరియా కారణ స్ట్రెప్టోకోకల్ న్యుమోనియా అతి ప్రధానమైనది. దాని తర్వాత హిమోఫిలస్ ఇన్‌ఫ్లుయెంజా రెండవ ప్రధానమైనది. న్యుమోనియాలో రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ వ్యాధి వైరస్ వర్గంలో ముఖ్యమైనది. న్యుమోనియా వ్యాధికి చికిత్స కూడా అందుబాటులో ఉన్నది. ప్రపంచ న్యుమోనియా దినం వేదికగా ప్రభుత్వాలు, వైద్య ఆరోగ్య శాఖ, ఎన్‌జిఓలు, ఇతర సంస్థలు కలిసి న్యుమోనియా పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, రోగగ్రస్థులకప చికిత్సా పద్ధతులు వివరించడం మంచి ఫలితాలను ఇస్తాయి. న్యుమోనియాను తొలిదశలో గుర్తించడం, చికిత్స తీసుకోవడం, నివారణ మార్గాలను తెలుసుకోవడం లాంటి అంశాలను గుర్తుంచుకోవాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం ప్రతి ఏట 14 లక్షల పిల్లలు న్యుమోనియా సోకి చనిపోవడం, పిల్లల మరణాల్లో 18 శాతం వరకు న్యుమోనియా కారణం కావడం గమనార్హం. యూనిసెఫ్ వివరాల ప్రకారం ప్రతి 39 సెకన్లకు ఒక పిల్లవాడు న్యుమోనియాతో మరణిస్తున్నాడు. వృద్ధుల్లో న్యుమోకోకల్ న్యుమోనియా అధికంగా సోకుతుంది. న్యుమోసిస్టిక్ జిరోవెస్సీ వ్యాధి ఫంగస్ సోకడంతో వస్తుంది. గాలి కాలుష్యం, స్మోకింగ్ వల్ల 16 లక్షల వృద్ధులు మరణిస్తున్నారు. డబ్ల్యూహెచ్ఓ, యూనిసెఫ్‌లు సంయుక్తంగా న్యుమోనియా, డయేరియా వ్యాధుల కట్టడికి గ్లోబల్ ఆక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారు. ఐదేళ్ల లోపు పిల్లలు, 65 ఏండ్లు దాటిన వృద్ధులు, దీర్ఘకాలిక




అనారోగ్యాలతో బాధపడుతున్న రోగులు, పర్యావరణ కాలుష్య ప్రాంతాల్లో నివసిస్తున్న జనులు, హెచ్ఐవి/క్యాన్సర్ లాంటివి సోకిన వ్యాధిగ్రస్థులు న్యుమోనియా ప్రమాదంలో పడే అవకాశాలే ఎక్కువ. టీకాలు వేయించడం, పోషకాహారం అందిచడం, గాలి కాలుష్యాన్ని తగ్గించడం వల్ల న్యుమోనియా వ్యాధి తీవ్రత తగ్గుతుంది. ఆంటీబ్యాక్టీరియల్, అంటీ వైరల్, ఆంటీ ఫంగల్ ఔషధాలతో న్యుమోనియా కట్టడి జరుగుతుంది. భౌతిక దూరాలు పాటించడం, మాస్కులు ధరించడం, పబ్లిక్ పిరజేశాల్లో ఉమ్మి వేయకుండా ఉండడం, దగ్గినపుడు లేదా తుమ్మినపుడు కండువా కప్పుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, గాలి కాలుష్యాన్ని కట్టడి చేయడం, నదుల్ని కలుషితం కాకుండా చూసుకోవడం లాంటి పలు దాగ్రత్తలు న్యుమోనియా కేసులను తగ్గిస్తాయి. పిల్లలకు, పెద్దలకు అతి ప్రమాదకరమైన అంటు వ్యాధిగా నిలిచిన న్యుమోనియా పట్ల సరైన అవగాహన పెంచుకొని అలాంటి ప్రాణాంతక రుగ్మతకు చరమగీతం పాడదాం, న్యుమోనియా కానరాని భారతాన్ని నిర్మించుకుందాం.

# కర్మయోగి మదన్‌మోహన్ మాలవ్య

భారత దేశ వాసులచే -మహాత్ముని'గా గౌరవించ బడిన మహా మనీషి జాతిపిత మోహన్ దాస్ కరంచంద్ గాంధీ. అలాంటి గాంధీ చేతే -మహామాన-బిరుదు పొందిన నేత పండిట్ మదన్ మోహన్ మాలవ్య. మదన్ మోహన్ మాలవ్య (1861-1946) భారతీయ విద్యావేత్త, రాజకీయ వేత్త. భారతీయ స్వాతంత్ర్యో ద్యమంలో పాల్గొన్న సమర యోధుడు. ఆయన "పండిట్ మదన్ మోహన్ మాలవీయ" గా కూడా సుపరిచితుడు. ఆయన "మహాత్మా" గా కూడా గౌవరింప బడ్డాడు. మాలవ్య1915 లో బెనారస్ హిందూ విశ్వ విద్యాలయం వ్యవస్థాపకుడు. వారణాసిలో ఈ విశ్వ విద్యాలయాన్ని స్థాపించాడు. భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షునిగా నాలుగు సార్లు పనిచేశాడు. 1861, డిసెంబర్ 25 తేదిన అలహాబాదులో మూనాదేవి, బ్రిజ్‌నాథ్ దంపతులకు జన్మించిన మదన్ మోహన్ మాలవ్య పూర్వీకులు మధ్యప్రదేశ్ లోని మాల్వా ప్రాంతం నుండి వలస వచ్చారట. అందుకే ఆయన ఇంటి పేరు కూడా మాలవ్యగా సార్థక మైంది. ఆయన అసలు ఇంటి పేరు చతుర్వేది. మాలవ్యాలు బెనార్స్ లోని అగర్వాల్ వర్తకులకు ఇంటి పురోహితులుగా ఉన్నారు. ఆయన తండ్రి సంస్కృత గ్రంథములను అభ్యసించేవాడు. ఆయన శ్రీమద్భాగవతమును చెప్పి ధనం సంపాదించే వాడు. మాలవ్య సంప్రదాయకంగా రెండు సంస్కృత పాఠశాలలో విద్యాభ్యాసం చేశాడు. ఆ తరువాత ఆయన ఆంగ్ల పాఠశాలలో తన విద్యాభ్యాసాన్ని కొనసాగించాడు. పాఠశాల రోజుల నుండే మకరంద్ అనే కలం పేరుతో కవిత్వం రాయడం ప్రారంభించాడు మాలవ్య. 1879 లో ముయిర్ సెంట్రల్ కాలేజీ నుండి మెట్రి క్యులేషన్ పూర్తి చేశాడు. ఆ కళాశాల ప్రస్తుతం అలహాబాదు విశ్వ విద్యాలయంగా ప్రసిద్ధి చెందినది. మాలవ్యా కలకత్తా విశ్వవిద్యాలయం నుండి బి.ఎ. లో పట్టభద్రులైనాడు. సంస్కృతం లో ఎం.ఎ చేయాలనుకున్నప్పటికీ ఆయన కుటుంబ పరిస్థితులు సహకరించలేదు. తర్వాత ఉపాధ్యాయునిగా తన జీవితాన్ని మొదలు పెట్టాడు. అంతకు ముందే ఆయన 'ది ఇండియన్ ఒపీనియన్' అనే పత్రికకు సబ్ ఎడిటర్‌గా పని చేశాడు. అలాగే న్యాయ శాస్త్రంలో కూడా పట్టా పొందాడు. 1907లో మాలవ్య స్వయంగా 'అభ్యుదయ' అనే వార్తాపత్రిక ప్రారంభించాడు. 1909 లో అలహాబాదు నుండి వెలువడు తున్న ఆంగ్ల పత్రిక లీడర్ పత్రికను స్థాపించాడు. ఆయన 1924 నుండి 1946 వరకు హిందూస్థాన్ టైమ్స్‌కు చైర్మన్ గా ఉన్నాడు. ఆయన సేవలు 1936 లో హిందీ ఎడిషన్ ప్రారంభానికి ఉపయోగపడ్డాయి. 1908లో బ్రిటీష్ ప్రభుత్వం పత్రికలపై ఆంక్షలు విధించి నప్పుడు.. వాటికి వ్యతిరేకంగా అలహాబాద్‌లో అఖిల భారత కాన్ఫరెన్సును నిర్వహించాడు. 1922లో హిందు మహాసభ అధ్యక్షుడుగా పనిచేశాడు. "సత్యమేవ జయతే" అనే నినాదాన్ని తొలినాళ్లలో ప్రాచుర్యం లోకి తీసుకొచ్చింది మాలవ్యనే. మాలవ్య భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షునిగా నాలుగు సార్లు (1909, 1913,1919,1932) పని చేశాడు.ఆయన 1934లో కాంగ్రెస్ ను విడిచి పెట్టాడు. హిందూ మహాసభలో ముఖ్యమైన నాయకునిగా కూడా ఉన్నాడు.

## సర్పంచ్ తండాలో పశు వైద్య శిబిరం తనిఖీ



పెద్దవంగర, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి): మండల పరిధిలోని సర్పంచ్ తండాలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని జిల్లా పశు వైద్యాధికారి కిరణ్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మండల పశు వైద్యాధికారి రాజశేఖర్ తో కలిసి మాట్లాడారు. పాడి రైతులు పశు సంపదపై దృష్టిసారించి, ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. పశు సంపద మన గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకవంటిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత టీకా కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 14 వరకు గాలికుంటు వ్యాధికి టీకాలు వేస్తారని, తప్పనిసరిగా పశువులకు టీకాలు వేయించాలన్నారు. పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా, ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పశుపాకల పరిశుభ్రత, దూడలలో నట్టల నివారణ వంటి విషయాలపై పశు పోషకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సంధ్య, అనిల్, హాసన్, పాడి రైతులు నెహ్రూ నాయక్, దేవా, బోజ్యా, సోమాని, రవి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ మైనారిటీ గురుకుల సి ఓ ఈ ల ప్రిన్సిపల్ కు ఉత్తమ అవార్డు

- తెలంగాణ మైనారిటీ గురుకుల బార్కాస్ బాలురు వన్ సిఓఇ ప్రిన్సిపల్ షఫియా బేగం
- తెలంగాణ రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్ సాహెబ్ చేతుల మీదగా అవార్డు ప్రధానం



హైదరాబాద్, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):భారతీయ ప్రథమ విద్యశాఖ మాత్యులు అబుల్ కలాం ఆజాద్ జన్మదినం పురస్కరించుకొని మంగళవారం రవీంద్రభారతిలో ఆయన చిత్రపటానికి పూలవమాలలు వేసి ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర మైనారిటీ శాఖ మాత్యులు మొహమ్మద్ అజారుద్దీన్ సాహెబ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ మైనారిటీ గురుకుల బార్కాస్ బాలుర వన్ కళాశాల( సి ఓ ఈ) ల ప్రిన్సిపల్ సఫియా బేగంకు మంత్రివర్యులు మొహమ్మద్ అజారుద్దీన్ సాహెబ్ చేతుల మీదుగా మెమెంటో , ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు ప్రధానం చేయడం జరిగింది. మైనారిటీ గురుకుల విద్యార్థులకు మంచి క్రమశిక్షణ, ఐఐటి, నీట్ తదితర కోర్సులకు సంబంధించిన శిక్షణలో ఉత్తమ ఫలితాలు అందించినందుకుగాను ప్రిన్సిపల్ సఫియా బేగంకు ఈ అవార్డు ప్రధానం చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా మైనార్టీ గురుకుల సొసైటీ కార్యదర్శి బి. షఫీ ఉల్లా మాట్లాడుతూ అన్ని సిఓఈలకు ఇన్చార్జిగా సఫియా బేగంను నియమించడం జరిగిందని తెలిపారు. తదనంతరం ప్రిన్సిపల్ సఫియా బేగం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మైనార్టీ శాఖ మాత్యులు మొహమ్మద్ అజారుద్దీన్ సాహెబ్, తెలంగాణ గురుకుల మైనార్టీ సొసైటీ అధ్యక్షుడు మొహమ్మద్ ఫ్రైమ్ ఖురేషి, తెలంగాణ మైనార్టీ వెల్ఫేర్ డైరెక్టర్ , గురుకుల కార్యదర్శి బి. షఫీ ఉల్లా కు కృతజ్ఞతలు తెలిపారు.


## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా అబుల్ కలాం జయంతి వేడుకలు



నారాయణపేట నవంబర్ 11 (వుదయం ప్రతినిధి): నారాయణపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాలేజ్ ప్రిన్సిపాల్,జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ హెచ్. సుదర్శన్ రావు అధ్యక్షత వహించారు. సందర్భంగా విద్యార్థులు మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలపై ప్రసంగాలు, కవితలు, వ్యాసాలు అందించారు. మౌలానా ఆజాద్ దేశం మొదటి విద్యా మంత్రి మాత్రమే కాకుండా గొప్ప తత్త్వవేత్త, రచయిత, జ్ఞానసాధకుడు, నిజమైన దేశభక్తుడు అని కొనియాడారు. హెచ్. సుదర్శన్ రావు మాట్లాడుతూ మౌలానా ఆజాద్ ఆలోచనలు ఇవాళ్టికీ మనకు దీపస్తంభంలా మార్గదర్శనం చేస్తున్నాయని పేర్కొన్నారు. యువత తమ విజయానికి, దేశ ప్రగతికి విద్యనే ఆధారంగా తీసుకోవాలని సూచించారు. విద్య అనేది కేవలం వ్యక్తిగత అవసరం మాత్రమే కాకుండా జాతీయ కర్తవ్యమని అన్నారు. అంతకుముందు విద్యార్థుల కోసం రాతపరీక్షా పోటీ నిర్వహించగా, అందులో మొదటి, రెండవ, మూడవ స్థానాలు సాధించిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

## పాఠశాలలను శుభ్రంగాసురక్షితంగా తీర్చిదిద్దడం అందరి బాధ్యత







గద్వాల నవంబర్ 11 (వుదయం ప్రతినిధి)మంగళవారం జిల్లా కేంద్రంలోని వజ్ర ఫంక్షన్ హాల్లో డిఆర్డిఏ యూనిసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిశోర బాలికల సమస్యలు పాఠశాలలలో వాష్ నీరు, పారిశుద్యం పరిశుభ్రత అంశాలపై అవగాహన సమావేశంలో అదనపు కలెక్టర్ బి. నర్సింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలను శుభ్రంగా, సురక్షితంగా, బాలికలకు అనుకూలంగా తీర్చిదిద్దడం అందరి బాధ్యత అని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు పేర్కొన్నారు యూనిసెఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 94 పాఠశాలల వాష్ సర్వే నివేదికను విడుదల చేశారు. నరసింహారెడ్డి సర్వే వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి. నర్సింగరావు మాట్లాడుతూ, బాలికల విద్యా ప్రగతి కోసం పాఠశాలల్లో పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు, శౌచాలయాల నిర్వహణ అత్యంత కీలకమని పేర్కొన్నారు.బాలికల కోసం ప్రత్యేక శౌచాలయాలు మరియు హైజిన్ సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు.ప్రతి పాఠశాలలో హైజిన్ పై విద్యార్థులలో అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు.ఎంఈఓలు మరియు ప్రధానోపాధ్యాయులు నెలనెలా పాఠశాల పరిశుభ్రత, నీటి వనరుల పరిస్థితిపై సమీక్ష చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ నేషనల్ ఆఫీసర్ మురళీకృష్ణ , ప్రతినిధులు ఏ. వెంకటేష్,మెరీ జోన్స్,అదనపు డిఆర్డిఓ శ్రీనివాస్,జిల్లా విద్యా అధికారి విజయలక్ష్మి,మిషన్ భగీరథ ఈ.ఈ శ్రీధర్ రెడ్డి,జిల్లా ఆసుపత్రి నుండి డాక్టర్ ప్రసూన,ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇవిఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘా ఉండాలి

-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

-నెలవారీ ఇవిఎం గోడౌన్ తనిఖీ చేపట్టిన జిల్లా కలెక్టర్



ఖమ్మం ,నవంబర్ 11 (వుదయం ప్రతినిధి): ఇవిఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘాతో భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలోని ఇవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ నెలవారీ తనిఖీ చేశారు.ఇవిఎం గోడౌన్ సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలు, సిసి కెమెరాలను పరిశీలించి, పనిచేస్తున్నవి, లేనిది అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సైరన్ మోగుతున్నది పరిశీలించారు. భద్రతా సిబ్బంది షిఫ్టు ల వారి విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. భద్రతా లోపాలు లేకుండా చూడాలన్నారు. మొదటి అంతస్తు ఆవరణలో నీరు నిల్వకుండా చేపడుతున్న పనులు పరిశీలించారు. భద్రతాపరంగా ఎలాంటి లోపాలు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కలెక్టర్ తనిఖీ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, ఎన్నికల డిటి అన్సారీ, ఆర్ అండ్ బి ఏఇ లలిత, అధికారులు తదితరులు ఉన్నారు.

## ఆటోమొబైల్ షోరూంల నూతన కార్యవర్గం ఎన్నిక






జన్నారం, నవంబర్ 11(వుదయం విలేఖరి) జన్నారం ఆటోమొబైల్ షోరూమ్ ల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా మంగళవారం రోజున ఆటోమొబైల్ షోరూంలో యజమానులు సమావేశం ఏర్పారుచుకున్నారు.ఈ సమావేశంలో నూతన అధ్యక్షుని గా గొట్ల గోపాల్, ఉపాధ్యక్షుడిగా నరసయ్య, ప్రధాన కార్యదర్శిగా నరసింహులు,కోశాధికారిగా హరికృష్ణ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో యజమానులు శంకర్, లక్ష్మణ్, రంజిత్, సతీష్, బాబా తదితరులు పాల్గొన్నారు.

## అందెశ్రీ మృతి తీరని లోటు



జన్నారం, నవంబర్ 11(వుదయం విలేకరి) అందెశ్రీ మృతి తీరని లోటని పలు సంఘాల నాయకులు అన్నారు.ఆయన మృతికి సంతాపంగా మంగళవారం రోజున వారు పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభ్యుదయ రచయిత అందే శ్రీ అని, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అందెశ్రీ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు బోట్ల భాగ్యారావు, రత్నం లక్ష్మణ్, యాతం నాగేష్, దుర్గం అమృతరావ్, దుర్గం దేవయ్య, రాథోడ్ ప్రకాష్, ముల్కల్ల ప్రభాకర్, రత్నం మాణిక్యం,బొర్రకుంట రాజు వెంకట్, అక్క వత్తుల దేవయ్య పాల్గొన్నారు.

## మరణించిన తోకల లక్ష్మికి పూలమాలవేసి నివాళులర్పించిన టీఆర్ఎస్ కార్యకర్తలు



ధర్మసాగర్, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి) ధర్మసాగర్ చెందిన తోకల లక్ష్మి ( బి ఆర్ఎస్ )పార్టీ మాజీ మండల అధ్యక్షురాలు మరణించగా పూల దండ వేసి సంతాపం తెలిపిన ధర్మసాగర్ మండల బిఆర్ఎస్ నాయకులు కర్రె సోమిరెడ్డి బొడ్డు, ప్రభుదాస్, జుబేదా లాల్, బొడ్డు ప్రతాప్, శాతవేణి రమేష్ , చాడ కుమార్ ,మెరుగు రాజిరెడ్డి, బొడ్డు బాలు, బైర మధుకర్, బెల్లం ప్రేమ్ కుమార్, కళ్లెపు రాజమణి , సురుగురి కవిత తదితరులు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బాల భక్త పోటీలలో జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి పోటీలకు ఎంపిక

-రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.





ఖానాపురం, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి):మండలంలోని బుధరావుపేట గ్రామంలోని జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థిని జీ శివాని జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో గెలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హై స్కూల్ హెచ్ఎం సయ్యద్ ఆరిఫ్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ ఏం మాట్లాడుతూ తెలంగాణ స్కిల్స్ అకాడమిక్ ట్రైనింగ్ అండ్ గెజిటెడ్ హెడ్మాస్టర్ అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన పోటీలో ఈనెల 7న మండల స్థాయిలో నిర్వహించిన పోటీలలో ప్రథమ స్థానంలో గెలుపొంది జిల్లా స్థాయికి ఎంపిక కాగా జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలో గెలుపొంది రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్ ఎం తెలిపారు. గెలుపొందిన విద్యార్థినిని, గైడ్ టీచర్ని హెచ్ఎం తో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## సాంస్కృతిక కార్యక్ర మాలను ప్రారంభించిన గట్టు ధనలక్ష్మీ కృష్ణమూర్తి





గద్వాల నవంబర్ 11 (వుదయం ప్రతినిధి): జోగులాంబ గద్వాల జిల్లాలోని గద్వాల నియోజకవర్గం గట్టు మండల కేంద్రంలో శ్రీ శ్రీ శ్రీ మాత అంబా భవానీ జాతరలో సాంస్కృ తిక కార్యక్రమాలు ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా గట్టు గ్రామ తాజా మాజీ సర్పంచ్ ధనలక్ష్మి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు పలుకల కోళ్ళు ఆటలు నిర్వహించారు వివిధ గ్రామల నుంచి వచ్చిన ప్రజలు సాంస్కృతిక కార్యక్రమాలను చూసి అందించారు.గట్టు గ్రామ తాజా మాజీ సర్పంచ్ ధనలక్ష్మి కృష్ణమూర్తి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని యువత చదువుతో పాటు ఆట పాటలు వ్యాపార రంగాలలో రాణించాలి అన్ని రంగాల్లో కూడా రాణించాలి అప్పుడే గట్టు మండలం, గద్వాల నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని తెలిపారు

## లబ్ధిదారులకు కళ్యాణ్ లక్ష్మి చెక్కులు పంపిణీ



మరికల్ నవంబర్ 11 ( వుదయం ప్రతినిధి) మరికల్ మండల కేంద్ర పరిధిలోని కన్మనూర్ ఎక్లాస్పూర్ జిన్నారం బుడ్డగాని తాండ గ్రామాలలో కల్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన మరికల్ తహసిల్దార్ రామకోటి లబ్ధిదారులకు అందరూ వచ్చి చెక్కులు తీసుకొని వెళ్లాలని ఆయన అన్నారు కాంగ్రెస్ ఈ కార్యక్రమంలో గిడ్డవరి సుధాకర్ రెడ్డికాంగ్రెస్ నాయకులు సూర్య మోహన్ రెడ్డి నర్వ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నయ్య సాగర్ శేఖర్ రెడ్డి పార్టీ సీనియర్ నాయకులు విజయరెడ్డి హరీష్ కుమార్ జంగిడి రవి టైసన్ బోయ వెంకటేష్ తో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు మరియు లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## అబుల్ కలాం ఆజాద్ కి ఘన నివాళులు అర్పించిన అఖిలపక్ష మైనార్టీ నాయకులు



గద్వాల నవంబర్ 11 (వుదయం ప్రతినిధి): గద్వాల పట్టణంలోని తెలంగాణా మైనార్టీ బాలికల జూనియర్ కళాశాల తెలంగాన మైనార్టీ రెసిడెన్షియల్ గర్ల్స్ హై స్కూల్ నందు కళాశాలల స్కూల్ యాజమాన్యాలు ఏర్పాటు చేసిన మైనార్టీ డే జాతీయ విద్యా దినోత్సవం రోజునా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదిన సందర్భంగా ఘనంగా కలాంకి మంగళవారం రోజు నివాళి అర్పించడం జరిగింది.

భారతదేశంలో మొదటి విద్యా శాఖ మంత్రిగా స్వాతంత్ర సమరయోధునిక బహు ముఖ ప్రజ్ఞాశాలి బహు భాష కోవిదుడు అయినా అబుల్ కలాం ఆజాద్ జన్మదిన సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవంగా గుర్తించడం జరిగిందని విద్య కోసం ఆయన అనేక మార్పులు చేశారని ముఖ్యంగా బాలికల విద్యను పెద్ద ఎత్తున ప్రోత్సహించారని విద్య ద్వారానే దేశం అభివృద్ధి చెందు తుందని మత సామరస్యానికి విద్య తోడ్పడుతుందని ఆయన తన జీవితాంతం దానికోసం శ్రమించాడని వక్తలు కొనియాడారు స్వాతంత్ర ఉద్యమం కోసం పది సంవత్సరాలు జైలుకు వెళ్లిన గొప్ప మైనార్టీ నాయకుడని అటువంటి వ్యక్తికి నివాళులర్పించడం అంటే ఆయన కలగన్న పేదరిక నిర్మూలన మత నిర్మూలన జరగాలని ఆస్థానములో విజ్ఞాన వంతమైన సమాజం నిర్మించాలని ఆయన కలలు గొన్నారు. ఆకలలు నెరవేర్చడమే నేటి తరానికి బాధ్యత అని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రములు, ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికూర్ రహామన్ బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు కూర్వ పల్లయ్య, కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు ముహమ్మద్ ఇసాక్, ముహమ్మద్ రహమతుల్లా ఆటో చాంద్ పాషా, కౌసర్ బైగ్ సమీ ఉల్లా షరీఫ్ సమీ, తదితరులు పాల్గొన్నారు

## గ్రూప్ 2లో విజయం సాధించిన షేక్ సమీనాను అభినందించిన కలెక్టర్



సూర్యాపేట ,నవంబర్ 11 (వుదయం ప్రతినిధి): జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో భారత ప్రభుత్వ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 2 ఫలితాలలో విజయం సాధించి సెక్రటేరియట్లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్గా నియామకమైన షేక్ సమీనా, యాకూబ్ పాషా లను కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధికారి శ్రీనివాస్, TSMESA అధ్యక్షుడు షేక్ బడేసాహెబ్ ప్రధాన కార్యదర్శి షేక్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

వుదయం



# అక్షయపాత్ర వద్దు.. వంటశాలలే ముద్దు

## అదనపు కలెక్టర్ కు ఏఐటియుసి వినతి




నారాయణపేట నవంబర్ 11( వుదయం ప్రతినిధి)ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న ప్రైవేటు సంస్థకు కట్టబెట్టొద్దని అక్షయపాత్రను వెంటనే రద్దు చేయాలని ఏఐటియు సి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి. వెంకటేష్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ సంతోష్ అన్నారు. నారాయణ పేట జిల్లా కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మికుల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో రాష్ట్రంలో పేద బడుగు బలహీన వర్గాల పేద విద్యార్థులు పౌష్టికారముతో పాటు మంచి భోజనాన్ని అందిస్తున్న కార్మికుల పట్ల ఈ ప్రభుత్వం మంచి ఆలోచనతో గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కార్మికులకు వేతనాలు పెంచి,పోషికారంతోపాటు నిత్యవసర వస్తువులు గ్యాస్ ఒకపక్క బిల్లు వెంటనే మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు.కార్మికులు చేసి పథకాన్ని నిర్వహిస్తు అనేక ఆర్థిక సామాజిక క్షోభకు గురవుతున్నారని వెంటనే వారి బిల్లులు అంద చేయాలని డిమాండ్ చేశారు.కార్మికులకు సామాజిక ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వ రంగంలో నిర్వహించవలసిన మధ్యాహ్న భోజన పథకాన్ని సెంట్ర లైజ్ కిచన్ విధానం పేరుతో నే ప్రైవేట్ సంస్థ అయిన అక్షయపాత్రకు అప్పగించే విధానాన్ని విరమించుకోవాలని,గ్రేడ్స్ కోడుతో పాటు కార్మికులకు పోస్టింగ్ ఆర్డర్స్ ప్రభుత్వమే ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలి అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల ఆధ్వర్యంలో నల్లబ్యార్జీలతో నిరసన కార్యక్రమాలు నిర్వహించి అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు.ఈనెల 24న రాష్ట్ర కమిషనర్ ఆఫీసర్ ముందు మధ్యాహ్న భోజన కార్మికులతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు జిల్లా. అధ్యక్షురాలు. రేఖమ్మ. ఉపాధ్యక్షులు .ఎర్రమ్మ కార్యదర్శి లక్ష్మి కోశాధికారి సువర్ణ. సాయమ్మ దేవమ్మ కురువ ఎర్రమ్మ .కురువ అంజమ్మ, లక్ష్మి. కే లక్ష్మి.అనురాధ. లక్ష్మమ్మ అనురాధ .అనంతమ్మ. జి లక్ష్మి .తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

## అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి



హనుమకొండ, నవంబర్ 11 (వుదయం జిల్లా ప్రతినిధి) : హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జాతీయ విద్యా దినోత్సవం, స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి రోజైన నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రి అయిన మౌలానా అబుల్ కలామ్ దేశంలో విద్యాభివృద్ధికి బాటలు వేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కె.ఏ. గౌస్ హైదర్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# మేజిక్ స్టార్ అవార్డు అందుకున్న కళ్యాణ్



హనుమకొండ, నవంబర్ 11 (వుదయం జిల్లా ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ మెజీషియన్స్ అసోసియేషన్ (ఏపీఎంఏ) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లా రాజంపేటలో ఆదివారం జరిగిన 41వ మేజిక్ ఫెస్టివల్ ఃమాయాలోకంఃలో వరంగల్ కు చెందిన ప్రముఖ మెజీషియన్, నేషనల్ అవార్డు విజేత శ్రీరాం కళ్యాణ్ ఃమేజిక్ స్టార్ః అవార్డుతో పాటు రూ.5,000 నగదు రివార్డును అందుకున్నారు. ఇంద్రజాల రంగంలో విశిష్ట సేవలందిస్తున్న వారికి ప్రముఖ మెజీషియన్ డా. బోస్ ప్రతి యేటా ప్రదానం చేసే ప్రతిష్టాత్మక ఃమేజిక్ స్టార్ః అవార్డుకు ఈ సంవత్సరం కళ్యాణ్ ను ఎంపిక చేసారు. కార్యక్రమంలో ఆయనను గజమాలతో ఘనంగా సత్కరించి, అవార్డును, నగదును ప్రదానం చేసారు. మేజిక్ రంగానికి ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా డా. బోస్ మాట్లాడుతూ ఇప్పటినుంచి ఆయనను మేజిక్ స్టార్ కళ్యాణ్ఃగా పిలవాలని సూచించారు. అవార్డు స్వీకర్త శ్రీరాం కళ్యాణ్ మాట్లాడుతూ ఈ అవార్డుకు తనను ఎంపిక చేసిన డా. బోస్ కు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జె.వి.ఆర్, యు.పి. రాయుడు, డా.ఆర్యల్, డా.రమ్యశ్రీ, రఘుబాబు, విజయభాస్కర్ రెడ్డి, సృజన్ కుమార్.

## వి ఎస్ ఆర్ ఫ్యామిలీ మార్ట్ లక్కీ డ్రా విజేత కోడెపాక



పరకాల, నవంబర్ 11 (వుదయం జిల్లా ప్రతినిధి): హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోనీ వి ఎస్ ఆర్ ఫ్యామిలీ షాపింగ్ మాల్ లో దసరా, దీపావళి సందర్భంగా 499 కొనుగోలుపై ఉచిత కూపన్ పొందారు. నేడు వారికి బంపర్ బోనంజ ఆఫర్స్ లక్కీ డ్రా తీయబడిన డ్రాలో రెండవ బహుమతిగా నర్సక్కపల్లె గ్రామం నడికూడ మండలం కు చెందిన కోడపాక భాస్కర్ రెండవ బహుమతి గెలుపొందినారు. భాస్కర్ కు రావడం పట్ల కాలనీవాసులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కోడెపాక భాస్కర్ మాట్లాడుతూ ఈ బహుమతి గెలుపొందాడు నాకెంతో సంతోషకరమైన తెలిపారు.

## గ్రామ పార్టీ అధ్యక్షుని పరామర్శించిన జిల్లా అధికార ప్రతినిధి తక్కలపల్లి



ఖానాపురం, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి): మండలంలోని అయోధ్యనగర్ గ్రామానికి చేందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గుండ్ల యాకయ్య అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని తిరిగి ఇంటికి వచ్చిన గ్రామ పార్టీ అధ్యక్షుని జిల్లా అధికార ప్రతినిధి తక్కలపల్లి రవీందర్ రావు పరామర్శించి సానుభూతి వ్యక్తం చేసి బాధితుడికి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో అశోక్ నగర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు కదురు సారయ్య, నాయకులు ఎల్ది శ్రీనివాస్, బొంపెల్లి అనిల్ రావు, జాడి వెంకటేష్, కుస మునెందర్, , కొంతం రాజు, కర్రే మల్లయ, పెండ్లి రాజు, బానోత్ మల్లేష్, జక్కుల భాను, గోనెల మురళి, అలవాలా మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 13న బీసీల ధర్మ పోరాట దీక్షను విజయవంతం చెయ్యండి



హనుమకొండ, నవంబర్ 11 (వుదయం జిల్లా ప్రతినిధి): బీసీలకు విద్య, ఉద్యగ, స్థానిక సంస్థ ఎన్నికల్లో 42% రిజర్వేషన్ల సాధనకై బీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నేల 13న, హన్మకొండ ఏకాశిలా పార్క్ ముందు ఒక్క రోజు బీసీల ధర్మ పోరాట దీక్ష వరంగల్ ఉమ్మడి జిల్లా బీసీ జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టునున్నట్లు బీసీ జేఏసీ వరంగల్ ఉమ్మడి జిల్లా చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. 13న జరిగే బీసీల ధర్మ పోరాట దీక్ష కు బీసీ సంఘాల నాయకులు, బీసీ కుల సంఘాల నాయకులు, బీసీ మేధావులు, బీసీ ఉద్యోగస్తులు, ప్రజా సంఘాల నాయకులు, బీసీ మహిళలు, బీసీ యువత, బీసీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని బీసీ ధర్మ పోరాట దీక్ష ను విజయవంతం చెయ్యాలని పిలుపు నిచ్చారు.

# ఖిల్లలో నిత్యం పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలి: 37డివిజన్ అఖిల పక్ష నాయకులు



వరంగల్, నవంబర్ 11 (వుదయం ప్రతినిధి): వరంగల్ తూర్పు కోట,నూతనంగా నిర్మిస్తున్న రింగ్ రోడ్ ప్రాంతంలో నిత్యం పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని మిల్స్ కాలనీ షఐ బొల్లం రమేష్ గారికి తూర్పుకోట అఖిల పక్ష నాయకులు వినతి పత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా అఖిల పక్ష నాయకులు మాట్లాడుతూ ఆకాతాయిలు, యువకులు, మద్యం ప్రియులు,తదితరులు కాలి ప్రదేశం అయినా రింగ్ రోడ్ పైన మద్యం సేవించి అటు అవైపుగా వెళ్లే వారికి ఇబ్బంది కలిగిస్తున్నారని, అలాగే అదే ప్రాంతం లో ఉండే వ్యవసాయం చేసుకునే రైతులకు ఇబ్బందులు కలిగిస్తూ బావుల దగ్గర కరెంట్ వైర్లు, స్టాటర్స్, మోటార్స్ వంటివి దొంగ్లిస్తున్నారని, ఇటీవల వనపర్తి కర్ణాకర్ అనే రైతు చేను దగ్గర ఉన్న రోటివేటర్ సుమారు లక్ష రూపాయల విలువ గలది దొంగలు ఎత్తుకెళ్లారని.అలాగే నిర్మానుష ప్రాంతం కావున మద్యం సేవించి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని, ఈ క్రమంలో అటుగా వెళ్లే బాటసారులకు అసౌకర్యం కలిగిస్తున్నారని, కొటలో కూడా యువకులు అర్ధరాత్రుళ్ళు అడ్డాలు వేసి మద్యం సేవించి గొడవలకు దిగుతున్నారని, గంజాయి, సిగరెట్లు, మద్యం సేవించడం వలన ఘర్షణలు పడి ప్రాణాలను కోల్పోతున్నారని కావున తప్పకుండ పోలీస్ పీకేటింగ్, పెట్రోలింగ్ ఏర్పాటు చేసి అలాంటి వారిపైన చర్యలు తీసుకొవాలని, అలాగే పోలీస్ ఆఫిసర్స్ గ్రామంలో లిక్కర్ షాపులు, కిరణం, పాన్ షాప్ యాజమాన్యం, యూత్ మరియు అఖిల పక్ష నాయకులు, గ్రామ పెద్దలందరికి ఒకసారి కౌన్సిలింగ్ ఇవ్వాలని కోరడం జరిగింది. అనంతరం షఐ రమేష్ మాట్లాడుతూ తప్పకుండ పోలీస్ పెట్రోలింగ్, కౌన్సిలింగ్ ఏర్పాటు చేస్తామని డ్రగ్స్, గంజాయి పైన ప్రత్యేక బృందలు వేసి నిందితుల్ని పట్టుకొని తగు చర్యలు తీసుకుంటామని, నిత్యం పోలీస్ పెట్రోలింగ్ చేస్తామని, దొంగతనలను కూడా అరికడతామని అందుకు గ్రామ పెద్దలు, అఖిల పక్ష నాయకులు సహకరించాలని అందరం కలిసి వీరిపై తగిన చర్యలు తీసుకుందామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్, అఖిల పక్ష నాయకులు సంగరబోయిన విజయ్, కందిమల్ల మహేష్, బేడిద వీరన్న, బోయిని దూడయ్య, సంగరబోయిన చందర్, బిల్ల కిషోర్,ఆరసం రాంబాబు, వనపర్తి కర్ణాకర్,చింతం రమేష్,బేర వేణు, బేర నరేందర్, ఇట్నేని, ప్రతాప్ ఇతరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో ఘనంగా అబుల్ కలాం ఆజాద్ 137 వ జయంతి వేడుకలు



గద్వాల నవంబర్ 11 (వుదయం ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జిల్లా కలెక్టర్ ఆవరణలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137 వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు స్వాతంత్ర్య సమరయోధుడిగా కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు ఎప్పటికీ మరువలేమ ని జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే అన్నారు జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహించుకుంటున్న ఎమ్మెల్యే మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ నవంబర్ 11, 1888 ఫిబ్రవరి 22, 1958 విద్యారంగానికి ఆయన చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా 2008లో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రస్తుతం విద్యా మంత్రిత్వ శాఖ ఆయన పుట్టినరోజు అయిన నవంబర్ 11ని జాతీయ విద్యా దినోత్సవంగా ప్రకటించింది.భారత స్వాతంత్ర్య సమరయోధుడు స్వతంత్ర భారతదేశపు మొదటి విద్యాశాఖ మంత్రి ఆయన 1947 నుండి 1958 వరకు సుదీర్ఘంగా దాదాపు 11 సంవత్సరాలు విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు.మౌలానా అరబిక్ ఇంగ్లీష్, ఉర్దూ హిందీ, పర్షియన్, బెంగాలీ తదితర అనేక భాషల్లో ప్రావీణ్యత పొందారన్నారు. హిందూ, ముస్లిం ఐక్యత ఆధారంగా ఆల్ బలగ్ అనే పత్రికను ప్రారంభించి భారత జాతీయ వాదిగా పేరుగాంచారన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని పదేళ్లపాటు జైలు శిక్ష అనుభవించారని పేర్కొన్నారు. ఆజాద్ ఖిలాఫత్ ఉద్యమం ద్వారా ముస్లిం కమ్యూనిటీలో బ్రిటిష్ వ్యతిరేక భావాలు పెంచి అన్ని వర్గాల ప్రజలు స్వాతంత్రోద్యమంలో పాల్గొనేలా కీలకపాత్ర పోషించారన్నారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా 11 ఏళ్ల పాటు పనిచేసిన మౌలానాకు మరణాంతరం 1992లో భారతరత్న పురస్కారం లభించిందన్నారు. విద్య లేకుండా దేశము అభివృద్ధి చెందదని, విద్య స్వాతంత్రానికి రెండో రూపముగా పేర్కొన్న మౌలానా భారత విద్యావ్యవస్థకు బలమైన పునాదివేసిన మహానుభావుడని కొనియాడారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, మాజీ ఎంపీపీ విజయ్ , మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, మాజీ సర్పంచ్ రఘువర్ధన్ రెడ్డి, నాయకులు మొయినుద్దీన్, ళ మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు ముస్లిం మైనారిటీ సంఘాల నేతలు, అధికారులు , నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోపాటు క్రీడలు కూడా ముఖ్యమే జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

లక్షెట్టిపేట, నవంబర్ 11(వుదయం ప్రతినిధి): విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల మైదానంలో నిర్వహించిన తెలంగాణ వెనుకబడిన తరగతుల రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ జిల్లాస్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి భాగ్యవతి కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతో పాటు క్రీడా రంగంలో రాణిస్తూ సామాజిక దృక్పథం కలిగి ఉండాలని తెలిపారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని, స్నేహభావం పెంపొందుతుందని, నాయకత్వ లక్షణాలు అలవడతాయని తెలిపారు. క్రీడలతో చదువులో ఏకాగ్రత పెరుగుతుందని, ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వం నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మధ్యాహ్నం భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. 2025–26 మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించడంతో విద్యార్థులు పోటీలలో పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారని అభినందించారు. ఈ పోటీలలో జిల్లాలోని గుడిపేట బాలుర జట్టు మొదటి బహుమతి, నిర్మల్ జిల్లా బాలుర జట్టు ద్వితీయ బహుమతి గెలుపొందారని తెలిపారు. విద్యార్థులు చదువులో సైతం ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, ప్రిన్సిపాల్ సిహెచ్ మంగ, స్కూల్ కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయురాలు యశోదర, ఉపాధ్యాయులు, సిబ్బం,ది విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచి కరమైన భోజనం అందించాలి-

## విద్యార్థులతో కలసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్



మక్తల్ నవంబర్ 11( వుదయం ప్రతినిధి)విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. మంగళవారం ఆమె మక్తల్ పట్టణం లోని మహాత్మా జ్యోతిబా పూలె పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదే సమయంలో పాఠశాలలో నిర్వహిస్తున్న మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ జయంతి (జాతీయ విద్యా దినోత్సవం) వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు అజాద్ జయంతి గురించి స్పీచ్ లు ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి సిలబస్ ఇప్పటివరకు ఎంత వరకు పూర్తి అయిందని విద్యార్థులను ద్వారా తెలుసుకున్నారు. ఏ సబ్జెక్ట్ చదవడానికి కష్టం అవుతుందని ప్రశ్నించారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధిస్తామని విద్యార్థులు తెలపగా అందులో 20 మంది విద్యార్థులు 550 పై మార్కులకు పైగా సాధిస్తామన్నారు. తర్వాత భోజన సదుపాయల పై కలెక్టర్ ఆరా తీశారు. రోజూ ఉదయం ఎన్ని గంటలకు లేస్తారని లేచాక ఏమి చేస్తారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. స్లిప్ టెస్టులు పెడుతున్నారా? లేదా ? నాన్ వెజ్ తింటున్నారా లేదా అని, మెస్ కమిటీ ఉందా ? ఆ కమిటీ సభ్యులు ముందుగా భోజనం రుచి చూస్తున్నారా అని విద్యార్థులతో ఆరా తీశారు. వసతి గృహంలో ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజన నాణ్యత, రుచిని తెలుసుకునేందుకు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మక్తల్ తహసిల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీవో, రెవెన్యూ అధికారులు, వసతి గృహ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా హత్య కేసును ఛేదించిన పోలీసులు



గద్వాల నవంబర్ 11 (వుదయం ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రములోని జిల్లా సూపరిండెంట్ అఫ్ పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ షేర్అల్లీ వీధిలో ఈనెల 2వ తారీకున పట్టపగలే మహిలను హత్య చేసి పారిపోయిన వ్యక్తిని గద్వాల జిల్లాలో ఉన్నటువంటి ఎస్ ఐ లు హత్య కేసును చాకచక్యంగా ఛేజించారని చెప్పడం జరిగింది. హత్యచేయబడిన మహిళ గురించి వివరణ చెబుతూ ఆమె పేరు లక్ష్మీ అని ఆమె గృహిణిగా ఉంటూ ఇంట్లోనే వడ్డీ వ్యాపారం చేస్తుంటుందని ఈ విషయములో ధరూర్ మండలం గార్లపాడు గ్రామానికి చెందిన రామిరెడ్డి ఎప్పుడూ ఆమెతో వడ్డీకి డబ్బులు తీసుకునే వాడని అదే విషయమై ఆమెను మూడు లక్షలు కావాలని ఆమెను అడగగా ఆమె ప్రస్తుతం డబ్బులు లేవని నిరాకరించిందని, ఆమెతో ఎలాగైనా డబ్బులు కావాలని వాధన చేసి ఆమెను హత్య చేసి ఆమె మేడలో ఉన్న బంగారు పుస్తెలచైనును దొంగిలించి పారిపోయాడని పేర్కొన్నారు. ఇలా చేయడానికి ముఖ్య ఉద్దేశ్యము రామిరెడ్డి బెట్టింగ్ గేమ్స్కు బాగా అలవాటు కావడంతో అక్రమంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో మహిళా వడ్డీ వ్యాపారి మేడలో ఉన్న బంగారు పుస్తెల చైనును, దొంగిలించి పారిపోయాడని, ఆ చైనును హైదరాబాద్ శంషాబాద్లో ఉన్నటు వంటి తన స్నేహితుని బంగారు శాపులో బంగారు పుస్తెలచైన్ను నాలుగు లక్షల అరవైవేల రూపాయలకు విక్రయించి తీసుకెళ్లి కొద్ది డబ్బులు అప్పు తీర్చి మిగతా డబ్బులతో బెట్టింగ్ ఆడాలనే ఉద్యేశ్యముతో పెట్టుకున్నాడని చివరికి పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితున్ని గుర్తించి అతని దగ్గర ఉన్నటువంటి మిగిలిన డబ్బులు రెండు లక్షల ముప్పై మూడు వేల వందల నగదును ఐ ఫోన్ను స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలిస్తున్నట్లు ఎస్పీ శ్రీనివాసరావు చెప్పడం జరిగింది . ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన ఎస్సై లు సిఐ డిఎస్పీ మరియు సిబ్బందిలకు రివార్డులు అందజేసి అభినందించడం జరిగింది.

# భారత సంతతి రిపబ్లికన్ నేతకు క్షమాభిక్ష ప్రసాదించిన ట్రంప్



అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, భారత సంతతికి చెందిన రిపబ్లికన్ పార్టీ కార్యకర్త సీబీ చంద్ర యాదవ్‌కు ముందస్తు క్షమాభిక్ష ప్రసాదించారు. 2020 అధ్యక్ష ఎన్నికల ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు కీలక రాజకీయ నేతలతో పాటు యాదవ్‌కు కూడా ఈ క్షమాభిక్ష వర్తిస్తుంది.సోమవారం ప్రకటించిన ఈ క్షమాభిక్షలు కేవలం ఫెడరల్ స్థాయి నేరాలకు మాత్రమే పరిమితం. దీనివల్ల భవిష్యత్తులో ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ఆయనపై ఎలాంటి అభియోగాలు మోపలేరు. అయితే, అమెరికా న్యాయవ్యవస్థలో ఫెడరల్, రాష్ట్రస్థాయి విచారణలు వేర్వేరుగా ఉంటాయి. అందుకే జార్జియాలో ఆయనపై నమోదైన రాష్ట్రస్థాయి కేసులకు ఈ క్షమాభిక్ష వర్తించదు. ఈ కేసులో ఆయనపై విచారణ కొనసాగే అవకాశం ఉంది.ఈ క్షమాభిక్షలపై ట్రంప్ అధికార ప్రతినిధి కరోలిన్ లెవిట్ మాట్లాడుతూ ఈ గొప్ప అమెరికన్లను బైడెన్ ప్రభుత్వం వేధించింది. ప్రజాస్వామ్యానికి మూలస్తంభమైన ఎన్నికలను సవాలు చేసినందుకు వారిని నరకయాతనకు గురిచేసింది అని వ్యాఖ్యానించారు. తన ఉత్తర్వుల్లో ట్రంప్ కూడా,2020 ఎన్నికల తర్వాత అమెరికా ప్రజలపై జరిగిన ఘోరమైన జాతీయ అన్యాయానికి ఈ క్షమాభిక్ష ముగింపు పలుకుతుంది. ఇది దేశంలో సయోధ్య ప్రక్రియను కొనసాగిస్తుంది" అని పేర్కొన్నారు.2020 ఎన్నికల కేసులో జార్జియా రాష్ట్రంలో జో బైడెన్ విజయాన్ని తారుమారు చేసేందుకు తగినన్ని ఓట్లను గుర్తించాలని ట్రంప్ అక్కడి అధికారులను కోరినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో అధ్యక్షుడిని ఎన్నుకునే ఎలక్టోరల్ కాలేజీలో పాల్గొనేందుకు నకిలీ ఎలక్టర్ల జాబితాను యాదవ్, మరి కొందరు సమర్పించారని అభియోగాలు నమోదయ్యాయి.ట్రంప్ క్షమాభిక్ష పొందిన వారిలో న్యూయార్క్ మాజీ మేయర్ రూడీ గిలియాని, సిడ్నీ పావెల్, జాన్ ఈస్ట్‌మన్, ట్రంప్ మాజీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ మార్క్ మెడోస్ వంటి ప్రముఖులు కూడా ఉన్నారు. అయితే, ఈ క్షమాభిక్ష ట్రంప్‌కు వర్తించదు.

# తుపాను నేపథ్యంలో అతలాకుతలం అవుతున్న ఫిలిప్పీన్స్

ద్వీప దేశం ఫిలిప్పీన్స్‌ను మరో పెను తుపాను అతలాకుతలం చేస్తోంది. ఇటీవలే 'కల్మేగి' తుపాను సృష్టించిన విధ్వంసం నుంచి కోలుకోక ముందే, 'ఫుంగ్-వాంగ్' (ఉవాన్) అనే సూపర్ టైఫూన్ దేశంపై విరుచుకుపడింది. అరోరా ప్రావిన్స్‌లోని దినాలుంగన్ పట్టణం వద్ద ఇది తీరం దాటింది. ఆ సమయంలో గంటకు 185 కిలోమీటర్ల స్థిరమైన వేగంతో గాలులు వీచాయని, వాటి తీవ్రత గరి ష్ఠంగా గంటకు 230 కిలోమీటర్ల వరకు చేరిందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇటీవలి కాలంలో ఫిలిప్పీన్స్‌ను తాకిన అత్యంత శక్తిమంతమైన తుపాను ఇదేనని నిపుణులు చెబుతున్నారు. ఫుంగ్-వాంగ్ దాదాపు 1800 కిలోమీటర్ల వెడల్పున విస్తరించి ఉండటంతో దేశంలోని మూడింట రెండొంతుల భూభాగాన్ని ప్రభావితం చేయవచ్చని అంచనా వేస్తున్నారు. కాగా, అక్టోబర్ 7న సంభవించిన 'కల్మేగి' తుపాను కారణంగా ఇప్పటికే 224మంది ప్రాణాలు కోల్పోయిన విష యం తెలిసిందే. ఈ నేపథ్యంలో మరో భారీ విపత్తు ముంచుకురావడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఫుంగ్-వాంగ్ ప్రభావంతో ఇప్పటికే ఇద్దరు మరణించారు. కాటాండువాన్స్ ప్రావిన్స్‌లో ఆకస్మిక వరదల్లో చిక్కుకుని ఒకరు మరణించగా, సమర్ ప్రావిన్స్‌లో ఓమహిళపై శిథిలాలుపడటంతో ఆమెప్రాణాలు కోల్పోయారు.

# అన్ని విద్యాసంస్థల్లో వందేమాతరం తప్పనిసరి



లక్నో : ఉత్తరప్రదేశ్‌లో అన్ని విద్యాసంస్థల్లో వందేమాతరం గేయాలాపనను తప్పనిసరి చేస్తున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సోమవారం ప్రకటించారు. గోరఖ్‌పూర్‌లో 'ఏక్తా యాత్ర' పేరుతో నిర్వహించిన సామూహిక వందేమాతరం గేయాలాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఈ మేరకు ప్రకటన చేశారు. విద్యాసంస్థల్లో జాతీయ గీతాలాపన చేయడం వల్ల విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే దానిపై గౌరవం, దేశభక్తి ఏర్పడుతాయని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్ల మంది భారతీయుల్లో స్ఫూర్తి నింపిన 'వందేమాతరం' గేయానికి నవంబర్ 7తో 150 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఏడాది పొడవునా స్మారకోత్సవాలు జరపాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వందేమాతరం గేయాలాపన నిర్వహించడం జరిగిందని ఆయన అన్నారు. కాగా ఈ గేయాన్ని 1875 నవంబర్ 7న బకించంద్ర ఛటర్జీ రాశారు.

# సర్ కోసం ఉరుకులు పరుగులు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియ వలస కార్మికులను ఇబ్బంది పెడుతోంది. ఓటర్ల జాబితాలో పేరు ఉండేలా చూసుకునేందుకు వారంతా స్వరాష్ట్రానికి ఉరుకులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన పలువురు కార్మికులు ఉపాధి కోసం కేరళ, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాలకు వలస పోయారు. వారంతా ఇప్పుడు హడావిడిగా బెంగాల్ చేరుకుంటు న్నారు. సర్ ప్రక్రియలో పాల్గొనకపోతే ఓటు హక్కు ఎక్కడ పోతుందోనన్న భయం వారిని వెంటా డుతోంది. ఓటు హక్కును కాపాడుకు నేందుకు అవసరమైన పత్రాలను కూడా వారు సమకూర్చుకోవాల్సి వస్తోంది. పత్రాలను ఆన్‌లైన్‌లో పూర్తి చేసే అవకాశం ఉన్నప్పటికీ వాటి ని ఎలా పొందాలో, ఎలా నింపాలో చాలా మందికి తెలియడం లేదు. పశ్చిమ బెంగాల్ సహా 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో సర్ ప్రక్రియ చేపట్టబోతున్నట్లు గత నెల 27న కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. వచ్చే నెల 4వ తేదీ వరకూ ఎన్యూమరేషన్ పత్రాలను సమర్పించవచ్చు. ఆ తర్వాత డిసెంబర్ 9న ముసాయిదా ఓటర్ల జాబితాలను ప్రచురిస్తారు. వచ్చే సంవత్సరం జనవరి 8 వ తేదీ వరకూ క్లెయిములు, అభ్యంతరాలు స్వీకరించి ఫిబ్రవరి 7న తుది జాబితాను ప్రచురిస్తారు. సొంత రాష్ట్రానికి వెళ్లి ఈ ప్రక్రియలో పాల్గొనే కార్మికులు తమ వేతనాలను కోల్పోయే ప్రమాదం ఉంది. కొందరు వలస కార్మికుల వద్ద బెంగాల్ వెళ్లేందుకు తగిన డబ్బు కూడా లేదు. గత ఎనభై సంవత్సరాలుగా కొల్‌కతాలో ఓటర్లుగా ఉన్నామని, ఇప్పుడు తమ పేర్లను తొలగిస్తారేమోనని భయంగా ఉన్నదని ముంబయిలో ఉంటున్న ఓ వ్యక్తి చెప్పారు.

## సిద్ధూకు టైమ్ ఇవ్వని కాంగ్రెస్ అధిష్ఠానం.. కర్ణాటక సీఎం మార్పు తథ్యమా?

న్యూఢిల్లీ: కర్ణాటకలో అధికార మార్పిడిపై ఊహాగానాలు మరోసారి జోరందుకున్నాయి. ఈ నెలలోనే కర్ణాటక ముఖ్యమంత్రి మార్పు ఉండొచ్చన్న ప్రచారం జరుగుతోంది. సీఎం సిద్ధరామయ్య , డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌లు తరుచూ ఢిల్లీకి వెళ్లొస్తుండటంతో ఊహాగానాలు మరింత బలపడ్డాయి.ఈ క్రమంలోనే సిద్ధరామయ్య కలిసేందుకు కాంగ్రెస్ పెద్దలు అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని తెలుస్తోంది. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు ప్రచురించింది. నవంబరు నెలాఖరులో కర్ణాటక రాజకీయాల్లో పెను మార్పులు చోటుచేసుకుంటాయని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. దీంతో కన్నడ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య హస్తినకు వెళ్లి.. ఒక పుస్తక విడుదల కార్యక్రమంలో పాల్గొనున్నారు. పనిలో పనిగా కాంగ్రెస్ అధిష్ఠానంతో భేటీ అయ్యేందుకు సిద్ధూ అపాయింట్‌మెంట్ కోరగా.. పెద్దలు నిరాకరించినట్టు సమాచారం. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తికావొస్తోన్న వేళ ఈ పరిణామం చోటుచేసుకున్నట్టు ప్రచారం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాంగ్రెస్ పెద్దలు సమయం ఇవ్వడానికి నిరాకరించినా.. సిద్ధరామయ్య మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తికాలం కొనసాగుతుందనే విశ్వాసం వ్యక్తంచేశారు. కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. "మరో రెండున్నరేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉంటుంది. ఆ తర్వాత జరిగే ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కే మళ్లీ ప్రజలు ఓటు వేస్తారనే నమ్మకం నాకు ఉంది" అని అన్నారు.

## గొంతు కోసినా సరే అంటూ..
# మమత సంచలన వ్యాఖ్యలు

కోల్‌కతా: బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై (ఎస్ఐఆర్) నిర్వహించడంపై తీవ్ర దుమారం చెలరేగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా రెండో దశ నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల నిర్ణయం తీసుకుంది.దేశంలోని 12 రాష్ట్రాల్లో ఈ ఎస్ఐఆర్ రెండో దశను నిర్వహిస్తామని చెప్పింది. అందులో పశ్చిమ బెంగాల్ కూడా ఉంది. అయితే బెంగాల్ ఈ ప్రక్రియను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వంపై బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు.



ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నందుకు తన గొంత కోసినా ఫర్వాలేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియపై సీఎం మమతా బెనర్జీ మరోసారి విరుచుకుప డ్డారు. ఎస్ఐఆర్ పేరుతో బీజేపీ ప్రజలను వేధిస్తోందని ఆరోపణలు గుప్పించారు. ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ ప్రక్రియను ఎందుకింత హడావుడిగా నిర్వహిస్తున్నారో తనకు అర్థం కావడం లేదన్నారు. దీన్ని వెంటనే నిలిపేయాలని మమత డిమాండ్ చేశారు. పెద్దనోట్ల రద్దు నోట్‌బందీ లాగానే.. ఎస్ఐఆర్ కూడా ఓట్‌బందీ అని ఎద్దేవా చేశారు. దేశంలో సూపర్ ఎమర్జెన్సీకి ఇది మరో రూపం అని ఘాటుగా విమర్శించారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నందుకు బీజేపీ వాళ్లు తనను జైలుకు పంపినా.. తన గొంతు కోసినా సరేనని సీఎం మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజల ఓటు హక్కు మాత్రం హరించొద్దని అన్నారు. అంతేకాకుండా జీఎస్టీ కూడా బీజేపీ చేసిన అతిపెద్ద తప్పు అని.. దాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీఎస్టీ పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోందన్నారు. ఇటీవల కూడా కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి హెచ్చరికలు జారీ చేశారు మమతా బెనర్జీ. ఈ మేరకు నవంబర్ 4న కోలకతాలో జరిగిన నిరసనలకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నాయకత్వం వహించారు. కోల్‌కతా వీధుల్లో నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్న మమత.. బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కై చేస్తున్న నిశ్శబ్ద రిగ్గింగ్‌గా ఎస్ఐఆర్‌ను అభివర్ణించారు.

## యూఎస్ షట్‌డౌన్‌కు తెర..

అమెరికా చరిత్రలోనే అత్యంత సుదీర్ఘమైన 40 రోజుల ప్రభుత్వ కార్యకలాపాల నిలుపుదలకు ముగింపు పలికే దిశగా యూఎస్ సెనేట్‌లో కీలక ఒప్పందం కుదిరింది. ఉభయపక్షాలకు చెందిన సెనేటర్ల బృందం.. ప్రభుత్వాన్ని జనవరి 30వ తేదీ వరకు నిధులు సమకూర్చేందుకు వీలు కల్పించే ఒక ఒప్పందాన్ని చేసుకుంది. ఈ ఒప్పందాన్ని ఆమోదించడానికి సెనేట్ ఆదివారం రాత్రి ఓటింగ్‌కు సిద్ధమైంది. సెనేటర్లు ఆంగస్ కింగ్, జీన్ షాహీన్, మాగీ హస్సన్ సహా పలువురు రిపబ్లికన్ సెనేటర్లు సంయుక్తంగా ఈ డీల్‌ను రూపొందించారు. ఈ ప్రణాళికను ఆమోదించడానికి సెనేట్ డెమోక్రాటిక్ కాకస్‌లో తగినంత మందికి మించి సభ్యులు సిద్ధంగా ఉన్నారని ఈ విషయం తెలిసిన వర్గాలు తెలిపాయి. ఈ ఒప్పందం ద్వారా.. హౌస్ ఆమోదించిన స్టాప్‌గ్యాప్ ఫండింగ్ (తాత్కాలిక నిధుల) చర్య ముందుకు సాగనుంది. ఈ డీల్ ప్రకారం కీలకు విభాగాలకు సంబంధించిన అంటే వ్యవసాయ శాఖ, ఆహార, ఔషధ పరిపాలన, వెటరన్స్ వ్యవహారాల శాఖ, సైనిక నిర్మాణ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటన్నింటికీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మిగిలిన కాలానికి పూర్తిగా నిధులు పొందుతాయి. అయితే మిగిలిన అన్ని ఫెడరల్ ఏజెన్సీలకు జనవరి 30వ తేదీ వరకు నిధులు సమకూరుతాయి. ఈ డీల్‌లో భాగంగా షట్‌డౌన్ సమయంలో ఫర్లో (నిర్బంధ సెలవు)పై వెళ్లిన ఫెడరల్ ఉద్యోగులు అందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవడం, వారికి కార్యకలాపాలు పునఃప్రారంభమైన వెంటనే వెనుకటి జీతం చెల్లించాల్సి ఉంటుంది. రాజకీయంగా ఈ ఒప్పందంలో డెమోక్రాట్‌లకు అనుకూలమైన ఒక కీలక హామీ దక్కింది. సెనేట్ మెజారిటీ నాయకుడు జాన్ థూన్.. ఈ ఏడాది చివరిలో గడువు ముగియనున్న అఫర్డబుల్ కేర్ యాక్ట్ సబ్సిడీలను పొడిగించడానికి వీలుగా డిసెంబర్‌లో డెమోక్రాట్‌లకు అనుకూలంగా ఒక బిల్లుపై ఓటు వేస్తామని హామీ ఇచ్చారు.

## మాలిలో ఉగ్రవాదుల బలైన టిక్‌టాక్



యువతిమాలిలో జిహాదీ ఉగ్రవాదులు దారుణానికి పాల్పడ్డారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ టిక్‌టాక్‌లో వీడియోలు పోస్ట్ చేస్తూ పాపులర్ అయిన ఒక యువతిని కిడ్నాప్ చేసి, బహిరంగంగా కాల్చి చంపారు. సైన్యానికి గూఢచారిగా పనిచేస్తోందన్న ఆరోపణలతో ఈ దారుణానికి ఒడిగట్టారు. ఈ ఘటనతో దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తమవుతోంది.ఉత్తర మాలిలోని టింబక్టు ప్రాంతంలోని టోంకా నగరానికి చెందిన మరియమ్ సిస్సే అనే యువతి టిక్‌టాక్‌లో స్థానిక విశేషాలపై వీడియోలు చేస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆమెకు సుమారు 90 వేల మంది ఫాలోవర్లు ఉన్నారు. అయితే, గురువారం కొందరు జిహాదీలు ఆమెను అపహరించారు. మాలి సైన్యంకు తమ కదలికల గురించి ఆమె సమాచారం చేరవేస్తోందని ఆరోపించారు.ఆ మరుసటి రోజే అంటే శుక్రవారం మరియమ్‌ను ఒక మోటార్‌బైక్‌పై టోంకా నగరంలోని ఇండిపెండెన్స్ స్క్వేర్‌కు తీసుకొచ్చారు. అక్కడి జనసమూహం చూస్తుండగానే ఆమెను తుపాకీతో కాల్చి చంపారు. "వారు నా సోదరిని చంపేటప్పుడు నేను ఆ గుంపులోనే ఉన్నాను" అని ఆమె సోదరుడు ఆవేదనతో వెల్లడించారు.

పెంచిన టారిఫ్ సొమ్ముని ప్రజలకి పంచుతానంటున్న డొనాల్డ్ ట్రంప్అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ప్రభుత్వం టారిఫ్ పన్నుల ద్వారా వసూలు చేస్తున్న ఆదాయం నుంచి త్వరలోనే ప్రతి అమెరికన్‌కు కనీసం 2వేల డాలర్ల చొప్పున పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే, అధిక ఆదాయం ఉన్న సంపన్నులకు ఈ పథకం వర్తించదని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ఈ ప్రకటన చేశారు. తన టారిఫ్ విధానాన్ని విమర్శిస్తున్న వారిపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తన హయాంలోనే అమెరికా ప్రపంచంలోనే అత్యంత సంపన్న, గౌరవనీయమైన దేశంగా మారిందని, ద్రవ్యోల్బణం దాదాపు లేదని, స్టాక్ మార్కెట్ రికార్డు స్థాయిలో ఉందని ఆయన చెప్పుకొచ్చారు.టారిఫ్ పన్నుల ద్వారా దేశానికి ట్రిలియన్ల కొద్దీ డాలర్ల ఆదాయం వస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ నిధులతో 37 ట్రిలియన్ డాలర్ల జాతీయ రుణాన్ని తగ్గించడం ప్రారంభిస్తామని తెలిపారు. అదే సమయంలో ప్రజలకు డివిడెండ్ రూపంలో ఈ నగదును అందిస్తామని వివరించారు.

# అంతా గందరగోళమే !




చెన్నై : ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కోసం ఎన్యూమరేషన్ ఫారమ్‌లో భారత ఎన్నికల సంఘం కోరిన వివరాలు బాగా చదువుకున్న ఓటర్లను కూడా గందరగోళానికి గురి చేస్తాయని డిఎంకె అధ్యక్షుడు, తమిళ నాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్ ఫారమ్‌ను అందుకున్న స్టాలిన్ మాట్లాడుతూ, బంధువుల వివరాలు అంటే తల్లిదండ్రులు, సోదరులు, అక్కా చెల్లెళ్లు, భర్త లేదా భార్య వంటి వారి వివరాలా? కాదా? అనేది స్పష్టంగా లేదని అన్నారు. ఈ ప్రశ్నపై స్పష్టత ఏమైనా వుందా? బంధువులు అన్న కాలమ్‌లో వారు ఓటర్ గుర్తింపు కార్డు నెంబర్ అడుగుతున్నారు. మూడో కాలమ్‌లో మళ్లీ వారు బంధువుల పేర్లు అడుగుతున్నారు. ఎవరి పేరు రాయాలి? బంధువు పేరా లేదా దరఖాస్తుదారు పేరా? ఒక చిన్నపాటి తప్పు జరిగినా ఎన్నికల కమిషన్ ఓటర్ల పేర్లు తొలగించే ప్రమాదం వుంది." అని స్టాలిన్ వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఆ వివరాలు కోరడమనేది పెద్ద గందరగోళంలా వుందని ఆయన వ్యాఖ్యానించారు. అయితే ఎస్ఐఆర్ ప్రక్రియ పట్ల భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. ఎందుకంటే ఈ బాధ్యత మొత్తం నిర్వహిస్తున్నది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులేనని చెప్పారు. "అయితే ప్రభుత్వ ఉద్యోగి ఎన్నికల కమిషన్ నియంత్రణలో వుంటారు, ఆ ఉద్యోగి రాష్ట్ర ప్రభుత్వానికి జవాబుదారీ కాదు. ఇది వాస్తవం." అని చెప్పారు. తానేమీ ఎస్ఐఆర్‌ను వ్యతిరేకించడం లేదని మరోసారి స్టాలిన్ స్పష్టం చేశారు. ఎందుకంటే స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలు జరగాలంటే నిజాయితీ, పారదర్శకతతో కూడిన ఓటర్ల జాబితా చాలా అవసరమని వ్యాఖ్యానించారు. ఆ జాబితాను హడావిడిగా నిర్వహించరాదన్నది తమ వైఖరి అని స్పష్టం చేశారు. కేంద్రంలోని పాలక బిజెపి ఎన్నికల కమిషన్ సాయంతో ఓటర్ల జాబితాలో ఎలా తీవ్రమైన మోసాలకు పాల్పడిందో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విశదీకరించారని చెప్పారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇరువురూ ఎస్ఐఆర్‌కు వ్యతిరేకమేనని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రారంభమైనప్పటి నుండి ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి డిఎంకె సభ్యులు తీసుకువచ్చారన్నారు. బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓ) ఇళ్ళకు వెళ్లడం లేదని, ఒకవేళ వెళ్లినా వారి వెంట తగినన్ని ఫారాలు తీసుకెళ్లడం లేదని చెప్పారు.

# ప్రాణాలను హరించేలా రోడ్లా..?




న్యూఢిల్లీ: హైవేలపై జరిగే ప్రమాదాల్లో ప్రాణాలు పోగొట్టుకుంటున్న వారిపై, ఆ ప్రమాదాలపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రహదారులు అమాయకుల ప్రాణాలను పొట్టనబెట్టుకోవడంపై వివరణ ఇవ్వాలని జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఎఐ)ను, కేంద్రాన్ని ఆదేశించింది. "కేవలం రెండు రోజుల్లో రెండు భయంకరమైన ప్రమాదాలు, దాదాపు 40మంది మరణించారు. వీరిలో పిల్లలే ఎక్కువమంది." అని జస్టిస్ జెకె మహేశ్వరి వ్యాఖ్యానించారు. బెంచ్‌లో జస్టిస్ విజయ్ బిష్ణోరు వున్నారు. రాజస్థాన్‌లోని ఫలోదిలో ఈ నెల 2న హైవే ప్రమాదంలో 15మంది మరణించారు. ఈ ప్రమాదాన్ని తనకు తానుగా కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఆ మరుసటి రోజునే హైదరాబాద్ %-% బీజాపూర్ హైవేపై లారీ, బస్సు ఢకొనెడంతో మూడు మాసాల పసిపాపతోసహా 19మంది మరణించారు. 163వ నెంబరు హైవేపై గల గుంటలో బస్సు పడకుండా తప్పించే క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ రెండు ప్రమాదాల వెనుక గల కారణాలను మీడియా వార్తలు స్పష్టంగానే ఇచ్చాయని జస్టిస్ మహేశ్వరి తెలిపారు. క్రమం తప్పకుండా టోల్ ఫీజులు చెల్లిస్తూనే వున్నా హైవేల పరిస్థితి అస్సలేమాత్రం బాగోలేదని తెలుస్తోందన్నారు. పైగా సేద తీరేందుకు నిర్దేశించిన ప్రాంతాలు కాదని స్పష్టంగా పేర్కొన్నా, హైవేల పొడవునా అక్రమంగా కాఫీ, టీలతోపాటూ తినే హొటళ్లు కూడా పెరిగిపోతున్నాయని కోర్టు వ్యాఖ్యానించింది. ఫలితంగా, రోడ్లపై తిరిగే వాహనాలు, హైవేల పక్కన నిలిపి వుంచిన ట్రక్కులు లేదా ఇతర వాహనాలను గుర్తించలేకపోతున్నాయని జస్టిస్ మహేశ్వరి పేర్కొన్నారు. ఆ రెండు హైవేల పరిస్థితిపై నివేదికను అందజేయాల్సిందిగా రహదారుల మంత్రిత్వ శాఖకు, ఎన్‌హెచ్ఎఐకి కోర్టు నోటీసులు జారీ చేసింది. ఆ రెండు హైవేల పొడవునా నోటిఫై చేయని ప్రాంతాలను ఆక్రమించి అక్రమంగా ఏర్పాటుచేసిన దాబాలు లేదా ఈటరీల సంఖ్య, వివరాలు అందజేయాల్సిందిగా ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, ఎన్‌హెచ్ఎఐని ఆదేశించింది. ఈ రెండు హైవేలు ప్రయాణిస్తున్న రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలకు కూడా నోటీసులు జారీ చేయాలని కోర్టు పేర్కొంది. అమికస్ క్యూరీగా నియమితులైన సీనియర్ న్యాయవాది నాద్‌కర్ణి మాట్లాడుతూ, ఈ సుమోటో కేసు పరిధిని దేశవ్యాప్త పరిధికి విస్తరించాలని కోరారు. మొదట ఈ కేసులో ఏం జరిగిందో ముందుగా మనం చూద్దామని జస్టిస్ మహేశ్వరి స్పందించారు.

# జమ్మూకాశ్మీర్‌లో 2,900 కేజీల ఐఇడి స్వాధీనం

శ్రీనగర్: జమ్మూకాశ్మీర్ పోలీసులు ఆది, సోమవారాల్లో వివిధ ప్రదేశాల్లో జరిపిన సోదాల్లో 2,900 కేజీల ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్ (ఐఇడి) తయారు చేసే మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వైద్యులు సహా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసిన వారికి ఉగ్రవాద సంస్థలు జైష్-ఎ-మొహమ్మద్ (జెఎం), అన్సార్ ఘజ్వత్-ఉల్-హింద్ (ఎజియుహెచ్)తో సంబంధాలు ఉన్నాయని పోలీసులు వెల్లడించారు. శ్రీనగర్, అనంతనాగ్, గందర్‌బాల్, షోపియన్‌ల్లో జమ్మూకాశ్మీర్ పోలీసులు సోదాలు జరపగా, హర్యానా పోలీసులతో కలిసి ఫరీదాబాద్, ఉత్తరప్రదేశ్ పోలీసులతో కలిసి సహరాన్‌పూర్‌లో సోదాలు జరిపారు. అరెస్టు చేసిన వైద్యులను పుల్వామాలోని కోయిల్‌కు చెందిన డాక్టర్ ముజమ్మిల్ అహ్మద్ గనై అలియాస్ ముసాయిబ్, కుల్గాంలోని వాన్‌పోరాకు చెందిన డాక్టర్ అదీల్‌గా గుర్తించారు.దౌజ్‌లోని విశ్వవిద్యాలయంలో ఫ్యాకల్టీ మెంబర్‌గా పనిచేస్తున్న ముజమ్మిల్ అహ్మద్‌ను ఫరీదాబాద్‌లో అరెస్టు చేశారు. ఇక్కడ అతని అద్దె నివాసంలో భారీ ఎత్తున పేలుడు పదార్థాలు, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. సోదాలు, దర్యాప్తు కొనసాగుతున్నాయని యుఎపిఎలోని వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదైందని జమ్మూకాశ్మీర్ పోలీసులు తెలిపారు. అక్టోబర్ 19న నౌగామ్‌లో వివిధ ప్రాంతాల్లో పోలీసులను, భద్రతా సిబ్బందిని బెదిరిస్తూ పోస్టర్లు అతికించిన నేపథ్యంలో ఈ సోదాలను పోలీసులు ప్రారంభించారు.

# దేశంలో ట్రాఫిక్ సిగల్స్ లేని తొలి నగరం ఇదే



రాజస్థాన్: దేశంలోని కీలక నగరాలైన ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, కోల్‌కతా సహా చాలా నగరాలు.. ట్రాఫిక్ ఊబిలో చిక్కుకున్నాయి. ఇలాంటి నగరాల్లో నివసించే ప్రజలు నిత్యం.. గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుని నరకయాతన అనుభవిస్తున్నారు. ఇక దేశంలోని పలు నగరాల్లో నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యలను నెటిజన్లు.. సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. తీవ్ర అసంతృప్తిని వెళ్లగక్కుతున్నారు. మరోవైపు.. దేశంలోనే బెంగళూరు పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. కిలోమీటర్ దూరం ప్రయాణించాలన్నా.. గంటల తరబడి ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకోవాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఈ క్రమంలోనే.. రాజస్థాన్‌లోని కోట నగరం.. భారతదేశంలోని పట్టణ ట్రాఫిక్ నిర్వహణకు ఒక కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. దేశంలోనే ట్రాఫిక్ లైట్లు లేని మొట్ట మొదటి నగరంగా కోట రికార్డుల్లోకి ఎక్కింది. కోచింగ్ సిటీ ఆఫ్ ఇండియాగా పేరు గాంచిన కోట నగరంలో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు.. రకరకాల పరీక్షల కోసం కోచింగ్ తీసుకుంటూ ఉంటారు. అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన స్టూడెంట్స్ కోటలో వివిధ కోచింగ్‌లు తీసుకోవడం వల్ల ఆ నగరానికి కోచింగ్ హబ్‌గా పేరు వచ్చింది. ఇక స్థానికులతోపాటు ఇతర రాష్ట్రాల వారు ఉన్నప్పటికీ.. కోట మాత్రం ఒక ప్రత్యేకతను సృష్టించింది. భారతదేశంలో మొట్టమొదటి ట్రాఫిక్ లైట్ ఫ్రీ సిటీగా అవతరించింది. కోట నగరంలో ఒక్కటంటే ఒక్కటి కూడా ట్రాఫిక్ సిగల్ లేకుండా నిరంతరాయంగా వాహనాలు పరుగులు తీస్తుండటం విశేషం. కోటలోని అర్బన్ ఇంప్రూవ్‌మెంట్ ట్రస్ట్ అమలు చేసిన స్మార్ట్ అర్బన్ డిజైన్ కారణంగానే ఈ ట్రాఫిక్ లేని నగరం సాధ్యమైందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. కోట నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించి.. పూర్తిగా ట్రాఫిక్ లైట్లను నగరంలో నుంచి తొలగించడానికి.. అక్కడ కీలకమైన మౌలిక సదుపాయాలను అర్బన్ ఇంప్రూవ్‌మెంట్ ట్రస్ట్ అభివృద్ధి చేసింది. కోట నగరంలోని కీలక జంక్షన్ల వద్ద రెండు డజన్లకు పైగా ఫ్లైఓవర్లను నిర్మించింది. ఇవే కాకుండా అండర్‌పాస్‌లను ఏర్పాటు చేశారు. దీనివల్ల ట్రాఫిక్ ఎక్కడా ఆగిపోకుండా.. వాహనాలు నిరంతరం కదిలేలా చూసుకున్నారు.

## అలా చేయకపోతే కంపెనీలు మూసేయండి

న్యూఢిల్లీ: ఇటీవల మధ్యప్రదేశ్‌లో కోల్డ్‌రిఫ్ దగ్గు సిరప్ కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. చింద్వారా జిల్లాలో ఈ దగ్గు మందు తీసుకోవడం వల్ల 24 మంది చిన్నారులు.. కిడ్నీ ఫెయిలై చనిపోయినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటనతో దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు వ్యక్తమయ్యాయి. దీంతో తెలంగాణ, తమిళనాడుతో పాటు పలు రాష్ట్రాలు ఈ దగ్గుమందును నిషేధించాయి. ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమైంది. ఈ మేరకు సోమవారం (నవంబర్ 10) ఔషధ తయారీదారులకు అల్టిమేటంఇచ్చింది. జనవరి ఒకటి నాటికి ఔషధతయారీలో అంతర్జాతీయ ప్రమాణాలు పాటించాలని.. లేకపోతే కంపెనీలు మూసుకోవాల్సిందేనని వార్నింగ్ ఇచ్చింది. 2026 జనవరి 1వ తేదీ లోపు గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాక్టిసెస్ ను అన్ని డ్రగ్ తయారీ సంస్థలు పాటించాలని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఆదేశించింది. ఈ తేదీపైఎలాంటి పొడిగింపులుఉండవని స్పష్టం చేసింది. ఇప్పటికే ప్రమాణాలను అప్‌గ్రేడ్ చేసుకోవడానికి చాలా సమయం ఇచ్చామని, సహాయం చేశామని కేంద్రం స్పష్టం చేసింది. కాగా, వార్షిక టర్నోవర్ రూ.250 కోట్ల కన్నా తక్కువగా ఉన్న 1,470 ఫార్మా తయారీ యూనిట్లను కేంద్రం లక్ష్యంగా చేసుకున్నట్లు అర్థమవుతోంది. దేశంలో ప్రస్తుతం 5,308 డ్రగ్ తయారీ ప్లాంట్లు ఉన్నాయి. అందులో 3,838 ఎమ్ఎస్ఎమ్ఈలు (మైక్రో, స్మాల్, మీడియం కంపెనీలు) ఇప్పటికే అప్‌గ్రేడ్ చేసిన ప్రమాణాలను పాటిస్తున్నాయి.



# బిజినెస్



# మళ్లీ భారీగా పెరిగిన బంగారం ధర



భారతీయులకు అత్యంత ఇష్టమైన వాటిల్లో బంగారం ముందు వరుసలో ఉంటుంది. ముఖ్యంగా మహిళలు బంగారు ఆభరణాలు ధరించేందుకు ఇష్టపడుతుంటారు. పండగలు, పెళ్లిళ్లు, శుభకార్యాల వంటి సమయాల్లో బంగారం తప్పనిసరిగా ఉండాల్సిందే. ఒంటిపై బంగారం ఎంత ఎక్కువ ఉంటే అంత గౌరవంగా భావిస్తారు. అందుకే వీలైనంత మేరకు బంగారం కొంటునే ఉంటారు. ప్రపంచంలోనే అత్యధికంగా బంగారం దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉందంటేనే మన భారతీయులు ఏ స్థాయిలో బంగారం వినియోగిస్తారో అర్థమవుతుంది. అయితే, ఈ 2025లో బంగారం ధరలు ఊహించని స్థాయిలో కొండెక్కాయి. అయితే దీపావళి తర్వాత కాస్త దిగివచ్చి ఊరట కల్పించాయి. ఇక తగ్గుతాయిలే అనుకునే సరికి మళ్లీ పెరుగుతున్నాయి. ఇవాళ బంగారం రేట్లు భారీగా పెరిగాయి. ఇవాళ తులం బంగారం రేటు ఏకంగా రూ.1650 మేర పెరిగింది. మరి ప్రముఖ జువెలర్స్‌లో 22 క్యారెట్ల ఆభరణాల గోల్డ్ రేటు ఎంతుందో తెలుసుకుందాం. తనిష్క్ జువెలరీలో ఈరోజు 22 క్యారెట్ల ఆభరణాల బంగారం రేటు 1 గ్రాముకు రూ.110 మేర పెరిగి రూ. 11,335 వద్దకు చేరుకుంది. ఇక 10 గ్రాములు (తులానికి) రూ. 1100 మేర పెరిగి రూ.1,13,350 వద్దకు చేరుకుంది. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో ఈ రోజు 22 క్యారెట్ల నగల తయారీ బంగారం రేటు గ్రాముకు రూ. 11,350 వద్ద ఉంది. ఇక తులానికి (10 గ్రాములకు) రూ. 1,13,500 వద్దకు చేరుకుంది. ప్రముఖ జువెలరీ సంస్థ జొయాలుక్కాస్‌లో ఈరోజు 22 క్యారెట్ల ఆభరణాల గోల్డ్ రేటు 1 గ్రాముకు రూ. 11,350 వద్ద ఉంది. అదే తులానికి అయితే రూ. 1,13,500 వద్ద ట్రేడవుతోంది. లలితా జువెలరీలో ఈరోజు 22 క్యారెట్ల బంగారం రేటు 1 గ్రాముకు రూ. 11,350 వద్ద ఉంది. అలాగే తులం (10 గ్రాములకు) రూ. 1,13,500 పలుకుతోంది. కల్యాణ్ జువెలర్స్‌లో 22 క్యారెట్ల ఆభరణాల గోల్డ్ ధర గ్రాముకు రూ. 11,350 గా ఉండగా 10 గ్రాములకు రూ.1,13,500 వద్దకు చేరుకుంది. బంగారం ధరలు తగ్గినట్లే తగ్గి మళ్లీ పెరుగుతున్నాయి.

## రూ.2.17 లక్షల కోట్లకు చేరిన క్రెడిట్ కార్డుల ఖర్చు



దేశవ్యాప్తంగా క్రెడిట్ కార్డు వాడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. తద్వారా ఖర్చు కూడా అంతే స్థాయిలో ఉందని కేర్ రేటింగ్స్ తెలిపింది. ఈ ఏడాది సెప్టెంబర్ నెలకు సంబంధించి క్రెడిట్ కార్డులపై డేటా విడుదల చేసిన కంపెనీ, సమీక్షించిన నెలలో క్రెడిట్ ఖర్చులు 23 శాతం వృద్ధితో రూ. 2.17 లక్షల కోట్లకు చేరాయని పేర్కొంది. అంతకుముందు ఆగష్టు నెలతో పోల్చినా కూడా ఇవి 13 శాతం పెరిగాయి. 2020 తర్వాత ఈ స్థాయిలో క్రెడిట్ కార్డు ఖర్చులు నమోదవడం ఇదే తొలిసారి. దీనికి ప్రధానంగా పండుగ సీజన్ గిరాకీకి ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ సంస్కరణలు దోహదపడ్డాయి. ఇదే సమయంలో బ్యాంకులు, ఆన్‌లైన్ స్టోర్లు భారీగా ఆఫర్లు కూడా ప్రకటించాయి. ఫలితంగా చాలామంది తమ క్రెడిట్ కార్డు కొనుగోళ్లను పెంచారు. మరోవైపు సెప్టెంబర్ నెలలో క్రెడిట్ కార్డుల సంఖ్య కూడా అధికంగానే పెరిగిందని కేర్ రేటింగ్స్ తెలిపింది. గతేడాది ఇదే నెలలో 10.6 కోట్ల కార్డులు ఉండగా, ఈ ఏడాదిలో అది 11.3 కోట్లకు చేరింది. ప్రస్తుతం క్రెడిట్ కార్డుల సగటు ఖర్చు సెప్టెంబర్ నెలలో దాదాపు రూ. 20,011కు చేరిందని నివేదిక పేర్కొంది.

## ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లకు కీలక ప్రతిపాదనలు

దేశంలోని ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ప్యాకేజ్డ్ వస్తువులు, ఉత్పత్తులకు సంబంధించి



కంట్రీ ఆఫ్ ఆరిజన్(వస్తువు తయారైన దేశం ఆధారంగా సెర్చ్ చేసే ఫిల్టర్‌ను తప్పనిసరి చేయాలని ప్రతిపాదించింది. దీనివల్ల డిజిటల్ మార్కెట్‌ప్లేస్‌లో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది. వినియోగదారులు ఆన్‌లైన్‌లో షాపింగ్ చేస్తున్నప్పుడు ఉత్పత్తుల మూలాన్ని సులభంగా గుర్తించేలా చేయడం ద్వారా సమాచారంతో కూడిన కొనుగోలు చేయడానికి వీలవుతుందని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం చెబుతోంది.

# తగ్గిన నిరుద్యోగ రేటు



దేశంలో నిరుద్యోగ రేటు తగ్గింది. ప్రభుత్వం విడుదల చేసిన డేటా ప్రకారం, ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికానికి సంబంధించి నిరుద్యోగ రేటు 5.2 శాతానికి దిగొచ్చింది. అంతకుముందు జూన్ త్రైమాసికంలో ఇది 5.4 శాతంగా నమోదైంది. వ్యవసాయ సీజన్‌లో గ్రామీణ ఉపాధి గణనీయంగా పెరగడంతో పాటు మహిళల భాగస్వామ్యం పెరగడమే ఇందుకు కారణమని ప్రభుత్వ గణాంకాలు తెలిపాయి. 15 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసు ఉన్నవారిలో నిరుద్యోగం గ్రామీణ ప్రాంతంలో 4.8 శాతం నుంచి 4.4 శాతానికి తగ్గింది. పట్టణ ప్రాంతాల్లో ఇది 6.8 శాతం నుంచి 6.9 శాతానికి చేరింది. 15 ఏళ్ల కంటే ఎక్కువ వయసున్న ప్రజల్లో కార్మిక శక్తి భాగస్వామ్య రేటు (ఎల్ఎఫ్‌పీఆర్) 55. శాతం నుంచి 55.1 శాతానికి స్వల్పంగా పెరిగింది. మహిళా భాగస్వామ్య రేటు 33.4 శాతం నుంచి 33.7 శాతానికి చేరుకుంది. అయితే, పట్టణ ప్రాంతాల్లో మహిళల నిరుద్యోగిత రేటు గత త్రైమాసికంలో 8.9 శాతం ఉండగా, సెప్టెంబర్ త్రైమాసికంలో 9 శాతానికి పెరిగింది. పురుషుల్లో ఇది 6.1 శాతం నుంచి 6.2 శాతానికి పెరిగిందని గణాంకాలు పేర్కొన్నాయి.

# యుఎస్ నుంచి పెరుగుతోన్న చమురు దిగుమతులు

అమెరికా నుంచి భారత చమురు దిగుమతులు భారీగా పెరుగుతున్నాయి. ఇటీవల యుఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆంక్షలకు బెదిరి ప్రధాని నరేంద్ర మోడీ ఆ దేశం నుంచి భారీగా చమురు కొనుగోళ్లను పెంచేలా చమురు కంపెనీలపై ఒత్తిడి తెచ్చారని ఇటీవలి వరుస గణాంకాలు స్పష్టం చేస్తోన్నాయి. చౌకగా లభించే రష్యా చమురును తగ్గించుకోవడంతో పాటు యుఎస్ నుంచి దిగుమతులను పెంచేశారు. ప్రభుత్వ రంగ రిఫైనరీ సంస్థలైన హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పిసిఎల్), మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్ (ఎంఆర్‌పిఎల్) సంస్థలు ఇటీవల 50 లక్షల బ్యారెళ్ల చమురును అమెరికా, మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి కొనుగోలు చేశాయని రాయిటర్స్ వెల్లడించింది. ఎంఆర్‌పిఎల్ జనవరి 1-7కాలానికి గాను 10లక్షల బ్యారెళ్ల చమురుకు ఆర్డర్ చేస్తోంది. యుఎస్ వెస్ట్ టెక్సాస్, అబుదాబీ నుంచి 20 లక్షల బ్యారెళ్ల చమురును హెచ్‌పిసిఎల్ కొనుగోలు చేసింది. ఈ ఏడాది అక్టోబర్ అమెరికా నుంచి భారత్‌కు గత ఐదేళ్లలో ఎప్పుడూ లేని గరిష్ట స్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. భారతదేశం మొత్తం ముడి చమురు దిగుమతుల్లో యుఎస్ వాటా 12 శాతానికి పెరిగింది. అంతక్రితం సెప్టెంబర్‌లో ఇది 4.5 శాతంగా ఉంది. డేటా అనలిటిక్స్ సంస్థ కెప్లర్ నివేదిక ప్రకారం.. అక్టోబర్‌లో యుఎస్ నుంచి భారత్ రోజుకు సగటున 5,68,000 బ్యారెల్స్ ముడి చమురును దిగుమతి జరిగింది. 2021 మార్చి తర్వాత ఈ స్థాయిలో దిగుమతులు జరగడం ఇదే మొదటిసారి. సెప్టెంబరులో దిగుమతులైన 2,07,000 బ్యారెల్స్‌తో పోలిస్తే ఇది రెట్టింపు కంటే ఎక్కువ కావడం ఆందోళనకరం. ఇది ట్రంప్ ఆంక్షలకు భారత్ తలొగ్గిందనడానికి నిదర్శనమని నిపుణులు భావిస్తున్నారు.



# 12 దేశాల్లోని ప్రవాసులూ పేటీఎం యాప్ వినియోగించుకోవచ్చు

వినియోగదార్ల చెల్లింపుల అనుభూతిని మరింతగా పెంచేందుకు, సరికొత్తగా పేటీఎం యాప్‌ను తీర్చిదిద్దినట్లు మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ తెలిపింది. రోజు వారీ లావాదేవీల ప్రక్రియను సులభతరం చేసేందుకు, కృత్రిమ మేధ ప్రత్యేకతలను ఈ యాప్‌నకు జోడించింది. నవీకరించిన యాప్‌లో 158 పైగా కొత్త సదుపాయాలను చేర్చింది. 12 దేశాల్లోని ప్రవాస భారతీయులు సహా దేశవ్యాప్తంగా వినియోగదార్లు తమ చెల్లింపులను వేగంగా చేసేందుకు ఇవి దోహదం చేస్తాయని వివరించింది. ప్రతి చెల్లింపుపై వినియోగదారులకు డిజిటల్ గోల్డ్ రూపేణా రివార్డులు ఇచ్చే సదుపాయాన్ని పేటీఎం తీసుకొచ్చింది. కృత్రిమ మేధను అనుసంధానం చేయడం వల్ల, వినియోగదార్ల చెల్లింపుల ధోరణులను అర్థం చేసుకోవడంతో పాటు, విడివిడిగా బ్యాంకు ఖాతాలను నమోదు చేసుకునే అవసరం లేకుండా.. యూపీఐ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లోని మొత్తం నిల్వ వివరాలను వేగంగా వినియోగదార్లు తెలుసుకోవచ్చని పేటీఎం వివరించింది. మ్యాజిక్ పేస్ట్ సదుపాయం ద్వారా వాట్సప్ మెసేజీలు, ఫేవరేట్ కాంటాక్టుల జాబితా నుంచి బ్యాంకు ఖాతా, ఐఎఫ్ఎస్‌సి వివరాలను ఆటోమేటిక్‌గా నింపుకోవచ్చని.. తద్వారా వేగంగా చెల్లింపులు చేసే వీలుంటుందని తెలిపింది.



# జియోకు బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్!



ప్రభుత్వ టెలికం కంపెనీ బిఎస్ఎన్ఎల్‌తో రిలయన్స్ జియో కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా జియో కవరేజీ లేని మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను వినియోగించుకోనుంది. ఈ ఇంట్రా సర్కిల్ రోమింగ్‌ను ప్రస్తుతానికి మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వినియోగదారులకు జియో అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం జియో ఇంట్రా సర్కిల్ రోమింగ్ (ఐసిఆర్) రీఛార్జి ప్లాన్లను ప్రవేశపెట్టింది. 28 రోజుల గడువుతో వస్తున్న ఈ ప్లాన్ల ధరలను రూ.396, రూ.196గా నిర్ణయించింది. ఈ ప్లాన్లు జియో సిగ్నల్ పూర్తిగా లేని సందర్భంలో బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను ఎంచుకున్నప్పుడు మాత్రమే పని చేస్తాయి. ఇతర ప్రాంతాల్లోనూ ఈ ఐసిఆర్ సేవలను అందించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. సిగ్నల్ సమస్యకు పరిష్కారంగా ఈ ఏడాది జనవరిలో ట్రాయ్ ఇంట్రా సర్కిల్ రోమింగ్ సదుపాయాన్ని ప్రకటించింది. దీంతో జియో, ఎయిర్‌టెల్, బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు తమ సొంత సెల్యులార్ టవర్ల పరిధిలో లేనప్పటికీ ఇతర టెలికం నెట్‌వర్క్‌లను వినియోగించుకోవడానికి వీలుంటుంది.

# ప్రపంచకప్ విజేత రిచాకు చారిత్రక గౌరవం



టీమిండియాకు ఛాంపియన్ టైటిల్ అందించిన బ్యాటర్ రిచా ఘోష్‌కు చారిత్రక గౌరవం దక్కింది. సిలిగురిలో రిచా పేరుతో క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. సోమవారం కోల్‌కతాలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ వేడుకకు భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ, ఝులన్ గోస్వామి హాజరైనట్లు టీఎంసీ వర్గాలు తెలిపాయి. రిచా ఘోష్ పశ్చిమ బెంగాల్ నుంచి ప్రపంచకప్ గెలిచిన తొలి మహిళా క్రికెటర్‌గా చరిత్ర సృష్టించింది. ఆమె అసాధారణ ప్రదర్శనకు గుర్తింపుగా సీఎం మమతతో పాటు "బంగ భూషణ్" పురస్కారాన్ని అందించారు. రిచాకు రాష్ట్ర పోలీసు శాఖలో డీఎస్పీ ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేశారు. పశ్చిమ బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ రిచాకు గోల్డెన్ బ్యాట్, గోల్డెన్ బాల్ బహుకరించింది. ఫైనల్లో దక్షిణాఫ్రికాపై విజయంలో కీలక పాత్ర పోషించింది. 24 బంతుల్లో 34 పరుగులు సాధించింది. సెమీఫైనల్లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికాపై 94 పరుగులతో రాణించింది. మొత్తం 8 ఇన్నింగ్స్‌లో 235 పరుగులు సాధించింది. టోర్నీ టాప్ స్కోరర్‌గా నిలిచింది. నవంబర్ 2న ఫైనల్లో దక్షిణాఫ్రికాను ఓడించి ప్రపంచకప్‌ను తొలిసారిగా రాష్ట్ర ప్రభుత్వం రూ.34 లక్షల నగదు బహుమతిని కూడా ఆమెకు అందించే నిర్ణయాన్ని ప్రకటించింది. అదనంగా, హౌరాను కూడా కేటాయించారు. కూడా ఆమెను ఘనంగా సత్కరించింది. విలువైన బంగారు గొలుసును బహూకరించారు. భారత్ విజయంలో రిచా కీలక పాత్ర పోషించింది. పరుగులు చేసి జట్టును భారీ స్కోర్ దిశగా నడిపించింది. లియాపై 16 బంతుల్లో 26 పరుగులు, లీగ్ దశలో గులతో రిచా ప్రదర్శన అంతా టోర్నీ ఆసాంతం ఇన్నింగ్స్‌ల్లో ఆమె 133.52 స్ట్రయిక్‌రేట్‌తో సిక్స్ హిట్టర్‌గా (12 సిక్సర్లు) నిలిచింది. కాను 52 పరుగుల తేడాతో ఓడించి కైవసం చేసుకుంది.


# కాంబినేషన్‌కు తగ్గట్టే తుది జట్టు..



ఎట్టకేలకు మౌనం వీడిన గంభీర్.ఇటీవల భారత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ టీమిండియా తుది జట్టు విషయంలో విమర్శలు ఎదుర్కొంటున్నాడు. అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, సంజూ శాంసన్ వంటి ప్లేయర్లను బెంచ్‌కే పరిమితం చేయడంపై క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతుంది. దీనిపై గంభీర్ ఎట్టకేలకు స్పందించాడు. కాంబినేషన్‌కు తగ్గట్టే తుది జట్టును ఎంపిక చేస్తామని తెలిపాడు. గంభీర్ మాట్లాడిన వీడియోను బీసీసీఐ సోమవారం సోషల్ మీడియాలో పంచుకుంది. 'తుది జట్టు ఎంపిక అనేది కోచ్‌గా నాకు కష్టతరమైన పని. కొన్నిసార్లు బెంచ్‌పై నాణ్యమైన ప్లేయర్లు ఉన్నారు, వారు ప్లేయింగ్ 11కు వారు అర్హులని నాకు తెలుసు. కానీ, ఆ మ్యాచ్‌కు ఆ రోజు సరైన కాంబినేషన్‌ను ఎంపిక చేయాల్సి ఉంటుంది. అందుకే కొన్నిసార్లు ఆలోచనతో తుది జట్టును సెలెక్ట్ చేస్తాం.'అని గంభీర్ తెలిపాడు. అలాంటి సమయాల్లో ప్లేయర్లకు అర్థమయ్యేలా చెప్పడం చాలా ముఖ్యమని చెప్పాడు. 'కమ్యూనికేషన్ నిజాయితీగా, స్పష్టంగా ఉండాలి. నువ్వు ఆడటం లేదని ఏ ప్లేయర్‌కైనా చెప్పడం కొన్నిసార్లు చాలా కష్టం. కోచ్‌కు, ప్లేయర్ మధ్య అది కష్టతరమైన సంభాషణ అవుతుంది. ప్లేయింగ్ 11కు అర్హత ఉన్నప్పటికీ ఆడకపోతే ప్లేయర్ కచ్చితంగా నిరాశకు గురవుతారు. అప్పుడు నిజాయితీతో ముక్కుసూటిగా చెప్పడం తప్ప ఏం చేయలేం.'అని తెలిపాడు.

## పంత్, జురెల్‌కు చోటుపై కోచ్, కెప్టెన్ మల్లగుల్లాలు

దక్షిణాఫ్రికాతో జరిగే టెస్ట్ సిరీస్‌కు రిషబ్ పంత్, ధృవ్ జురెల్‌లకు చోటు కల్పించడంపై టీమిండియా కోచ్, కెప్టెన్ మల్లగుల్లాలు పడుతున్నట్లు సమాచారం. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగే తొలి టెస్ట్‌లో వీరిద్దరు ఆడతారా, వీరిద్దరు చోటు కల్పిస్తే ఎవరెవరిని బెంచ్‌కి పరిమితం చేయాలనే అంశంపై పలు సుదీర్ఘ చర్చలు జరుపుతున్నట్లు మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డాడు. వీరిద్దరూ కీపర్ కోటాలో పోటీపడుతుండడమే ఇందుకు ప్రధాన కారణం. దక్షిణాఫ్రికా-ఎతో జరిగిన రెండో అనధికారిక టెస్ట్‌లో వీరిద్దరూ ఫామ్‌లోకి సెంచరీ, అర్ధసెంచరీలతో రాణించారు. వికెట్ కీపర్, వైస్ కెప్టెన్ హోదాలో రిషబ్ పంత్‌కు తొలిటెస్ట్‌లో చోటు దక్కవచ్చని, కానీ దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో రాణించిన జురెల్‌కు తప్పక చోటు దక్కాలని తాను కోరుకుంటున్నానని ఆకాశ్ చోప్రా తెలిపాడు. వీరికి చోటు కల్పించాలని టీమిండియా మేనేజ్‌మెంట్ భావిస్తే.. సాయి సుదర్శన్, నితీశ్‌కుమార్ రెడ్డిలలో ఒకరు బెంచ్‌కే పరిమితం కావాల్సి ఉంటుంది. 3వ స్థానంలో బ్యాటింగ్‌కు సాయి సుదర్శన్ సరిపోతాడని, లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు మాత్రమే నితీశ్ కుమార్ రెడ్డి ఉపయోగపడుతాడని, ఈ క్రమంలో తాను సాయి సుదర్శన్ తొలి టెస్ట్ ఆడాలని కోరుకుంటున్నానని తెలిపాడు. భారత్ వేదికగా జరిగే టీ20 ప్రపంచకప్‌కు ఆటగాళ్లు సన్నద్ధం కావాలని టీమిండియా హెడ్ కోచ్ గౌతం గంభీర్ ఆటగాళ్లకు దిశా నిర్దేశం చేశాడు. ఇంకా మూడు నెలల సమయం మాత్రమే మిగిలిఉందని, ఆటగాళ్లు ప్రపంచకప్ కోసం పూర్తి గా సన్నద్ధం కావాలని, ఫిట్‌నెస్ కాపాడుకోవాలని ఆటగాళ్లకు పలు కీలక సూచనలు చేశాడు. కోచ్ గౌతం గంభీర్ మాట్లాడిన వీడియోను బిసిసిఐ సోమవారం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. 'మా డ్రెస్సింగ్ రూం పారదర్శకంగా ఉంది. దాన్ని కొనసాగించాలనే లక్ష్యంతో ముందుకుసాగుతున్నాం. టీ20 వరల్డ్ కప్ కోసం పూర్తిగా సన్నద్ధం కావాల్సి ఉంది. మన చేతిలో ఇంకా మూడు నెలల సమయం మాత్రమే ఉంది.



రాజస్థాన్ జట్టులో కీలక మార్పులు జరగను న్నాయి. ఇండియన్ ప్రీమియర్ లీగ్

## రాజస్థాన్‌కు కొత్త కెప్టెన్ వచ్చేశాడు?

2026 టోర్నమెంట్ నేపథ్యంలో రాజస్థాన్ జట్టుకు సంబంధించిన సంజు శాంసన్ చెన్నై జట్టులోకి వెళ్లనున్నాడు.ఈ మేరకు ఇప్పటికే ట్రేడింగ్ ప్రక్రియ కూడా పూర్తయింది. సంజు స్థానంలో రవీంద్ర జడేజాతో పాటు సామ్ కరణ్ చెన్నై జట్టు నుంచి రాజస్థాన్‌లోకి వస్తారు. దీంతో రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ ఎవరు అవుతారనే అంశంపై సందిగ్ధత నెలకొంది. కచ్చితంగా యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్ ఇద్దరిలో ఒకరికి కెప్టెన్సీ వస్తుందని నేషనల్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. రియాన్ పరాగ్ లాంటి చెత్త ప్లేయర్‌కు కెప్టెన్సీ ఇవ్వకూడదని, గత సీజన్ లో అతడు కెప్టెన్ గా వ్యవహరించినా, ప్రయోజనం లేదని ఫ్యాన్స్ మండిపడుతున్నారు. దీంతో యశస్వి జైస్వాల్ అలాగే ధ్రువ్ జురెల్ ఇద్దరిలో ఒకరికి కెప్టెన్సీ వస్తుందని అంటున్నారు. ఇక అటు చెన్నైలో సంజు ఫ్యూచర్ కెప్టెన్‌గా ఎదిగే ఛాన్స్ ఉంది. కాలం కలిసి వస్తే, వచ్చే సంవత్సరమే కెప్టెన్ అవుతాడని అంటున్నారు.



# టీ20 ప్రపంచకప్‌పై అభిషేక్ శర్మ ఆసక్తికర కామెంట్స్



టీమిండియా యంగ్ బ్యాటర్ అభిషేక్ శర్మ లోని మాటను చెప్పాడు. అంతర్జాతీయ అడుగుపెట్టినప్పటి నుంచి రికార్డులు కొడుతున్న.. అభిషేక్.. టీ20 ప్రపంచకప్ కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పాడు. కల టోర్నీ అని అతడు వ్యాఖ్యానించాడు. లోనే 10 వేల అడుగులు ఎలా వేయాలో ఎక్స్‌ర్‌సైజ్ చేయడమే వారికి ఈజీ. తగ్గించే వర్కౌట్. 'వచ్చే ఏడాది జరిగే 2026 నా కెరీర్‌లోనే అతిపెద్ద టోర్నీ అది నా కల టోర్నమెంట్. నేను ఉన్నాను. ఒకవేళ నాకు ఈ మెగా వస్తే రప్ఫాడిస్తా,' అని తన మనసులో అభిషేక్ శర్మ. కాగా ఐపీఎల్‌లో మెరుపులు మెరిపించిన అభిషేక్.. ఏకంగా జాతీయ జట్టులో స్థానం సంపాదించుకున్నాడు. ఆ తర్వాత మళ్లీ వెనక్కి టీ20 జట్టులో అతడు సుస్థిర స్థానం క్రీజులోకి వస్తున్న ఈ డాషింగ్ బ్యాటర్ టీ20 క్రికెట్‌కు అర్థాన్ని చెబుతున్నాడు. ఇటీవల ముగిసిన ఆసియాకప్ చెలరేగిపోయాడు. ఇక ఆస్ట్రేలియాతో సిరీస్‌లోనూ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు సొంతం చేసుకున్నాడు. అంతేకాకుండా ప్రస్తుతం ఐసీసీ ర్యాంకింగ్‌లో అభిషేక్ శర్మ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. టీమిండియా నంబర్ వన్ టీ20 బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. ప్రస్తుతం అతడి ఖాతాలో 925 రేటింగ్ పాయింట్స్ ఉన్నాయి. ఇక వచ్చే ఏడాది భారత్, శ్రీలంక సంయుక్త వేదికల్లో టీ20 ప్రపంచకప్ 2026 జరగనుంది. ఇందులో మొత్తంగా 20 జట్లు పాల్గొంటాయి. ఫిబ్రవరి, మార్చి నెలలో ఈ టోర్నీ జరగనుంది. ఇటీవల భారత్.. ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది.


# చక్కని ఆరోగ్యం

## ఆరోగ్యంగా ఉండాలంటే.. అసలు ఏ టైంలో భోజనం చేయాలి?



రోజువారీ ఉరుకుల పరుగుల జీవనంలో సరైన భోజన సమయాలను పాటించడం చాలా ముఖ్యం. ఉదయం 7-8 గంటల మధ్య అల్పాహారం, మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల మధ్య భోజనం, సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య రాత్రి భోజనం శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. శక్తిని అందిస్తుంది. అలసట, ఒత్తిడిని తగ్గిస్తుంది. సమయానికి తినడం శారీరక, మానసిక అభివృద్ధిని మెరుగుపరుస్తుంది.. నేటి బిజీ జీవితంలో, భోజన సమయాలను పాటించడం నిజంగా పెద్ద సవాలు. కానీ మనలో చాలా మందికి అల్పాహారం, భోజనం, రాత్రి భోజనం చేయడానికి సరైన సమయం ఏమిటో తెలియదు. సరైన సమయంలో తినడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. ఇది అలసట, ఒత్తిడి, చిరాకు వంటి సమస్యల నుండి బయటపడటానికి కూడా మీకు సహాయపడుతుంది. సరైన భోజన సమయాలను పాటించడం పాఠశాలకు వెళ్లే పిల్లల నుంచి పెద్దలు నేర్చుకోవాలి. ఎందుకంటే పిల్లలు సమయానికి తింటారు. అందుకే వారి శారీరక, మానసిక అభివృద్ధి బాగుంటుంది. అలాగే వారి శరీరం ఎల్లప్పుడూ శక్తిని నిలుపుకుంటుంది. అల్పాహారం.. రోజులో అతి ముఖ్యమైన భోజనం. అల్పాహారం ఎల్లప్పుడూ ఉదయం 7 నుంచి 8 గంటల మధ్య తీసుకోవాలి. ప్రతి ఉదయం నిద్రలేచిన 30 నిమిషాల లోపు తేలికైనది ఏదైనా తినాలి. సమయానికి అల్పాహారం తీసుకోవడం వల్ల మీ జీర్ణక్రియ మెరుగుపడుతుంది. కానీ ఉదయం 10 గంటల తర్వాత అల్పాహారం తినకుండా ఉండాలి. ఉదయం భోజనం శరీరానికి రోజంతా పనిచేయడానికి శక్తిని ఇస్తుంది. ఇక భోజనం చేయడానికి ఉత్తమ సమయం మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల మధ్య. ఈ సమయంలో మీరు భోజనం చేయాలి. అల్పాహారం, భోజనం మధ్య కనీసం 4 గంటల విరామం ఉండాలి. దీనివల్ల మొదటి భోజనం సరిగ్గా జీర్ణమవుతుంది. సాయంత్రం 4 గంటల తర్వాత ఏమీ తినకూడదు. రాత్రి భోజనం తేలికగా ఉండాలి. దీన్ని నిద్రవేళకు ముందు తీసుకోవాలి. సాధారణంగా సాయంత్రం 6 నుండి 8 గంటల మధ్య తినడం ఉత్తమం. పడుకునే ముందు 3 గంటల ముందు తినడం అవసరం.

## ఉదయం చల్లని నీటితో ముఖం కడిగితే ఏమవుతుంది?



మనందరికీ ఉదయం నిద్ర లేవగానే చల్లటి నీటితో ముఖం కడుక్కోవడం అలవాటు. ఇది కేవలం అలవాటు మాత్రమే కాదు, దీని వెనుక మన చర్మానికి, ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే అద్భుతమైన ప్రయోజనాలు దాగి ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. చర్మం బిగుతుగా: చల్లటి నీరు చర్మ రంధ్రాలను తాత్కాలికంగా బిగుతుగా చేస్తుంది. దీనివల్ల మురికి, నూనె రంధ్రాలలో పేరుకుపోకుండా నిరోధించడంలో సహాయపడుతుంది. ఫలితంగా చర్మం మరింత మృదువుగా కనిపిస్తుంది. తక్షణ శక్తి, ఉత్సాహం: ముఖంపై చల్లటి నీటి షాక్ తగలగానే, శరీరంలో రక్త ప్రసరణ పెరుగుతుంది.నరాలు ఉత్తేజితమవుతాయి. ఇది నిద్ర మత్తును త్వరగా తొలగించి.. తక్షణమే మేల్కొలపడానికి, రోజంతా ఉల్లాసంగా ఉండటానికి సహాయపడుతుంది. వాపును తగ్గిస్తుంది: చల్లని నీరు కళ్ల కింద వాపు, తేలికపాటి ఎరుపుదనాన్ని తగ్గించడానికి చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇది చర్మంలోని రక్త నాళాలను తాత్కాలికంగా సంకోచింపజేసి వాపును తక్షణమే తగ్గిస్తుంది. చర్మపు సహజ నూనెలు: వేడి నీరు చర్మం సహజ నూనెలను తొలగించి పొడిబారేలా చేస్తుంది. అయితే, చల్లటి నీరు ఆ నూనెలను సంరక్షిస్తుంది. ఇది చర్మం పొడిబారకుండా నిరోధించడానికి మరియు ఆరోగ్యంగా తేమగా ఉంచడానికి సహాయపడుతుంది. సహజమైన మెరుపు : చల్లటి నీటిని ముఖంపై ఉపయోగించినప్పుడు, రక్త ప్రసరణ తక్షణమే పెరుగుతుంది. ఈ మెరుగైన రక్త ప్రవాహం చర్మానికి సహజమైన గులాబీ మెరుపును ఇస్తుంది. రోజంతా తాజాగా, కాంతివంతంగా కనిపించడంలో సహాయపడుతుంది.

## ముల్లంగి తింటే రోగాలు మాయ


శీతాకాలం వచ్చేసింది. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా మన చుట్టూ ఉన్న అనేక విషయాలు మారుతాయి. ముఖ్యంగా శీతాకాలంలో మార్కెట్‌లో కొన్ని కూరగాయలు అందుబాటులోకి వస్తాయి. వాటిల్లో ముల్లంగి ఒకటి. చాలా మంది ముల్లంగిని సలాడ్‌లుగా తినడానికి ఇష్టపడతారు. దీని ఆకులను కూరల తయారీకి ఉపయోగిస్తారు. ఇది రుచికరంగా ఉండటమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. శీతాకాలం వచ్చేసింది. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా మన చుట్టూ ఉన్న అనేక విషయాలు మారుతాయి. ముఖ్యంగా శీతాకాలంలో మార్కెట్‌లో కొన్ని కూరగాయలు అందుబాటులోకి వస్తాయి. వాటిల్లో ముల్లంగి ఒకటి. చాలా మంది ముల్లంగిని సలాడ్‌లుగా తినడానికి ఇష్టపడతారు. దీని ఆకులను కూరల తయారీకి ఉపయోగిస్తారు. ఇది రుచికరంగా ఉండటమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. ముల్లంగిలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ముల్లంగిలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటిల్లో విటమిన్ సి, ఫోలేట్, పొటాషియం, మెగ్నీషియం, విటమిన్ బి6 వంటి పోషకాలు ఉంటాయి. వీటిల్లో ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, గ్లూకోసినోలేట్‌లు కూడా ఉంటాయి. అయితే రాత్రిపూట ముల్లంగిని తినకూడదు. ఎందుకంటే ముల్లంగి వెచ్చదనం, చల్లదనం రెండింటినీ కలిగి ఉంటుంది. అందుకే జలుబు ఉన్నవారు రాత్రిపూట ముల్లంగిని తినకూడదు. ఒక వ్యక్తి 2-3 నెలలు క్రమం తప్పకుండా ముల్లంగి తింటే వారు ఎప్పటికీ అనారోగ్యానికి గురికారు. ముల్లంగి తినడం వల్ల కాలేయం, మూత్రపిండాలు, పేగులు, ఊపిరితిత్తులు, గుండె, మొత్తం జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ముల్లంగి తినడం వల్ల బరువు కూడా నియంత్రణలో ఉంటుంది. గ్యాస్ సమస్యలు తగ్గుతాయి. ఇది వాత, పిత్త రుగ్మతలను సైతం నివారించడంలో సహాయపడుతుంది. ఇది అధిక రక్తపోటు, మధుమేహంతో సహా



వివిధ వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. ముల్లంగి ఒంట్లో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో భలేగా పనిచేస్తుంది. ముల్లంగి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అందువల్ల ఉదయం ఖాళీ కడుపుతో ముల్లంగి తినడం వల్ల జీర్ణవ్యవస్థ పరిపూర్ణ స్థితికి చేరుకుంటుంది. అయితే ఉదయాన్నే ఖాళీ కడుపుతో ముల్లంగి తినలేకపోతే దానిని రోజులో ఎప్పుడైనా ఉప్పుతో కలిపి మిల్లెట్ బ్రెడ్‌తో తినవచ్చు.

## ఈ ఆకు చేసే అద్భుతాలు..

తమలపాకు పూజలకే కాదు, మన ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, నోటి దుర్వాసన తగ్గిస్తుంది. చిగుళ్లను కాపాడుతుంది. ముఖ్యంగా ఇది రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడానికి, గుండె, కాలేయాన్ని రక్షించడానికి తోడ్పడుతుంది. తమలపాకు మన సంస్కృతిలో ముఖ్యమైనది. ఇది కేవలం పూజలకు, శుభకార్యాలకు మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. దీనిలో ఉన్న మంచి గుణాల కారణంగా దీనిని ఔషధంగా కూడా వాడుకోవచ్చు. తమలపాకు పాన్ ఆరోగ్యానికి హానికరం అయినప్పటికీ కేవలం తమలపాకు మాత్రమే అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటుంది. జర్నల్‌లో ప్రచురించబడిన అధ్యయనం ప్రకారం.. తమలపాకుల్లో అనేక రకాల బయోయాక్టివ్ సమ్మేళనాలు పుష్కలంగా ఉన్నాయని తెలిసింది. పాలీఫెనాల్స్, ఫ్లేవనాయిడ్లు, యూజినాల్, చావిబెటాల్, సినోల్ వంటి ముఖ్యమైన నూనెలు తమలపాకులో ఉంటాయి. తక్కువ మొత్తంలో ప్రోటీన్, ఫైబర్, విటమిన్ సి, కెరోటినాయిడ్లు కూడా రోగనిరోధక శక్తికి మద్దతు ఇస్తాయి. తమలపాకులలో ఉండే అధిక స్థాయి యాంటీఆక్సిడెంట్లు, ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. వాటి యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు వాపు, నొప్పి, కణజాల చికాకును తగ్గించడంలో సహాయపడతాయి. ఆర్థరైటిస్ వంటి పరిస్థితులకు కూడా ఇవి మద్దతునిస్తాయి. సాంప్రదాయకంగా తమలపాకులను నమలడం ద్వారా నోరు తాజాగా ఉండి, పరిశుభ్రత పెరుగుతుంది. ఆకుల్లోని యాంటీ బాక్టీరియల్ సమ్మేళనాలు దుర్వాసన, చిగుళ్ల వాపు మరియు దంత క్షయం కలిగించే హానికరమైన సూక్ష్మజీవుల పెరుగుదలను నిరోధిస్తాయి. భోజనం తర్వాత తమలపాకులను తీసుకోవడం వల్ల లాలాజల స్రావం ప్రేరేపించబడి, ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. ఇది ఉబ్బరం, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యల నుండి ఉపశమనం అందిస్తుంది. తమలపాకులోని సమ్మేళనాలు కడుపు పొరను రక్షించి, అల్సర్లు ఏర్పడకుండా నిరోధించవచ్చని అధ్యయనాలు సూచిస్తున్నాయి. తమలపాకులలోని సమ్మేళనాలు రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో, ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయని పరిశోధన సూచిస్తుంది. ఇది మధుమేహం, సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. తమలపాకులు ముఖ్యమైన అవయవాలకు మద్దతు ఇచ్చే సామర్థ్యాన్ని చూపించాయి. తమలపాకు శరీరాన్ని డీటాక్సిఫై చేసి, కాలేయాన్ని ఆక్సీకరణ నష్టం నుండి కాపాడతాయి. గుండె: కొలెస్ట్రాల్, లిపిడ్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడటం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుతాయి. మెదడు: యాంటీఆక్సిడెంట్ సమ్మేళనాలు మెదడు కణాలను రక్షించి, అభిజ్ఞా పనితీరుకు మద్దతు ఇస్తాయి. గాయాలు త్వరగా నయంతమలపాకులు బలమైన యాంటీమైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉంటాయి. సంక్రమణ ప్రమాదాన్ని తగ్గించడానికి , వేగంగా నయం కావడానికి సాంప్రదాయకంగా తమలపాకులను చూర్ణం చేసి గాయాలు, కాలిన గాయాలు, కీటకాల కాటుకు నేరుగా పూస్తారు.




## శొంఠితో ఇన్ని లాభాలా..?

మీరు కూడా చలికాలంలో వైరల్ ఇన్ఫెక్షన్లు, జలుబులను నివారించాలనుకుంటే మీ వంటగదిలో సులభంగా లభించే సోంఠిని ఉపయోగించవచ్చు. అల్లం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందో సోంఠి కూడా అంతే ఆరోగ్యకరమైనది. దీనిలో ఇనుము, కాల్షియం, మెగ్నీషియం, ఫైబర్, సోడియం, విటమిన్లు ఎ, సి, జింక్, ఫోలేట్, కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. పాలు, టీలో డ్రై జింజర్‌ను ఉపయోగించడం వల్ల రోగనిరోధక శక్తిని బలోపేతం చేయవచ్చు. శొంఠిలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ముఖ్యంగా సీజనల్ వ్యాధులను నివారించడంలో శొంఠి అద్భుతంగా పనిచేస్తుంది. జలుబు చేసినప్పుడు శొంఠి పొడిని నీళ్లలో కలిపి మరగబెట్టి తాగితే ఉపశమనం కలిగిస్తుంది. అలాగే మరుగుతున్న టీ లేదా కాఫీలో శొంఠి పొడి కలిపి తీసుకుంటే.. మేలు జరుగుతుంది. శొంఠిలో ఉండే రోగ నిరోధక శక్తి ఇమ్యూనిటీని పెంచుతుంది. ఫలితంగా వివిధ రకాల వ్యాధులకు చెక్ చెప్పవచ్చు అంటున్నారు నిపుణులు. శొంఠి మహిళలకు చాలా ప్రయోజనకరం. పీరియడ్స్ సమయంలో నొప్పులు, క్రాంప్స్ తగ్గించేందుకు శొంఠి అద్భుతంగా పనిచేస్తుంది. సొంఠి తినడం వల్ల శరీరం మెటబోలింజం వేగవంతమవుతుంది అంటున్నారు నిపుణులు. ఫలితంగా బరువు తగ్గేందుకు దోహదపడుతుంది. బరువు తగ్గించే ప్రక్రియలో సొంఠి అద్భుతంగా పనిచేస్తుంది. కీళ్ల నొప్పులకు కూడా శొంఠి సరైన పరిష్కారం అంటున్నారు.. సొంఠి తినడం వల్ల కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం పొందవచ్చు. శొంఠిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. అందుకే జలుబు, దగ్గు, గొంతులో గరగర సమస్యలుంటే అద్భుతంగా పనిచేస్తుంది. శొంఠి తినడం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమౌతుంది. అంతేకాకుండా కడుపులో గ్యాస్, బ్లోటింగ్ వంటి సమస్యలు దూరమవుతాయి. సొంఠి వాతాన్ని సమతుల్యం చేస్తుంది. గ్యాస్, కడుపు ఉబ్బరం సమస్య ఉంటే.. గోరువెచ్చని నీటిలో శొంఠి పొడి వేసుకుని తాగితే.. ఉపశమనం లభిస్తుంది. శొంఠితో ఇన్ని లాభాలా..? మీరు కూడా చలికాలంలో వైరల్ ఇన్ఫెక్షన్లు, జలుబులను నివారించాలనుకుంటే మీ వంటగదిలో సులభంగా లభించే సోంఠిని ఉపయోగించవచ్చు. అల్లం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందో సోంఠి కూడా అంతే ఆరోగ్యకరమైనది. దీనిలో ఇనుము, కాల్షియం, మెగ్నీషియం, ఫైబర్, సోడియం, విటమిన్లు ఎ, సి, జింక్, ఫోలేట్, కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. పాలు, టీలో డ్రై జింజర్‌ను ఉపయోగించడం వల్ల రోగనిరోధక శక్తిని బలోపేతం చేయవచ్చు. శొంఠిలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ముఖ్యంగా సీజనల్ వ్యాధులను నివారించడంలో శొంఠి అద్భుతంగా పనిచేస్తుంది.జలుబు చేసినప్పుడు శొంఠి పొడిని నీళ్లలో కలిపి మరగబెట్టి తాగితే ఉపశమనం కలిగిస్తుంది. అలాగే మరుగుతున్న టీ లేదా కాఫీలో శొంఠి పొడి కలిపి తీసుకుంటే.. మేలు జరుగుతుంది. శొంఠిలో ఉండే రోగ నిరోధక శక్తి ఇమ్యూనిటీని పెంచుతుంది. ఫలితంగా వివిధరకాల వ్యాధులకు చెక్ చెప్పవచ్చు అంటున్నారు నిపుణులు. శొంఠి మహిళలకు చాలా ప్రయోజనకరం.




## నిద్ర లేకుండా మనిషి ఎన్ని రోజులు ఉండగలడు?

నిద్ర అనేది మానవ శరీరానికి, మెదడుకు అత్యంత ప్రాథమిక అవసరం. ఒక రోజు సరిగా నిద్ర లేకపోయినా అనారోగ్యంగా, చిరాకుగా అనిపిస్తుంది. సరైన నిద్ర లేకపోతే మానసిక సమతుల్యత దెబ్బతింటుంది. అందుకే శరీరానికి, మనసుకు విశ్రాంతినిచ్చే నిద్ర చాలా అవసరం. అయితే ఒక వ్యక్తి నిరంతరం నిద్ర లేకుండా ఎంతకాలం మేల్కొని ఉండగలడు అనే ప్రశ్నపై చాలా అధ్యయనాలు జరిగాయి. ఒక వ్యక్తి నిద్ర ఏ కాగ్రత లేకుండా ఎంతకాలం జీవించగలడో ఏ పరిశోధన కూడా ఖచ్చితంగా నిర్ధారించలేకపోయింది. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్ ప్రకారం.. నిద్ర లేకుండా అత్యధిక కాలం మేల్కొని ఉన్న రికార్డు రాబర్ట్ మెక్‌డొనాల్డ్ పేరిట ఉండేది. అతడు 18 రోజులు, 21 గంటలు, 40 నిమిషాల పాటు నిద్ర పోలేదు. ఈ సుదీర్ఘ కాలం నిద్ర లేమి కారణంగా రాబర్ట్ మెక్‌డొనాల్డ్ ఆరోగ్యంపై అనేక ప్రతికూల ప్రభావాలు కనిపించాయి. దీని తీవ్రత కారణంగా గిన్నిస్ సంస్థ 1997లోనే ఈ వర్గాన్ని పూర్తిగా నిలిపివేసింది. నిద్ర లేకపోవడం వల్ల ఏ వయస్సు వారికైనా తీవ్రమైన పరిణామాలు ఎదురుకావచ్చని ఆస్ట్రేలియన్ ప్రభుత్వ ఆరోగ్య వెబ్‌సైట్ వెల్లడించింది. నిద్ర లేకపోవడం వల్ల ఆలోచనా సామర్థ్యం తగ్గడం, తీవ్రమైన మానసిక స్థితి మార్పులు, చిరాకు, కోపం వంటివి వస్తాయి.తక్కువ శక్తి, బలహీనమైన రోగనిరోధక శక్తి సమస్యలు తలెత్తుతాయి. దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే ప్రమాదం కూడా లేకపోలేదు. అధిక రక్తపోటు, మధుమేహం, బరువు పెరగడం లేదా ఊబకాయం, గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉంది. శారీరక సమతుల్యత క్షీణించడం, లైంగిక సామర్థ్యం కోల్పోవడం వంటి సమస్యలు వస్తాయి. సాధారణంగా 24 గంటలు నిద్ర లేకపోతే ఆవలించడం, కొద్దిగా శక్తి లేకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కానీ 24 గంటల కంటే ఎక్కువసేపు మేల్కొని ఉంటే, ఈ లక్షణాలు మరింత తీవ్రమవుతాయి. మెదడు పనితీరు, దెబ్బతిని ప్రమాదాలు జరిగే అవకాశం పెరుగుతుంది. నిద్రకు చిట్కాలు: ప్రతిరోజూ ఒకే సమయానికి పడుకోవడం, మేల్కొవడం అలవాటు చేసుకోండి. పడుకునే గదిని నిశ్శబ్దంగా, చీకటిగా, సౌకర్యవంతంగా, సరైన ఉష్ణోగ్రతలో ఉంచండి. టీవీ, కంప్యూటర్, ఫోన్‌లను పడుకునే గదికి దూరంగా ఉంచండి. పడుకునే ముందు భారీ భోజనం, కెఫిన్, ఆల్కహాల్ తీసుకోకండి. ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. పడుకునే ముందు పొగాకు తినడం లేదా సిగరెట్లు కాల్చడం పూర్తిగా మానుకోండి.





# సినిమా



## ఇండిస్ట్రీలో తీవ్ర విషాదం..
# ప్రముఖ హీరో కన్నుమూత

వరుస విషాదాలతో ఇండిస్ట్రీలోని సెలబ్రిటీలు ఒక్కరొక్కరిగా తిరిగి రాని లోకాలకు వెళ్లిపోతున్నారు. గత కొద్ది రోజులగా చాలామంది సడెన్‌గా గుండెపోటుతో మరణిస్తుంటే.. మరికొందరు అనారోగ్య సమస్యలు తలెత్తి ఆదుకునే వాళ్ళు లేక కొందరు చనిపోతున్నారు. తాజాగా, ఇండిస్ట్రీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. తమిళ హీరో అభినరు కింగర్ తుదిశ్వాస విడిచాడు. కొన్నేళ్లుగా కాలేయ వ్యాధితో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ సోమవారం ప్రాణాలు కొల్పోయారు. ఇందుకు సంబంధించిన పోస్టులు నెట్టింట వైరల్ అవుతుండగా.. ఈ విషయం తెలుసుకున్న వారంతా సంతాపం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. అరుముగ్, ఆరోహణం, సక్సెస్ వంటి చిత్రాల్లో నటించిన ఆయన చివరగా 'వల్ల వణుక్కు పుల్లం ఆయుధం' చిత్రంలో కనిపించారు. ఆ తర్వాత పూర్తిగా సినిమాలకు దూరం అయి తన అనారోగ్యానికి చికిత్స తీసుకున్నారు. ఇక ఇటీవల తన మరణాన్ని అంచనా వేస్తూ ఓ వీడియో కూడా షేర్ చేశాడు. అందులో ఏడాదిన్నర మాత్రమే బుతుకుతానని డాక్టర్లు చెప్పారని చెప్పాడు. ఈ వీడియో వచ్చిన మూడు నెలలకే మరణించడం గమనార్హం. ఆరోగ్యం క్షీణించడం వల్లే ప్రాణాలు కోల్పోయాడు...



## ప్రభాస్ హీరోయిన్లకు
# ఇది మామూలే

పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్‌తో పని చేసిన వాళ్లందరూ అతడి గురించి సోషల్ మీడియాలో లేదా ఇంటర్వ్యూల్లో కచ్చితంగా చెప్పే విషయం ఒకటుంటుంది. అదే.. తమ ఇంటి వంటలతో అతను అందించే విందు. తాను పని చేసే యూనిట్లో దాదాపుగా ముఖ్యులందరికీ తమ ఇంటి వంటలు రుచి చూపించకుండా ఉండడు ప్రభాస్. ప్రభాస్ వల్ల తమ డైట్ ప్లాన్లు దెబ్బ తిన్నాయని.. కడుపు ఉబ్బిపోయేలా తిండి పెట్టి చంపేస్తాడని సరదాగా వ్యాఖ్యానిస్తుంటారు కోస్టార్లు. ఈ జాబితాలోకి కొత్తగా ఇంకో పేరు చేరింది. 'ఫౌజీ' సినిమా కోసం ప్రభాస్‌తో జట్టు కట్టిన కొత్త కథానాయిక ఇమాన్వి కూడా ప్రభాస్ ఫుడ్ లవ్‌ను రుచి చూసింది. దీని మీద మాండేటరీ పోస్టు పెట్టేసింది. 'ఫౌజీ' షఉటింగ్ టైంలో ప్రభాస్ ఇంటి నుంచి తెప్పించి వడ్డించిన నాన్ వెజ్, వెజ్ వంటకాలను వీడియో తీసి తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో షేర్ చేసిన ఇమాన్వి.. కడుపు పేలిపోయేలా ఈ వంటకాలను తిన్నట్లు కామెంట్ చేసింది. ఇలా ఎంతోమంది ఆర్టిస్టులు, టెక్నీషియన్లు ప్రభాస్ ఇంటి వంటకాలు తిని బాబోరు అన్న వాళ్లే. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అయిన ఇమాన్వి తన వీడియోలతోనే 'ఫౌజీ' దర్శకుడు హను రాఘవపూడి కళ్లలో పడింది. ఇలాంటి నేపథ్యం ఉన్న కొత్త అమ్మాయిని ప్రభాస్ లాంటి టాప్ స్టార్‌కు జోడీగా తీసుకోవడం చాలామందిని ఆశ్చర్యపరిచింది. ఐతే ఇమాన్వి టాలెంట్ తెలిసిన వాళ్లు.. తనేంటో 'ఫౌజీ' సినిమా రిలీజైనపుడు తెలుస్తుందని అంటున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ప్రేక్షకుల ముందుకు వస్తుంది. 1930–40 మధ్య నేపథ్యంతో తెర కెక్కుతోంది. .



# మహాశయా..
# సరైన దారికి వచ్చారు



మాస్ మహారాజా రవితేజ గత కొన్నేళ్లుగా చేస్తున్న మాస్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద అడ్డంగా బోల్తా కొడుతున్నాయి. ఒక్క ధమాకా తప్ప మిగిలినవన్నీ తీవ్రంగా నిరాశ పరిచాయి. ఇటీవలే వచ్చిన మాస్ జాతర మరీ అన్యాయం. ప్రీమియర్ షో నుంచే నెగటివ్ టాక్ మూటగట్టుకుంది. అయినా సరే నిన్న వీకెండ్ మెయిన్ సెంటర్స్ లో హౌస్ ఫుల్స్ నమోదు చేయడం చూస్తే జనం మాస్ ఎంటర్ టైనర్స్ కోసం ఎంతగా కరువులో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఒకవేళ ఇది కనక బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకుని ఉంటే కనీసం రెండు వారాలు భారీ నెంబర్లు నమోదయ్యేవి. మంచి అవకాశం చేతులారా వ□థా అయ్యింది. ఇది పక్కనపెడితే రవితేజ కొత్త సినిమా భర్త మహాశయులకు విజ్ఞప్తి సంక్రాంతి విడుదలకు రెడీ అవుతోంది. టైటిల్ రివీల్ సందర్భంగా చిన్న టీజర్ వదిలారు. అందులో కాన్సెప్ట్ ఏంటో చెప్పారు. ఇద్దరు అమ్మాయిలు జీవితంలో ఉన్న ఒక ఉద్యోగికి పెద్ద సంకటం వచ్చి పడుతుంది. ఎవరిని అడిగినా ఆఖరికి ఏఐ టెక్నాలజీ వాడినా సమాధానం దొరకదు. అసలా ప్రశ్న ఏంటి, అతను ఎదురుకున్న ఆ ఇబ్బంది ఏంటనేది తెరమీద చూడాలి. తన రెగ్యులర్ స్టైల్‌కి భిన్నంగా రవితేజ పూర్తిగా క్లాస్ టచ్ తీసుకున్నాడు. ఆశికా రంగనాథ్, డింపుల్ హయాతి మధ్య నలిగిపోయే నారీనారీ నడుమ మురారిగా అలరించబోతున్నాడు. ఇప్పుడీ మార్పు మంచిదే. ఎందుకంటే ఫ్యామిలీ ఆడియన్స్ కి మళ్ళీ దగ్గరవ్వాలంటే ఇలాంటి కథలే ఎంచుకోవాలి. వరస ఫ్లాపులు తన మార్కెట్ ని ప్రభావితం చేసి ఉండొచ్చేమో కానీ ఇమేజ్ ని కాదు. సో భర్త మహాశయులకు విజ్ఞప్తి మంచి నిర్ణయమే కిషోర్ తిరుమల దర్శకత్వం వహించిన ఈ ఎంటర్ టైనర్ లో పెద్ద క్యాస్టింగే ఉంది.

# సారీ చెప్పినా క్షమించని హీరోయి

తెలుగులో 'శ్రీదేవి శోభన్ బాబు' అనే సినిమాలో నటించిన తమిళ కథానాయిక గౌరి కిషన్ పేరు ఇటీవల సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. ఒక సినిమా ప్రమోషన్ కోసం మీడియాను కలిసిన ఆమెను.. ఆర్.ఎస్.కార్తీక్ అనే సీనియర్ తమిళ సినీ జర్నలిస్టు అడిగిన ప్రశ్న దుమారం రేపింది. మీ బరువు ఎంత.. ఈ మధ్య వెయిట్ పెరిగినట్లున్నారే అని ఆ జర్నలిస్టు అడగ్గా.. నేనెందుకు నా వెయిట్ చెప్పాలి అంటూ ఆమె ఫైర్ అయింది. ఇది అసలు జర్నలిజమే కాదంటూ ఆమె ఆ జర్నలిస్టుతో చాలా సేపు వాగ్వాదానికి దిగింది. ఆ జర్నలిస్టు కూడా గట్టిగానే ఎదురుదాడి చేశాడు. ఐతే సోషల్ మీడియా పూర్తిగా గౌరి వైపే నిలిచింది. ఇవేం ప్రశ్నలు అంటూ ఆ జర్నలిస్టు తీరును అందరూ దుయ్యబట్టారు. అలాంటి ప్రశ్నలు అడగడమే తప్పంటే.. మళ్లీ వాదించడమా అంటూ ఆయన్ని నిలదీశారు. ఈ విషయమై తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆ జర్నలిస్టు గౌరి కిషన్‌కు సారీ చెబుతూ ఒక వీడియో కూడా చేయాల్సి వచ్చింది.కానీ బేషరతుగా క్షమాపణ చెప్పకుండా.. తన ప్రశ్నను తప్పుగా అర్థం చేసుకున్నారంటూ ఆయన ఈ వివరణలో పేర్కొన్నాడు. దీంతో గౌరి కిషన్‌కు ఇంకా కోపం వచ్చింది. ఇదసలు క్షమాపణ లాగే లేదని.. దీన్ని తాను అంగీకరించనని ఆమె తేల్చి చెప్పింది. ఆయన ప్రశ్నను తప్పుగా అర్థం చేసుకున్నానని చెప్పడం.. బాడీ షేమింగ్ చేయలేదు అనడం.. అది సరదాగా అన్న ప్రశ్న అనడంపై ఆమె అభ్యంతరం వ్యక్త◌ంచేసింది. ఇంకా బెటర్‌గా ట్రై చేయండి కార్తీక్ అంటూ ఘాటుగా బదులిచ్చింది గౌరి కిషన్.



# నిలువెత్తు తెలుగు సంతకం ఎంవీ కృష్ణారావు

- రాష్ట్ర తెలుగు సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డీ.విల్సన్
- బ(్ర)ంకులలో ఘనంగా ఎంవీ కృష్ణారావు శత జయంతి 100వ రోజు వేడుకలు
- ఎంవీ కృష్ణారావుకు ఘన నివాళి అర్పించిన ఆర్.డీ విల్సన్, కొనకళ్ళ నారాయణ, బండి రామకృష్ణ
- ఉచిత మెగా వైద్య శిబిరంలో 362 మందికి వైద్య పరీక్షలు
- వంద మంది నిరుపేద ఎస్టీలకు వస్త్రదానం
- రెండు వేల మందికి అన్నదానం





అవనిగడ్డ నవంబర్11 (వుదయం ప్రతినిధి): నిలువెత్తు తెలుగు సంతకం ఎంవీ కృష్ణారావు అని రాష్ట్ర తెలుగు - సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డీ.విల్సన్ అన్నారు. మంగళవారం నాగాయలంక మండలం బ(్ర)ంకుల పీఏసీఎస్ కార్యాలయం వద్ద ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ గాంధీ స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా 100వ రోజు వేడుక ఘనంగా జరిగింది. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఉత్సవ నిర్వహణ కమిటీ - నాగాయలంక మండలం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభకు ముఖ్య అతిధిగా విచ్చేసిన విల్సన్ మాట్లాడుతూ తెలుగు భాష వ్యాప్తి, పరిరక్షణకు ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించిన మండలి వెంకట కృష్ణారావు తన రచనలకు ఆలోచన, స్ఫూర్తి అన్నారు. కృష్ణారావు బాటలో నియోజకవర్గ అభివృద్ధికి, భాష పరిరక్షణకు వారసత్వాన్ని కొనసాగిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలుగు భాష కోసం రాజీ లేని పోరాటం చేస్తున్నారన్నారు. తెలుగులో పరిపాలన ఉత్తర్వులు, న్యాయస్థానాల తీర్పుల దిశగా కొంత ప్రయత్నం జరిగిందన్నారు. స్థితప్రజ్ఞునిగా, దార్శనికునిగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో భాష గురించి నిర్వహించే కార్యక్రమాలకు వన్నె తెచ్చే ఏకైక నాయకుడు బుద్ధప్రసాద్ అని తెలిపారు. ఆయన అడుగు జాడల్లో నడిచి భాష అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.ఆత్మీయ అతిథులు ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, మార్క్ ఫెడ్ చైర్మన్ బండి రామకృష్ణ ప్రసంగిస్తూ మండలి వెంకట కృష్ణారావు విలువలతో కూడిన రాజకీయం చేశారన్నారు. నిరాడంబర జీవితం గడిపిన కృష్ణారావు నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత అన్నారు. ఏకగ్రీవంగా ఎమ్మెల్యే కావడమే కాకుండా, అదే సమయంలో మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించిన ఘనత ఒక్క మండలి వెంకట కృష్ణారావుకే దక్కిందన్నారు. సమైక్య ఆంధ్రప్రదేశ్ పరిరక్షణకు సాహసోపేతంగా కృషి చేసిన నేత కృష్ణారావు అని తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పీవీ నరసింహారావు, మండలి వెంకట కృష్ణారావు బాధ్యతలు నిర్వహించిన తెలుగు అకాడమీలో గత ప్రభుత్వం సంస్కృతం జోడించినపుడు తీవ్రంగా వ్యతిరేకించినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఎంవీ కృష్ణారావు హయాంలో తెలుగు అకాడమీ ప్రాముఖ్యత సంతరించుకుందన్నారు. చరిత్ర తెలియని వాళ్ళు తెలుగు అకాడమీలో సంస్కృతం కలిపారని, చరిత్ర తెలిసిన కూటమి ప్రభుత్వం తెలుగు, సంస్కృత అకాడమీలు వేరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మహోన్నత సంస్థ తెలుగు అకాడమీని నిర్వీర్యం చేయకుండా కూటమి ప్రభుత్వం సంస్కృత అకాడమీ వేరు చేయాలని కోరారు. బ(్ర)ంకుల గ్రామ అభివృద్ధికి కృషి చేసిన వారిని స్మరించుకున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ నేటి యువత వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. దివిసీమ ఉప్పెనకు బ(్ర)ంకులలో సత్య సాయి ట్రస్ట్ ప్రతినిధులు ప్రతి రోజు 1500 మందికి భోజనం, నిత్యావసర సరుకులు, వస్త్రాలు అందించటంతో పాటు, ఎస్సీ కాలనీలో అరవై ఇళ్ళు నిర్మించారని తెలిపారు. నాడు నిర్మించిన కమ్యూనిటీ హాలు పునర్నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఇందుకు సత్య సాయి ట్రస్ట్ సహాయం కోరేందుకు కృషి చేస్తామన్నారు. బ(్ర)ంకుల ప్రధాన రహదారితో పాటు నియోజకవర్గంలోని పంచాయతీ రాజ్ రోడ్ల సమస్యను ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్ళగా, ఆయన సానుకూలంగా స్పందించారని, బ(్ర)ంకుల రోడ్డు నిర్మాణానికి రూ.మూడు లక్షలు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిన నీటి సంఘాలతో పాటు సహకార సంఘాల త్రిసభ్య కమిటీల ప్రతినిధులు రైతులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఎంవీ కృష్ణారావు శత జయంతి వేడుకలను ఆయన ఎంతగానో ఆసక్తి చూపే సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహిస్తున్న కమిటీ ప్రతినిధులను అభినందించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వంద మంది నిరుపేద ఎస్టీలకు వస్త్రదానం, రెండు వేల మందికి అన్నదానం నిర్వహించారు. శత జయంతి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో రేపల్లె సంజీవని ఆసుపత్రి వారు విచ్చేసి 362 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, మర్రె గంగయ్య, పూషడపు రత్నగోపాల్, మాజీ ఏఎంసీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, లయన్స్ క్లబ్ దివిసీమ కోడూరు అధ్యక్షులు పూతబోయిన సీతా రత్న సాయిబాబు, పీఏసీఎస్ చైర్మన్లు ముమ్మారెడ్డి శ్రీనివాసరావు కొక్కిలిగడ్డ నాగరాజు, వడుగు నాగరాజు, సబ్బినేని వెంకటేశ్వరరావు, గ్రామ ప్రముఖులు గోపాలం వెంకటేశ్వరరావు, శత జయంతి వేడుకల నిర్వహణ కమిటీ కన్వీనర్ తలశిల స్వర్ణలత, ప్రతినిధులు మెండు లక్ష్మణరావు, మండలి ఉదయ భాస్కర్, తలశిల వెంకట నరసింహారావు (నాని), మాదివాడ అర్జునరావు, భోగాది సతీష్, రేమాల బాబూరావు, బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు, గుడివాక శివరావు, బండ్రెడ్డి వీర నాగ మల్లికార్జున్, బండ్రెడ్డి హరి, చన్నగిరి లతా మోహన్, అంబటి శ్యామ్ ప్రసాద్, తాడేపల్లి వెంకట పాపారావు, భోగిరెడ్డి బుజ్జిబాబు, బ(్ర)ంకుల సొసైటీ పర్సన్ల నాయుడు వెంకటేశ్వరరావు (సొర్లగొంది), సీఈఓ పల్లిపోతుల శ్రీనివాసరావు, కొప్పనాతి వెంకటేశ్వరరావు (నాలి), జనసేన జిల్లా కార్యదర్శి గాజుల శంకరరావు, పీఏసీఎస్ చైర్మన్లు పూతబోయిన కరుణకుమార్, యలవర్తి చిన్నా, సీనియర్ నాయకులు బచ్చు వెంకటనాథ్ ప్రసాద్, కూటమి నాయకులు వర్రె రాంబాబు, సిద్దినేని అశోక్ నాయుడు, బండ్రెడ్డి శివ విష్ణు, తోట మానస, ఏఎంసీ డైరెక్టర్ పిరాటి శిరీష, నియోజకవర్గంలోని ఆరు మండలాల కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల వైద్యానికి చంద్రబాబు భరోసా

- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్
- ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 21 మందికి రూ.34,59,941 సహాయం
- కూటమి ప్రభుత్వంలో 779 మందికి రూ.6,23,54,193లు సహాయం



అవనిగడ్డ నవంబర్11 (వుదయం ప్రతినిధి):రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలను ఆదుకుంటున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మంగళవారం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో 21 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరు అయిన చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతులమీదుగా రూ.34,59,941 సహాయం చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా భరోసాగా నిలుస్తున్నారని తెలిపారు. అత్యవసర వైద్య సేవలు పొందిన పేదలు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం కోరుతూ సమర్పించే దరఖాస్తులను సీఎం చంద్రబాబు సాధ్యమైనంత వేగంగా పరిష్కారం చేస్తూ, పేదలకు ఆసరాగా నిలుస్తున్నారని తెలిపారు. తమ నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వంలో ఇప్పటివరకు సీఎంఆర్ఎఫ్ ద్వారా 779 మందికి వైద్య ఖర్చులకు రూ.6,23,54,193లు సహాయం అందచేసినట్లు వివరించారు. పార్టీలకు అతీతంగా వైద్య ఖర్చులకు సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదములు తెలిపారు.

# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతకు కడవకొల్లు నరసింహారావు పరామర్శ.



అవనిగడ్డ నవంబర్11(వుదయం ప్రతినిధి):వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతను దివి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రైతు విభాగం సీనియర్ నాయకులు కడవకొల్లు నరసింహారావు పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన మేరుగు రమేష్ ను చల్లపల్లి కోమలా నగర్ లో గల గృహంలో మంగళవారం కడవకొల్లు పరామర్శించారు. ప్రమాద ఘటన గురించి రమేష్ ను అడిగి తెలుసుకున్నారు. మేరుగు రమేష్ త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా కడవకొల్లు నరసింహారావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జుజ్జువరపు భాగ్యరావు, ఆగ్రో డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మేరుగు ఝాన్సీ లక్ష్మి, మండల నేత యడ్ల జగదీష్, మండల పార్టీ యువజన విభాగం కన్వీనర్ వెనిగళ్ళ తారక జగదీష్, నియోజకవర్గ పార్టీ డాక్టర్స్ సెల్ కన్వీనర్ బెల్లపు హరిబాబు, యార్లగడ్డ ఎంపీటీసీ సభ్యులు కర్రా రవి, రైతు విభాగం నాయకులు కుందేటి కోటేశ్వరరావు, తెనాలి శ్రీనివాసరావు, వరిగంజి అర్జునరావు, పోతరాజు తదితరులు పాల్గొన్నారు.

# చేనేతలకిచ్చిన హామీ నిలబెట్టుకున్న సీఎం

- ఎనిమిదిన్నర కోట్లతో 23 ఎకరాలలో నిర్మించనున్న చేనేత పార్కుకు ఎట్టకేలకు శంకుస్థాపన
- శాసనసభ్యులు మద్దులూరి మాల కొండయ్య



చీరాల నవంబర్ 11 ( వుదయం ప్రతినిధి ) చేనేతల చిరకాల వాంఛ హ్యాండ్లూమ్ పార్కుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆమోదముద్ర వేసినట్లు శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వేటపాలెం మండలం నాయినిపల్లిలో ఏండ్లు పార్కుకు శంకుస్థాపన చేసిన సందర్భంలో ఎమ్మెల్యే మాట్లాడారు. చేనేతల అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలోని నేతన్నలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న హ్యాండ్లూమ్ పార్కు శంకుస్థాపన చేయడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఎనిమిదిన్నర కోట్ల వ్యయంతో 23 ఎకరాలలో నిర్మించనున్న ఎం ఎస్ ఎం ఈ చేనేత హ్యాండ్లూమ్స్ పార్క్ పనులను ప్రకాశం జిల్లా కనిగిరి పిసిపల్లి నుండి సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించినట్లు తెలిపారు. పార్కు పనులకు సంబంధించి ఎమ్మెల్యే చేనేతలతో భూమి పూజ చేయించడం జరిగింది. అనంతరం శాసనసభ్యులు శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న హ్యాండ్లూమ్ పార్క్ శంకుస్థాపన కార్యక్రమానికి భారీ సంఖ్యలో చేనేతలు హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో నేతన్నలు అడిగిన చేనేత పార్క్ ను నిర్మాణం పనులు ప్రారంభం కావడం చాలా సంతోషంగా ఉందని, ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని ఎమ్మెల్యే తెలిపారు. చీరాల చేనేత ల చిరకాల కళ అయిన చేనేత పార్క్ నిర్మాణం జరుగుతుండడంతో నేతన్నలు సీఎం చంద్రబాబు కు ఎమ్మెల్యే కొండయ్యకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, చైర్మన్ కౌతరపు జనార్ధన్ చీరాల మున్సిపల్ చైర్మన్ మించాలా సాంబశివరావు, ఆప్కో చైర్మన్ సజ్జ హేమలత, ఆర్డిఓ చంద్రశేఖర్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నాసిక వీరభద్రయ్య, బుచ్చేశ్వరరావు, స్థానిక తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీలకు చెందిన నాయకులు, అధికారులు, చేనేతలు తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల భవిష్యత్ కోసం నేటి నిరసనలో ప్రతి ఒక్కరు పాల్గొనండి

## మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి పిలుపు



కావలి, నవంబరు 11,(వుదయం ప్రతినిధి):వైసీపీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ కు నిరసనగా కావలిలో బుధవారం జరగనున్న కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నియోజకవర్గం వైసిపి ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కావలి వైసీపీ కార్యాలయం లో విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 9.30 గంటలకు కావలి నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు, వైసీపీ ఇంచార్జ్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, తదుపరి కావలి రెవిన్యూ డివిజనల్ అధికారి కి వినతి పత్రం సమర్పించడం జరుగుతుందని తెలియజేశారు. మెడికల్ కళాశాలలు ప్రైవేటు పరం కాకుండా కూటమి ప్రభుత్వం నిర్ణయాలను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పూర్తి చేసుకున్న సందర్భంగా, ఈ నిరసన ర్యాలీ చేపట్టడం ప్రభుత్వానికి తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. భవిష్యత్ లో పేద మెడికల్ విద్యార్థులు నష్టపోకూడదని అన్నారు. జిల్లాలోనే కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ద్వారా కావలి ప్రథమ స్థానంలో నిలిచిందని అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కావున వైసిపి శ్రేణులు, అభిమానులు, ప్రజలు త్వరితగతిన రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి కళ్యాణమండపం వద్దకు విచ్చేసి ర్యాలీలో పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా రాజకీయ అంశాలపై మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కావలి ఎమ్మెల్యే గత ఎలక్షన్లలో తీర ప్రాంత మత్స్యకారులకు మాయ మాటలు చెప్పి వారిని ప్రలోభ పెట్టి మోసం చేశారని దుయ్యబట్టారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న తరుణంలో తీరప్రాంత ప్రజల పొలాలు పారిశ్రామిక వాడలకు ప్రభుత్వం కొనుగోలు చేసే క్రమంలో పెద్ద మొత్తంలో నగదు ఇప్పించేందుకు ప్రయత్నించానన్నారు. అయితే ఆనాడు ఎలక్షన్లు రావడంతో ఎన్నికల భరిలో నిలిచిన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా కావ్య కృష్ణారెడ్డి ప్రచారం చేస్తూ తాను ఇంటికో ఉద్యోగం ఇప్పిస్తామని, 50 లక్షల రూపాయలు ఎకరానికి ఇప్పిస్తానని నమ్మబలికినట్లు, మత్స్యకారులను మోసం చేశారని గుర్తు చేశారు. అందుకు గాను ఆ నాడు మాట్లాడిన బహిరంగ సభలో ఆయన మాట్లాడిన రికార్డును విలేకరులకు వినిపించారు. అయితే ప్రస్తుతం వారి ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా కొనసాగుతున్న అదే కృష్ణారెడ్డి నేడు మత్స్యకార ప్రజల పొలాలకు 18 లక్షలు ఎకరం నకు ఇప్పిస్తానని, అంతకుమించి ఏమి చేయలేనని తెగేసి చెప్పడం మోసం చేసిన విధానం కాదా అని విమర్శించారు. సమావేశంలో వైసీపీ పట్టణ కమిటీ చైర్మన్ కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం

## అబ్దుల్ కలాం ఆజాద్ 137వ సభలో జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల



నెల్లూరు, నవంబర్ 11, (వుదయం ప్రతినిధి):అందరూ విద్యావంతులయితేనే దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుంది, విద్యతోనే పేదరికాన్ని దూరం చేయగలమని జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల అన్నారు. మంగళవారం కలెక్టరేట్ శంకరన్ హాలులో భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 137వ జయంతి వేడుక కార్యక్రమం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజంలో పేదరికాన్ని దూరం చేయగలమని, కులం, మతం, వర్గం ఇవేవీ విద్యకు ప్రామాణికాలు కావన్నారు. భారత దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి, భారత రత్న అవార్డు గ్రహీత మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ విద్యకు ఎంతో ప్రాధాన్యతను ఇచ్చారన్నారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి అని, స్వతంత్ర్య సమరయోధులుగా, కవిగా, రచయితగా, పాత్రికేయులుగా, విద్యావేత్తగా ఆయన సేవలు చిరస్మరణీయం అన్నారు. ఆయన జయంతి వేడుకను జాతీయ విద్యా దినోత్సవంగా, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ దినోత్సవంగా జరుపుకోవడం గర్వంగా ఉందన్నారు. ప్రస్తుతం మన దేశ ప్రజలు ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్టమైన సేవలు అందిస్తున్నారంటే అందుకు కారణం విద్యారంగానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన కృషే అన్నారు. ఆయన కృషి ఫలితంగానే మన దేశంలో విద్యాభివృద్ధి సాధ్యమైందన్నారు. ఎవరూ దొంగిలించలేని, స్థిరమైన ఆస్తి విద్య మాత్రమే అని, ప్రతి విజయానికీ నాంది కూడా విద్యనే అని కలెక్టర్ సందేశమిచ్చారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ ఆజాద్ భారత విద్యా వ్యవస్థకు బాటలు వేసి, సమగ్ర, నాణ్యమైన విద్య అందరికి అందుబాటులో ఉండాలనే దృష్టితో పలు కీలక సంస్కరణలు చేపట్టారన్నారు. విద్య ద్వారానే దేశ అభివృద్ధి సాధ్యమని విశ్వసించిన వ్యక్తి ఆజాద్ అని అన్నారు. విద్యార్థులందరూ ఆ మహనీయుని సేవలను స్మరించుకుంటూ భావి భారత పౌరులుగా దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యా రంగం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. తొలుత మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్వో విజయ్ కుమార్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడి మహమ్మద్ అయుబ్, బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సారూ. మాకో 'దారి' చూపండి



'సారూ.. మా గ్రామానికి కనీసం నడిచి వెళ్లడానికి కూడా సరైన దారి లేదు.. బురద రహదారిలో రాకపోకలు చేయలేక నిత్యం నరకం అనుభవిస్తున్నాం.. రోడ్డు నిర్మించరూ..' అంటూ బొండపల్లి మండలంలోని చినగూడెం గ్రామస్థులు వేడుకుంటున్నారు. సోమవారం పాఠశాల విద్యార్థులు వారి తల్లిదండ్రులు బురద రోడ్డులో నిల్చుని నిరసన తెలిపారు. గ్రామం నుంచి గొల్లుపాలెం వెళ్లి అక్కడి నుంచి మండల కేంద్రానికి వెళ్లాలి. గొల్లుపాలెం వరకూ బురద రోడ్డులో పిల్లలు పాఠశాలలకు వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో గిరిబాల చెప్పారు

# ఢిల్లీ పేలుళ్ల ఘటన దురదృష్టకరం.



అవనిగడ్డ నవంబర్11 (వుదయం ప్రతినిధి):ఢిల్లీలో పేలుళ్ల ఘటన దురదృష్టకరమని ప్రముఖ పారిశ్రామికవేత్త, కూటమి నాయకులు విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు అన్నారు.ఢిల్లీలోని ఎర్రకోట మెట్రో స్టేషన్ వద్ద సోమవారం సాయంత్రం కారులో పేలుళ్లు సంభవించిన ఘటనపై మంగళవారం ఉదయం విక్కుర్తి శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశరాజధాని ఢిల్లీలో పేలుళ్ల ఘటన దురదృష్టకరమన్నారు. పేలుళ్ల ఘటనలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఘటనలో గాయాలైన వారు త్వరగా కోలుకోవాలని శ్రీనివాస్ కోరుకున్నారు. కేంద్ర హెూం మంత్రి అమిత్ షా సంఘటన జరిగిన వెంటనే ఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకోవడం కేంద్ర ప్రభుత్వ పనితనానికి నిదర్శనం అన్నారు. పేలుళ్ల ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందించిన తీరు అభినందనీయమన్నారు. అదే విధంగా ముందు చూపుతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో ఢిల్లీలో ఘటన దృష్ట్యా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు.

# జిల్లాలో విస్తృత తనిఖీలు.

## ఢిల్లీలో పేలుళ్ల నేపథ్యంలో జిల్లాలో పోలీసులు అప్రమత్తం అయ్యారు .



కర్నూలు నవంబర్ 11 వుదయం ప్రతినిధి: జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు.స్పెషల్ పార్టీ పోలీసు బృందాలు, పోలీసు జాగీలాలు, బాంబుస్క్వాడ్ బృందాలు జిల్లాలోని బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ఓర్వకల్లు ఎయిర్ పోర్టు, దేవాలయాలు, మసీదులు, ముఖ్యమైన రహదారులు, టోల్‌గేట్లు, లాడ్జీలు, రద్దీ ప్రదేశాలలో వాహనాలు, అనుమానితుల కదలికలు, లగేజీలపై ప్రత్యేక నిఘా ఉంచి తనిఖీలు నిర్వహించారు.అనుమానిత వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే డయల్ 112 కు గాని , డయల్ 100 కు గాని , స్థానిక పోలీసులకు గాని సమాచారం అందించాలని ప్రజలకు జిల్లా పోలీసులు సూచించారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ మాడపాటి హనుమంతరావు



ప్రొద్దుటూరు, నవంబర్ 11, (వుదయం ప్రతినిధి) స్థానిక శ్రీరాములు పేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రం లో ఈరోజు ఉదయం మాడపాటి హనుమంతరావు 54వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి నువూంజలి ఘటించారు.ఈ కార్యక్రమాన్ని ఉ ద్దేశించి ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ హనుమంతరావు హైదరాబాద్ నిజాం పాలనలోను ధైర్యంగా తెలుగు భాషా వ్యాప్తికి, సంస్కృతికి, తెలుగు గ్రంధాలయోద్యమానికి ఎనలేని కృషి చేశారు. అందుకే ఆయనను ఆంధ్ర పితామహుడని పిలుస్తారు. పాత్రికేయునిగా పనిచేశారు.న్యాయవృత్తి చేపట్టి పేదల సంక్షేమం కోసం కృషి చేశారు.గొప్ప కథకునిగా కూడా పేరు తెచ్చుకున్నారు.రైతాంగ జీవనంపై 1912లో హనుమంతరావు రాసిన "ఎవరికి?" కథ సాహితీ ప్రియుల ప్రశంసలు అందుకుంది.వీరి సేవలను గుర్తించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం వీరిని గౌరవ డాక్టరేట్ తో సత్కరించింది.అలాగే భారత ప్రభుత్వం పద్మభూషణ్ బిరుదుతో సత్కరించింది న్నారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి, రాయలసీమ వ్యాయామ శిక్షణ కళాశాల అధ్యాపకులు పంజగల మధుసూదన్ బాబు, కూరపాటి శ్రీనివాసుల రెడ్డి, మరియు షేక్షావల్లి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తుమందులు విక్రయిస్తున్న కారంపూడి బిజెపి నేత అరెస్టు

## బిజెపి నేతను అదుపులోకి తీసుకున్న తెలంగాణ పోలీసులు







గుంటూరు నవంబర్ 11(వుదయం ప్రతినిధి) కారంపూడి పట్టణంలోని వీరబ్రహ్మేంద్ర మెడికల్ స్టోర్ వ్యాపారి, బిజెపి నేత పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి హనుమంతరావు మత్తు మందు బిల్లలు తెలంగాణ వ్యక్తులకు సరఫరా చేస్తున్నారని తెలంగాణ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. తమ కుమారుడైన శెట్టి జయ రామచంద్ర ప్రసాద్ పరారీలో ఉ న్నట్లు తెలంగాణ పోలీసులు తెలిపారు. తమ కుమారుడు ఆచూకీ కోసం తెలంగాణ పోలీసులు ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. తెలంగాణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు..మిర్యాలగూడ పట్టణానికి చెందిన మచ్చ నవీన్, నక్క మహేష్ అనే ఇద్దరు వ్యక్తులు గత కొద్ది కాలంగా పల్నాడు జిల్లా, కారంపూడి మండలం లోని స్థానిక పట్టణానికి చెందిన శెట్టి హనుమంతరావు మెడికల్ స్టోర్ లో స్పాస్మో ప్రోక్సివాన్ ప్లస్ మత్తుమందు బిల్లలు కొని తెలంగాణలో యువతకు సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. సాధారణ తనిఖీల్లో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని ఈదులగూడెం కూడలిలో పోలీసులు తనిఖీలు చేస్తున్నంగా వారి వద్ద మత్తుమందు బిల్లలను పోలీసులు గమనించి,

# పెండింగ్ జీతాలు ఇప్పించాలనిఏఐటీయూసీ వినతిపత్రం.



కర్నూలు నవంబర్ 11 వుదయం ప్రతినిధి :కర్నూల్ ప్రభుత్వ సరోజన వైద్యశాలలు పనిచేస్తున్నటువంటి శానిటేషన్ ఒప్పంద కార్మికులకు గత కాంట్రాక్టర్ ఇవ్వాల్సినటువంటి 2 నెలల బకాయి జీతాలు పిఎఫ్ ఇప్పించాలని నేడు హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్. వెంకటేశ్వర్లు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. ము నెప్ప నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్. ము నెప్ప మాట్లాడుతూ ఏజెన్సీ కాలపరిమితి దాటిపోయి నాలుగు నెలలుగా వస్తున్న కార్మికులకు గత ఏజెన్సీ ఇవ్వాల్సినటువంటి రెండు నెలల జీతాలు ఇవ్వకపోవడం వల్ల శానిటేషన్ కార్మికులు వాళ్ల కుటుంబాల్ని గడుపుకోవడానికి,పిల్లలు చదువులకి, ఇంటి అద్దెలకి అనేక ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే కాంట్రాక్టర్ తో మాట్లాడి 2 నెలల బకాయి జీతాలు, కార్మికుల పిఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాలకు జమ జయించేందుకు కృషి చేయాలని వారు తెలియజేశారు కాంట్రాక్టర్ తో మాట్లాడి కార్మికుల సమస్య పరిష్కరిస్తానని సూపర్డెంట్ హామీ ఇవ్వడం జరిగింది.

# గ్రామీణ విలేకరులకు పునఃశ్చరణ తరగతులు

చింతూరు నవంబర్ 11 (వుదయం ప్రతినిధి) అల్లూరి సీతారామరాజు జిల్లా "చింతపల్లి" ఎం.పి.డి.ఒ కార్యాలయ హాల్ లో సి.ఆర్.మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 15 16 తేదీలలో గ్రామీణ విలేకరులకు పునఃశ్చరణ తరగతులు ఏర్పాటుచేసినట్లు చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారుసి.ఆర్.మీడియా అకాడమీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జిల్లా గ్రామీణ విలేఖరులకు రెండు రోజుల పాటు తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.. అనుభవజ్ఞులైన పాత్రికేయ ప్రముఖుల ద్వారా వివిధ అంశాలపై గ్రామీణ విలేఖరులకు పునశ్చరణతరగతులు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. తొలి రోజు నవంబర్ 15 ఉదయం విశాఖపట్నం నుండి వెలువడే "లీడర్" దిన పత్రిక ఎడిటర్ రమణ మూర్తి "పరిశోధనాత్మక జర్నలిజం" అనే అంశం పై ప్రసంగిస్తారు. మధ్యాహ్నం తరగతుల్లో "క్రైం వార్తల్లో మెళు కువలు" అంశం పై ఆంధ్రా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ బాబీవర్ధన్ ప్రసంగిస్తారు. అనంతరం "భారత రాజ్యాంగం – పత్రికా చట్టాలు అంశం పై ఎం. శ్రీనివాస రెడ్డి ప్రసంగిస్తారు. రెండవరోజు "గిరిజన చట్టాలు – రిపోర్టింగ్ " అంశం పై సీనియర్ జర్నలిస్టు, కాలమిస్ట్ గంజివరపు శ్రీనివాస రావు ప్రసంగిస్తారు. అనంతరం "పత్రికా భాష" అంశం పై విశాలాంధ్ర ఎడిటర్ ఆర్.వి. రామారావు ప్రసంగిస్తారు. అనంతరం కృత్రిమ మేధ" (ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్) అంశం పై సీనియర్ జర్నలిస్ట్ విజయకుమార్ కుర్రా ప్రసంగిస్తారు. సీనియర్ జర్నలిస్ట్ డి. సోమ సుందర్ "జర్నలిజం– నైతిక విలువలు " అంశం పై ప్రసంగిస్తారు. అనంతరం ముగింపు సమావేశం,పునశ్చరణ తరగతుల్లో పాల్గొన్న జర్నలిస్టులకు సర్టిఫికెట్లు పంపిణీ చేయడం జరుగుతుంది అని సురేష్ కుమార్ తెలిపారు.

# కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల న్యూ డయాగ్నస్టిక్ బ్లాక్ క్రిటికల్ కేర్ బ్లాక్ లోని సివిల్ పనుల తనిఖీ.

## ఆసుపత్రి అడిషనల్ డి ఎం ఈ సూపరింటెండెంట్, డా.కె.వెంకటేశ్వర్లు



కర్నూలు నవంబర్ 11 వుదయం ప్రతినిధి :కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నిర్మాణంలో ఉన్న న్యూ డయాగ్నస్టిక్ బ్లాక్‌లోని క్రిటికల్ కేర్ బ్లాక్ సివిల్ వర్క్ పురోగతిని ఏపీ ఎం ఎస్ ఐడీసీ సంబంధిత అధికారులు ఈ రోజు పరిశీలించారు.ఈ సందర్భంగా అధికార బృందం నిర్మాణ పనుల నాణ్యత, భవన నిర్మాణ దశలు, వైద్య పరికరాల ఏర్పాటుకు సంబంధించిన ప్రణాళికలను సమీక్షించినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన అత్యవసర వైద్య సేవలు అందించడానికి ఆధునిక సదుపాయాలతో క్రిటికల్ కేర్ బ్లాక్ త్వరితగతిన పూర్తవుతుందని తెలిపారు.ఆసుపత్రి ఇంజనీరింగ్ విభాగపు అధికారులకు సివిల్ వర్క్ నాణ్యతను కాపాడుతూ నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని వారికి ఆదేశించారు.ఈ కార్యక్రమానికి ఆర్ ఎం ఓ , డా.వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్, సింధు సుబ్రహ్మణ్యం, అసోసియేట్ ప్రొఫెసర్, డా.శివబాల, ఏపీఎంఎస్ఐడీసీ, డి ఈ, శిల్ప, జె ఈ, సెల్వం, మరియు కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి మౌలానా సేవలు చిరస్మరణీయం

## నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్



కర్నూలు నవంబర్ 11 వుదయం ప్రతినిధి :భారతదేశపు తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యాభివృద్ధికి చిరస్మరణీయ సేవలు అందించారని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ కొనియాడారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఆజాద్ జన్మదినం నవంబర్ 11న పురస్కరించుకుని మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాలను నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు.తొలి విద్యాశాఖ మంత్రిగా 11 ఏళ్లు కొనసాగి ఆయన విద్యారంగంలో విప్లవాత్మక మార్పుల తెచ్చారన్నారు. తద్వారా ఎంతోమంది విద్యార్థుల ఉన్నత విద్యను చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదిగారన్నారు. ఆయన స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి, మైనార్టీల సంక్షేమాన్ని ఎంతో కృషి చేస్తుందన్నారు. దేశ భవిష్యత్తును , ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో విద్య ముఖ్య భూమిక పోషిస్తుందని, నైపుణ్యంతో కూడిన చదువుల ద్వారానే మానవాభివృద్ధి తద్వారా దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అందుకే దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ప్రభుత్వాలు చదువుకు అధిక ప్రాధాన్యం ఇచ్చి, అందరూ విద్యను అభ్యసించేలా ప్రోత్సహిస్తున్నాయని పేర్కొన్నారు. భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చాలా కాలం పనిచేశారని, దేశంలో విద్యాభివృద్ధికి ఆయన అనేక కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి క్రిష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివప్రసాద్, డిసిపి వెంకటరమణ, అకౌంట్స్ ఆఫీసర్ చుండి ప్రసాద్, సూపరింటెండెంట్ రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో జరిగిన బాంబు పేలుడు దేశ ప్రజల మనసును కలచివేసింది

## నియోజకవర్గ కాంగ్రేస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాషా



ప్రొద్దుటూరు, నవంబర్ 11, (వుదయం ప్రతినిధి) నిరపరాధుల ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం అని ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు హృదయపూర్వక సానుభూతిని తెలియజేశారు.గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు.ఇలాంటి విషాదాలు మళ్లీ పునరావృతం కాకూడదని దేవుని ప్రార్థిస్తున్నాను అని అన్నారు.దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం నిలవాలని మనమందరం కోరుకోవాలి అని తెలియజేశారు.భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం అవసరం అన్నారు.ప్రతి మనిషి ప్రాణం అమూల్యం ం దాన్ని కాపాడటం మన అందరి బాధ్యత అంటూ ప్రేమ, శాంతి, ఐక్యతే మన దేశ బలం అని అన్నారు.

# ఢిల్లీ పేలుడు ఘటన అత్యంత బాధాకరం

## కడప పార్లమెంట్ ఇంచార్జ్ మూసాని శ్రేనివాస్ రెడ్డి



కడప, నవంబర్ 11, (వుదయం ప్రతినిధి) దేశ రాజధానిలో చోటుచేసుకున్న పేలుడు వార్త అందరినీ విషాదంలో ముంచింది అని నిరపరాధుల ప్రాణాలు కోల్పోవడం మనసును ముక్కలుచేసింది అని ఆ కుటుంబాలు ఎదుర్కొంటున్న వేదనను మాటల్లో చెప్పలేము అని అన్నారు.వారికి నా గాఢ సానుభూతి మరియు మద్దతు తెలియజేస్తూ గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవుని ప్రార్థిస్తున్నాను అనిఇలాంటి ఘటనలు ఇక మళ్లీ జరగకూడదు, ప్రతి ప్రాణం విలువైనదే అంటూ దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం నిలవాలి, ప్రేమ పుష్పించాలి అని అన్నారు.ప్రజల భద్రత ప్రభుత్వానికి ప్రధాన కర్తవ్యంగా మారాలి.మన దేశం ఐక్యత, కరుణ, సానుభూతి మీద నిలబడాలి అని మనమంతా కలిసే బలమైన భారత్‌ను నిర్మించగలం అని అన్నారు.

# ఆదరణ పథకం కింద చేతి వృత్తి దారులందరికీ సబ్సిడీ రుణాలు ఇవ్వాలని డిమాండ్



కర్నూలు నవంబర్ 11 వుదయం ప్రతినిధి :చేస్తూ చేతి వృత్తి దారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన అన్ని జిల్లాల్లో బీసీ, ఎస్ సి, ఎస్ టి, మైనార్టీ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట జరిగే "ధర్నా"లను జయప్రదం చేయాలని చేతి వృత్తి దారుల సమాఖ్య ఎపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామాంజనేయులు డిమాండ్ చేశారు. 11– 11 – 2025న విశాఖపట్నంలో నీలం రాజశేఖర్ భవన్లో చేతి వృత్తి దారుల సమాఖ్య విశాఖ జిల్లా కన్వీనర్ నెయ్యల నాగభూషణం,ఎపి మత్స్య కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వాసుపల్లి నల్లయ్యల తో కలిసి విడుదల చేసిన పత్రిక ప్రకటన లో కె. రామాంజనేయులు తెలియ జేస్తూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినప్పటికీ చేతి వృత్తి దారులకు, పేదలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని,సూపర్ సిక్స్ వాగ్దానాలు పూర్తిగా అమలు చేసుకునే గొప్పలు చెప్పుకుంటున్నారు తప్ప ఆచరణలో చేతి వృత్తి దారులకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు.గత రాష్ట్ర ప్రభుత్వం 56 కులవృత్తుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఏమాత్రం చేతి వృత్తి దారులకు రుణాలు ఇవ్వకుండానే మోసం చేసిందని, నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా దాదాపు 60 కులవృత్తుల కార్పొరేషన్ లోన్ ఏర్పాటుచేసి రుణాలు ఇస్తామని అప్లికేషన్లు తీసుకొని లబ్ధిదారులను ఎంపిక చేసి నేటికీ రుణాలు ఇవ్వలేదని విమర్శించారు. తిరిగి ఇటీవల ఆదరణ –3 పథకం కింద రుణాలు ఇచ్చి ఆదుకుంటామని చెప్తున్నారు నిజంగా రాష్ట్రంలో 30 రకాల చేతి దారులు ప్రధానం గా బి సి, ఎస్ సి, ఎస్ టి, మైనార్టీ వర్గాలకు చెందిన చేనేత, మత్స్యకార,రజక, నాయి బ్రాహ్మణ,వాయిద్య కారులు గొర్రెల కాపర్లు , కల్లుగీత, కుమ్మరి,కమ్మరి,వడ్రంగి,దర్జీలు వడ్డెర,పందుల పెంపకం, మేదర, పూసలు, చర్మకార, తదితర 30 రకాల చేతి వృత్తి దారులందరిని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే చేతి వృత్తి దారులు ఆత్మగౌరవంతో జీవించేందుకు నేడు మారిన సాంకేతిక,యంత్ర పరికరాలను, పనిముట్లను కొనేందుకు కనీసం 5 లక్షల నుండి 10 లక్షల రూపాయల వరకు సబ్సిడీ రుణాలను మంజూరు చేసి,స్వయం ఉపాధితో సొంత కాళ్లపై నిలబడి జీవించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి సహకరించాలని డిమాండ్ చేశారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం పై వత్తిడి తెచ్చేందుకు చేతి వృత్తి దారులందరూ జిల్లాల్లోని కార్పొరేషన్ల కార్యాలయం ఈనెల 13వ తేదీన జరిగే "ధర్నా"లో అధిక సంఖ్యలో చేతి వృత్తి దారులందరు పాల్గొని నిరసన తెలియ జేయాలని విజ్ఞప్తి చేశారు.

# కోటి సంతకాల సేకరణ



ప్రొద్దుటూరు, నవంబర్ 11,(వుదయం ప్రతినిధి) వై.యస్.ఆర్.సి.పి అధ్యక్షులు వై.యస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మెడికల్ కాలేజ్ ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న కోటి సంతకాల సేకరణలో భాగంగా ఇవాళ 11వ వార్డులో రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి ఇంటింటికి పర్యటించి మెడికల్ కాలేజ్ లు ప్రైవేటీకారణ చేస్తే వచ్చే నష్టాల గురించి ప్రజలకు వివరిస్తూ సంతకాల సేకరణ చేపట్టడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆ వార్డు వై.యస్.ఆర్.సి.పి ఇంచార్జ్ కసిరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి మరియు మున్సిపల్ కౌన్సిలర్లు మహిళా నాయకురాల్లు వై.యస్.ఆర్.సి.పి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at Sai Sree Offset Printers, # 7-17-166, 3rd line, Srinagar, Guntur - 522002 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : **SIRIKONDA MARIA, RNI No. APTEL/2014/57702.** E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.